శనివారం
19 జనవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 300

www.vijayakranthinews.com

విజయక్రాంతి

సచిత్ర సకుటుంబ దినపత్రిక

హైదరాబాద్ | PUBLISHED SIMULTANEOUSLY FROM HYDERABAD, NIZAMABAD, KHAMMAM | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



సంక్రాంతి.. బ్రేక్ ఈవెన్ ఎవరికి? 10

సార్వత్రిక ఎన్నికలపై.. సీఈసీ కసరత్తు



- మార్చి మొదటి వారంలో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం

విజయక్రాంతి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల సమరానికి త్వరలో నగారా మోగనుంది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల తేదీలపై కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో మార్చి మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశముంది. ఎన్నికలను ఏయే తేదీల్లో, ఎన్ని దశల్లో నిర్వహించాలనే అంశంపై సీఈసీ తర్జనభర్జనలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది. భద్రతా దళాల లభ్యత, వాతావరణ పరిస్థితులు సహా పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎన్నికల తేదీలను సీఈసీ ఖరారు చేయనుంది.

2014లో మార్చి 5న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన సీఈసీ ఏప్రిల్, మే నెలల్లో తొమ్మిది విడతలుగా పోలింగ్ నిర్వహించింది. ఏప్రిల్ 7న తొలి విడత పోలింగ్ చేపట్టి, మే 12న తుది విడత పోలింగ్‌తో ఎన్నికల ప్రక్రియను ముగించింది. ఈనేపథ్యంలో 2014లో మాదిరిగానే ఈసారి కూడా ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే అవకాశాలు కన్పిస్తున్నాయి. అయితే జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలపై సీఈసీ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. ప్రస్తుత లోక్‌సభ గడువు జూన్ 3తో ముగియనుంది.

శరవేగంగా ప్రాజెక్టులు

- రైతులకు సాగునీరు అందించడానికి అధిక ప్రాధాన్యత
- రూ. 2.25 లక్షల కోట్లతో 1.25 కోట్ల ఎకరాలకు సాగునీరు
- బిల్లులన్నీ వెంటనే చెల్లించండి
- సమీక్షా సమావేశంలో సీఎం కేసీఆర్



విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో 1.25 కోట్ల ఎకరాలకు సాగునీరు అందించడం కోసం రూ.2.25 లక్షల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన నీటి పారుదల ప్రాజెక్టుల పనులు వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైతులకు సాగునీరు అందించడానికన్నా మించిన ప్రాధాన్యత మరొకటి లేదని, ప్రాజెక్టుల నిర్మాణానికి నిధుల కొరత లేదని, వెంట వెంటనే బిల్లులు చెల్లించనున్నట్లు ఆయన వెల్లడించారు. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజి నిర్మించడంతో పాటు, పెద్దవాగు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి సమగ్ర వ్యూహం రూపొందించుకుని నిర్మాణాలు ప్రారంభించాలని, ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం ప్రగతి భవన్‌లో నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆదేశించారు. "తెలంగాణ నిర్మిస్తున్న ప్రాజెక్టుల కోసం ఇప్పటి వరకు రూ.77,777 కోట్ల ఖర్చు జరిగింది. భూ సేకరణ, ప్రత్యామ్నాయ అడవుల పెంపకం కోసం, ఆర్‌ఆర్ ప్యాకేజిల కోసం మరో రూ.22వేల కోట్ల ఖర్చు జరిగింది. మొత్తంగా ఇప్పటి వరకు రూ.99,643 కోట్ల ఖర్చు జరిగింది. ఈ ఏడాది మార్చి నాటికి మరో రూ.7వేల కోట్లకు పైగా ఖర్చు అవుతుంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం వరకు రూ.1.07 లక్షల కోట్లకు పైగా వ్యయం జరుగుతుంది.

గోదావరి, కృష్ణా బేసిన్లలోని ప్రాజెక్టులతో పాటు, మిషన్ కాకతీయ పనుల కోసం మరో రూ.1.17 లక్షల కోట్లు ఖర్చు అవుతాయని అంచనా. రాబోయే ఐదేళ్లలో ఈ నిధులు ఖర్చు చేసి, ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి, మొత్తం 1.25 కోట్ల ఎకరాలకు సాగునీరు అందించడం ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్య సాధన కోసం అధికారులు, ఇంజనీర్లు, వర్క్ ఏజన్సీలు కృషి చేయాలి. ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి, వెంటవెంటనే నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నాం" అని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. "సమైక్య రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నీటి పారుదల ప్రాజెక్టులు ఓ జోక్‌గా మారాయి. ఎన్నికలప్పుడు ప్రాజెక్టుల పేర్లు చెప్పి ఓట్లు అడుక్కోవడమే తప్ప, ప్రాజెక్టులు కట్టి నీళ్లివ్వలేదు.

అత్యధిక వర్షపాతం, పుష్కలమైన నీటి లభ్యత కలిగిన ఆదిలాబాద్ జిల్లా చరిత్ర మార్చాలి. తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించాలి. తమ్మిడిహట్టి బ్యారేజి నిర్మించి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలి. సిర్పూర్ కాగజ్ నగర్ నియోజకవర్గంలో 56,900 ఎకరాలకు, ఆసిఫాబాద్ లో 38,830 ఎకరాలకు, చెన్నూరులో 31,500 ఎకరాలకు, బెల్లంపల్లి నియోజకవర్గంలో 72,770 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. తమ్మిడిహట్టి వద్ద బ్యారేజి నిర్మించి, 20 టిఎంసిల నీటిని వినియోగించుకోవడానికి సి.డబ్ల్యు.సి. అంగీకారం తెలిపింది. ఈ నీటిని సద్వినియోగం చేసుకుని, ఆదిలాబాద్ జిల్లా రైతులకు సాగునీరు ఇవ్వడానికి సమగ్ర వ్యూహం రూపొందించాలి. అదిలాబాద్ జిల్లాలో పెద్దవాగు నీటిని వినియోగించుకోవ డానికి అవసరమైన నిర్మాణాలు చేపట్టాలి. పెన్ గంగ ప్రాజెక్టుపై నిర్మిస్తున్న చనఖాకొరటా ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలి. కుప్టి రిజర్వాయర్ నిర్మాణానికి వెంటనే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించాలి" అని ముఖ్యమంత్రి ఆదేశించారు. "తమ్మిడిహట్టి వద్ద బ్యారేజి నిర్మాణం, చనఖాకొరటా ప్రాజెక్టు, పెద్దవాగు సద్వినియోగం ద్వారా ఆదిలాబాద్ జిల్లాలో చాలా వరకు సాగునీరు అందుతుంది. మిగిలిన భాగానికి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీరు పారుతుంది. కాళేశ్వరం, సీతారామ, దేవాదుల ప్రాజెక్టుల ద్వారా గోదావరి బేసిన్ లో తెలంగాణకున్న వాటాను పూర్తిగా వినియోగించుకోవాలి.

ఇటీవలే కాళేశ్వరం ప్రాజెక్టు పనులను నేను స్వయంగా పరిశీలించాను. నీటి పారుదల శాఖ అధికారులు, రిటైర్డ్ ఇంజనీర్లు కూడా ఈ ప్రాజెక్టు పనులను సందర్శించారు. మొత్తం గోదావరి బేసిన్ లో ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి చేయాల్సిన పనులపై పూర్తి అవగాహన వచ్చింది. ఈ అవగాహనతో ఈ నెలాఖరులోగా కార్యాచరణ ఖరారు చేయాలి. ఫిబ్రవరిలో నేనే స్వయంగా పాలమూరురంగారెడ్డి, డిండి ప్రాజెక్టు పనులను పరిశీలిస్తాను. ఫిబ్రవరి మాసంలో కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయడంపై కార్యాచరణ రూపొందిస్తాం. వర్షాకాలం వరకు వేగంగా పనులు చేసుకునే అవకాశం ఉంది, కాబట్టి వెంటనే కార్యరంగంలోకి దిగాలి" అని ముఖ్యమంత్రి సూచించారు. ప్రాజెక్టుల ద్వారా వచ్చే నీటిని మొట్టమొదట చెరువులకు మళ్లించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ఏడాది కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా అటు మిడ్ మానేరు నుంచి ఎస్.ఆర్.ఎస్.పి వరకు, ఇటు మల్లన్న సాగర్ వరకు నీరు అందుతుందన్నారు. అలా వచ్చిన నీటిని మొదట చెరువులను మళ్లించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ప్రాజెక్టు కాల్వలపై తూములు నిర్మించి, చెరువులను నీరు మళ్లించాలన్నారు. ఏదైనా చెరువుకు ఫీడర్ ఛానల్ లేకుంటే, కొత్తగా కాల్వ తవ్వాలని ఆదేశించారు. ఎస్.ఆర్.ఎస్.పి. రెండో దశ వరకు చెరువులు నింపాలని చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సిఎస్ ఎస్.కె.జోషి, సిఎంఒ కార్యదర్శి స్మితా సభర్వాల్, నీటి పారుదల శాఖ ఇఎన్సి మురళీధర్, ఓఎస్డీ శ్రీధర్ దేశ్ పాండే, సిఇలు హరిరామ్, శంకర్, శ్రీనివాస్ రెడ్డి, ఎస్.ఇ.లు విష్ణు ప్రసాద్, వేణు, ఇఇ రామకృష్ణ, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలు 80 శాతం అమలు చేశాం

- కేంద్రహోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్



విజయక్రాంతి, కడప: ఆంధ్రప్రదేశ్‌లో 80 శాతం విభజన హామీలను అమలు చేశామని కేంద్రహోం శాఖామంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. శుక్రవారం కడపలో జరిగిన రాయలసీమ జిల్లాలకు చెందిన బీజేపీ శక్తి కేంద్ర ప్రముఖ్ సమ్మేళన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏపీ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని చెప్పడానికి ఇదే నిదర్శనమని వ్యాఖ్యానించారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కేంద్రం సంసిద్ధంగానే ఉందని, అయితే సంబంధిత సమాచారం కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవ్వడం లేదని తెలిపారు. అన్ని జిల్లాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, అయితే ఆ వివరాలను ఏపీ ప్రభుత్వం వెల్లడించడం లేదన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలను ప్రస్తావించారు. కాంగ్రెస్‌తో ఏ పార్టీ పొత్తు కుదుర్చుకున్నా.. భూ స్థాపితమవుతుందన్న సంగతి తేలిపోయిందని చెబుతూ, ఇటీవలి తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ దెబ్బతిన్న అంశాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను ప్రస్తావించారు. ఆయన వర్ధంతి రోజున తాను కడపకు వచ్చానన్నారు. దేశ ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీని ఎన్టీఆర్ వ్యతిరేకించారని చెప్పారు. దేశ ఔన్నత్యాన్ని కాపాడేందుకు ఎన్టీఆర్ సిద్ధాంతాలను తాము అమలు చేస్తామన్నారు. ఇద్దరు ఎంపీలతో ప్రారంభమై బీజేపీ మూడు దశాబ్దాల తర్వాత కాంగ్రెసేతర శక్తిగా ఎదిగి, నేడు అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలను స్వీకరించిన తర్వాత ఆర్థికంగా బలమైన దేశాల్లో భారత్ ఆరో స్థానంలో నిలిచిందని చెప్పారు. పార్లమెంట్లో బలంగా ఉన్నా భాగస్వామ్య పార్టీలను తాము గౌరవిస్తున్నామని తెలిపారు. దేశ ఔన్నత్యం కోసం పాటు పడిన వారి ఏ పార్టీకి చెందిన వారైనా తాము గౌరవిస్తామని ప్రకటించారు. దేశంలో గ్రామీణ ప్రజల, అన్నదాతల సంక్షేమం కోసం అనేక పథకాలను కేంద్రం అమలు చేసిందని పేర్కొన్నారు. యాభై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో కనీసం ఇళ్లల్లో దీపాలను వెలిగించలేకపోయారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన ఈ నాలుగున్నర ఏళ్లలోనే ఇంటింటికి విద్యుత్ సరఫరా అందించామని ప్రకటించారు. అవినీతికి తావు లేకుండా పాలిస్తున్నామని, అదే విధంగా దేశ రక్షణ అంశంలోనూ ఎక్కడా రాజీపడడం లేదన్నారు. అందుకే పాకిస్థాన్ టెర్రరిస్టులను వాళ్ల భూభాగంలోనే సర్జికల్ స్ట్రైక్ నిర్వహించి హతమార్చామని తెలిపారు. భవిష్యత్‌లోనూ దేశ రక్షణ అంశంలో రాజీపడేదీ లేదని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లోనూ తామే అధికారంలోకి వస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్, నేతలు పురందరేశ్వరీ, విష్ణువర్ధన్‌రెడ్డి, రమేశ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యానిధికి 42 మంది ఎంపిక



విజయక్రాంతి, హైదరాబాద్: అంబేద్కర్ విద్యానిధి పథకం కింద 42 మంది విద్యార్థులను ఎస్సీ సంక్షేమ శాఖ ఎంపిక చేసింది. ఎస్సీ వర్గానికి చెందిన విద్యార్థులను విదేశాల్లో ఉన్నత చదవులు చదివించేందుకు ప్రభుత్వం అంబేద్కర్ విద్యానిధి పథకాన్ని అమలు చేస్తోంది. ప్రతి ఏటా విద్యార్థులను ఎంపిక చేసి ఒక్కో విద్యార్థికి రూ. 20 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. ఇందులో భాగంగా గతేడాదిలో దరఖాస్తులను ఆహ్వానించగా 48 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అర్హులను ఎంపిక చేయడానికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా సమక్షంలో ఎస్సీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు 45 మంది విద్యార్థులు హాజరుకాగా.. వీరిలో 42 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, జపాన్, ఫ్రాన్స్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా దేశాల్లో ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్, మెడిసిన్, నర్సింగ్, సోషల్ సైన్సెస్. హ్యూమనిటీస్‌లల్లో పీజీ ఆపై కోర్సులు అభ్యసిస్తారని ఎస్సీ సంక్షేమ శాఖ సంచాలకులు పీ కరుణాకర్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు బీ శ్రీనివాసరెడ్డి, జేఎన్‌టీయూ, స్టేట్ కౌన్సిలింగ్ ఫర్ హయ్యర్ స్టడీస్, టెక్నికల్ ఎడ్యూకేషన్ అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ నాయకత్వంలోనే.. 'బంగారు తెలంగాణ'

- 16 లోక్‌సభ స్థానాలూ గెలవాలి: కేటీఆర్
- టీఆర్‌ఎస్‌లో చేరిన వంటేరు ప్రతాప్‌రెడ్డి



విజయక్రాంతి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నాయకత్వంలోనూ బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని భావించే ప్రజలు అఖండ విజయాన్ని కట్టబెట్టారని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు అన్నారు. కాంగ్రెస్‌పార్టీకి చెందిన వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఆయన అనుచరులు శుక్రవారం టీఆర్‌ఎస్ కార్యాలయంలో కేటీఆర్ సమక్షంలో టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో కేటీఆర్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో 50 శాతం ప్రజలు టీఆర్‌ఎస్‌కు ఓట్లేశారని ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 16 పార్లమెంట్ నియోజక వర్గాల్లోనూ విజయం సాధించాలని అప్పుడు కేంద్రాన్ని శాసించి రాష్ట్రానికి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు తెచ్చుకోవచ్చని ఆయన అన్నారు. కాంగ్రెస్, బిజెపికి వ్యతిరేకంగా కేసీఆర్ ఏర్పాటు చేయదలచిన ఫెడరల్ ఫ్రంట్‌కు దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోందని ఆంధ్రప్రదేశ్ వైకాపా పార్టీ కూడా ఫెడరల్ ఫ్రంట్ విధానాల పట్ల సానుకూలతతో ఉందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్,బిజెపి పార్టీలు దేశవ్యాప్తంగా ప్రజాదరణ కోల్పోయారని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా వంద స్థానాల్లో కూడా కాంగ్రెస్‌పార్టీ గెలిచే అవకాశం లేదని, భారతీయ జనతాపార్టీ పరిస్థితి కూడా అదే విధంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

భారతీయ జనతాపార్టీ పరిస్థితి కూడా అదేవిధంగా ఉందని, ప్రధానమంత్రి మోడీతో సహ అనేకమంది బిజెపికి చెందిన ముఖ్యమంత్రులు ప్రచారం చేసినా రాష్ట్రంలో 103 స్థానాల్లో ఆ పార్టీకి డిపాజిట్లు కూడా రాలేదని ఆయన వివరించారు. రాష్ట్రాలను బలోపేతం చేయాల్సిన అవసరంతోనే ఫెడరల్ ఫ్రెంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని, అయితే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. సోనియాగాంధీని అనేక సార్లు విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు అదే పార్టీతో పొత్తు పెట్టుకుంటున్నారని, ఇది ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని కేటీఆర్ విమర్శించారు. నాలుగు సంవత్సరాలు మోడీతో కలిసి పనిచేసిన చంద్రబాబు తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఇతరులను బూచిగా చూపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. 2009 సంవత్సరంలోనే వంటేరు ప్రతాప్‌రెడ్డిని పార్టీలో చేరాలని తాను ఆహ్వానించానని అయితే 10 సంవత్సరాల తర్వాతనైనా ఆయన పార్టీలోకి రావడం ఆనందంగా ఉందని (తరువాయి 4లో)

నేడే యునైటెడ్ ఇండియా ర్యాలీ

- బెంగాల్‌లో ప్రతిపక్షాల ఐక్యత చాటే భారీ కార్యక్రమం
- కాంగ్రెస్‌తో పాటు పలు పార్టీల మద్దతు
- హాజరుకానున్న ప్రముఖ నేతలు



విజయక్రాంతి, కోల్‌కతా: ప్రతిపక్షాల సమైక్యతను చాటేందుకు తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ ఆధ్వర్యంలో శనివారం కోల్‌కతాలో భారీ స్థాయిలో 'యునైటెడ్ ఇండియా ర్యాలీ' జరగనుంది. మరి కొన్ని నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీజేపీ వ్యతిరేక పార్టీలన్నీ కలిసి రావాలని ఆమె ఆహ్వానించారు. కాగా ఈ మెగా ర్యాలీకి కాంగ్రెస్ పార్టీ తన మద్దతు ప్రకటించింది. ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ శుక్రవారం మమతా బెనర్జీకి ఈమేరకు లేఖ రాశారు. మమతా దీ అని సంబోధిస్తూ ఆయన ఈ లేఖ రాశారు. 'మమతా దీకి నేను మద్దతిస్తున్నా. యునైటెడ్ ఇండియా ర్యాలీ.. పార్టీల ఐక్యతను చాటడమే కాకుండా బలమైన సందేశాన్ని పంపుతుందని ఆశిస్తున్నా' అని రాహుల్ అందులో పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, లౌకికవాదం అనే స్తంభాలపైనే అభివృద్ధి, నిజమైన జాతీయత ఉంటుందని నమ్మి అన్ని ప్రతిపక్ష పార్టీలు ఏకమవుతున్నాయని ఆయన అన్నారు. మనమంతా కలిసి సమైక్య భారత దేశం సందేశాన్ని శక్తిమంతంగా పంపించగలమన్న ఆశాభావం వ్యక్తం చేశారు. 'దేశంలోని ప్రతిపక్షాలన్నీ ఏకమై బలమైన శక్తిగా రూపొందుతున్నాయి. మోదీ ప్రభుత్వం చేసిన మోసపూరితమైన వాగ్దానాలు, అసత్యాల వల్ల జనాలు కోపం, నిరాశలో మునిగిపోయి ఉన్నారు. ప్రసుత్త భారతదేశం రేపటి గురించి ఆందోళన చెందుతోంది. ఈ బలాలన్ని రేపటి గురించి ఆశను రేకేత్తిస్తున్నాయి. కులం, మతం, ప్రాంతం, ఆర్థిక హోదాలతో సంబంధం లేకుండా దేశంలోని ప్రతి ఆడ, మగ, పిల్లలు, పెద్దలు అందరిని వీరు గౌరవిస్తారు. బీజేపీ, మోదీ కలిసి ప్రజాస్వామ్యాన్ని, సామాజిక న్యాయాన్ని, లౌకికవాద సిద్ధాంతాలను నాశనం చేశారు. వాటి పరిరక్షణ కోసం ప్రతిపక్షాలన్ని ఏకమవుతున్నాయి' అని రాహుల్ గాంధీ తన లేఖలో స్పష్టం చేశారు. కాగా ఈ ర్యాలీకి సోనియా, రాహుల్ హాజరుకావడం లేదు. కాంగ్రెస్ పార్టీ తరుపున మల్లికార్జున ఖర్గే, అభిషేక్ మను సింఘ్వి హాజరవుతారని ఆ పార్టీ ప్రకటించింది. అలాగే బీఎస్పీ అధినేత్రి మాయావతి కూడా ఈ ర్యాలీకి వెళ్లడం లేదు. ఆమె తరపున పార్టీ నేత సతీష్ మిశ్రా వెళ్లనున్నారు. అయితే నేటి ర్యాలీలో మాజీ ప్రధాని దేవె గౌడ, ఆయన కుమారుడు, కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా, ఆయన కుమారుడు ఒమర్ అబ్దుల్లా, ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, ఆర్జేడీ నేత, లాలూ ప్రసాద్ యాదవ్ తనయుడు తేజస్వి యాదవ్ పాల్గొనున్నారు.

దిమాక్ ఖరాబ్



యుద్ధం లేదు.. సైనికులు అమరులవుతున్నారు!

- ద్రవ్యోల్బణం.. నిరుద్యోగం పెరిగిపోతోంది
- మన దేశంలో ఎందుకిలా జరుగుతోంది?
- ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఆవేదన




విజయక్రాంతి, నాగపూర్: మన దేశంలో యుద్ధమేమీ జరగడం లేదు.. కానీ సైనికుల మాత్రం ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) చీఫ్ మోహన్ భగవత్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నాగపూర్‌లో జరిగిన ప్రహార్ సమాజ్ జాగృతి సంస్థ సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన్ భగవత్ ప్రసంగిస్తూ.. ఎంతో మంది ప్రాణాలు అర్పించి స్వాతంత్ర్యం సాధించుకున్న పరిస్థితి పూర్వం ఉంటే, తర్వాతి కాలంలో యుద్ధ సమయాల్లో మాత్రమే మన సైనికులు ప్రాణాలు కోల్పోయేవారు అని అన్నారు. ప్రస్తుతం యుద్ధ పరిస్థితులు లేనప్పటికీ, అన్యాయంగా శత్రువుల చేతిలో సైనికులు ప్రాణాలు కోల్పోతున్నారని, ఇది కేవలం మన కర్తవ్య నిర్వహణలో లోపమని భగవత్ వ్యాఖ్యానించారు.

' దేశంలో యుద్ధ వాతావరణం లేకపోయినా సరిహద్దుల వెంబడి ఎంతో మంది సైనికులు అసువులు బాస్తున్నారు. యుద్ధం జరగని క్రమంలో ఇలాంటి పరిస్థితులు ఎందుకు నెలకొన్నాయి. అకారణంగా సైనికులు అమరులవుతున్న ప్రస్తుత పరిస్థితి మారాల్సి ఉంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రజల వైపు నుంచి కూడా తగిన తోడ్పాటు ఉండాలి. దేశాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు పోరాడాలి. మనం దేశాన్ని అత్యున్నత స్థానంలో నిలబెట్టాలంటే.. కొన్ని త్యాగాలకు పూనుకోవాల్సి ఉంటుంది. దేశ భద్రత కేవలం సైనిక బలగాలకు సంబంధించిన వ్యవహారం కాదు. ఇతరులకు బాధ్యతలు అప్పగించినట్లుగా ఈ అంశం ప్రభుత్వం చూసుకుంటుందని, ఆర్మీ చూసుకుంటుందని, పోలీసులు చూసుకుంటారని భావించొద్దు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఇందుకోసం కృషి చేయాలి. ప్రభుత్వం, పోలీసులు, ఆర్మీతో బాటుగా సాధారణ పౌరులు కూడా దేశ భద్రతలో తమ వంతు పాత్ర పోషించాలి..' అని మోహన్ భగవత్ సూచించారు.

అయ్యప్పను 51 మంది మహిళలు దర్శించారు

- అంతా 50 ఏళ్ళ లోపు స్త్రీలే
- సుప్రీం కోర్టుకు కేరళ ప్రభుత్వం నివేదిక
- బిందు, కనకదుర్గలకు 24/7 రక్షణ కల్పిస్తామని భరోసా



విజయక్రాంతి, తిరువనంతపురం: శబరిమల ఆలయంలోకి అన్ని వయసుల మహిళలను అనుమతిస్తూ గత ఏడాది సెప్టెంబర్ 28న సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. కాగా ఈ తీర్పు వెలువడిన తర్వాత నుంచి ఇప్పటి వరకు 51 మంది మహిళలు లోని ప్రవేశించి అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారని కేరళ ప్రభుత్వం తెలిపింది. వారంతా 50 ఏళ్ల వయసులోపు మహిళలేనని పేర్కొంది. శుక్రవారం ఈ జాబితాను సర్వోన్నత న్యాయస్థానానికి అందజేసింది. అయ్యప్ప ఆలయంలోకి అడుగుపెట్టిన తొలి ఇద్దరు మహిళలు తమకు భద్రత కల్పించాలని కోరుతూ పిటిషన్ వేసిన నేపథ్యంలో ఇప్పటి వరకు ఆలయంలోకి ప్రవేశించిన మహిళల జాబితాను కేరళ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు నివేదిక ఇచ్చింది. ఇప్పటి వరకు దాదాపు 16 లక్షల మంది భక్తులు ఆలయ ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని, వారిలో ఏడు వేల మంది మహిళలున్నట్లు వెల్లడించింది. వారంతా పది నుంచి 50 ఏళ్ల వయసులోపు వారేనని స్పష్టం చేసింది. 16 లక్షల మందిలో 8.2 లక్షల మంది స్వామి వారిని దర్శించుకున్నారని, ఏడు వేల మందిలో ఆలయంలోకి ప్రవేశించిన వారిలో 50 ఏళ్ళ లోపు మహిళలు కేవలం 51 మందేనని కేరళ ప్రభుత్వం పేర్కొంది.





శ్రీ విళంబి నామ సంవత్సరం	సూర్యోదయం	: ఉ. 06:49	కరణం	: కౌలవ 07:02 తైతుల 17:34
ఉత్తరాయణం	సూర్యాస్తమయం	: సా. 06:03	రాహుకాలం	: ఉ. 09:40, 11:03
హేమంత ఋతువు	పక్షము	: శుక్ల పక్షం	యమగండం	: మ. 01:50, 03:13
పుష్య మాసం	తిథి	: త్రయోదశి 17:34 తదుపరి చతుర్దశి	వర్జ్యం	: సా. 06:05, 07:31
	నక్షత్రం	: మృతగశిర 10:31	అమృతకాలం	: రా. 11:07, తె. 12:34
	యోగం	: ఇంద్ర 18:38		



సూక్తి సుధ

ప్రతి ఒక్కరిలో మంచీ చెడు రెండూ ఉంటాయి.. అయితే మనం ఇతరులలో మంచే చూడాలి.. దానినే అలవాటు చేసుకోవాలి.

–గౌతమ బుద్ధుడు



మాస్టరుగారి యోగమార్గం




మాస్టరుగారు తమ యోగ సంప్రదాయాన్ని శిష్యుల ద్వారా లోకమునకు ప్రసాదించుటకై కొన్ని మంత్రములను గ్రహించారు. అందు ఎక్కువ భాగం ఇంగ్లీషులో ఉంచి. మంత్రములు సంస్కృత భాషలో ఉండగా ఆంగ్లంలో ఉంటే మేలని నాటి నుండి నేటి వరకు కొందరు సందేహిస్తున్నారు. మంత్రములకు శబ్ద తరంగాలు ప్రధానంగా భాష, టీకా తాత్పర్యములను కావు. అర్ధమునకు కొంత ప్రాధాన్యముంది. కాని, మాస్టరుగారి మంత్రములు నిర్దిష్టాలైన అర్థములు గల వ్యాకరణబద్ధ వాక్యములు కావు. మనస్సును ధ్యేయం వైపునకు మరల్చుటకు సహకరించేంత వరకే మంత్రముల అర్థం ఆవసరం. తెలిసిన అర్థం మనసును నిర్లక్ష్యం చేస్తుంది. తెలియని అర్థానికి వైముఖ్యం వహిస్తుంది. తెలియునట్లు కనిపించి తెలియని తత్వములోనికి గొనిపోవు అర్థమునకు మనస్సు కుతూహలపడి అందలి అర్థమును వెదుకబోవును. ఆ ప్రయత్నమున లీనమై పరతత్వానుభూతిలో ప్రవేశించును. కనుకనే వీరిచ్చిన మంత్రములు నిర్దిష్టానిర్దిష్టమైన విచిత్రమూర్తిని మనసునకు కల్పిస్తున్నాయి.

ఆంగ్లంలోనే మంత్రములు ప్రసాదించుటలో మరొక అంశం కూడా కలదు. రాబోవు కాలమున బ్రహ్మవిద్య ఆంగ్లభాష మూలంగా వ్యక్తమవుతుందని, ఆంగ్లం యోగభాషగా వర్తించగలదని, దివ్యజ్ఞాన గురువులలో ఒకరు తమ శిష్యులకు రాసిన రహస్య లేఖలలో తెలియపరిచారు. దాని కోసం పూర్వం సంస్కృత భాషకు చేసిన సేవ ప్రస్తుతం శబ్దమయ దేవతలు. ఋషులు ఆంగ్లమునకు చేయుచున్నారు. ఈ కారణముననే నేటి ఆంగ్ల వర్ణముల లిపి సంకేతములన్నియు సర్వప్రపంచ సాధకుల ధ్యాన యంత్రముల నుండి స్వీకరింపబడి స్థిరత్వాన్ని పొందెను. మాస్టరుగారు ప్రసాదించిన మంత్రములు రెండు విధములు. 1. Prayers 2. Courses. అందు Courses కుండలిని మున్నగు ప్రత్యేక సాధనము చేయుటకు నిర్దేశించబడినవి. ప్రేయర్స్ సర్వసామాన్యముగా యోగమార్గం ననుసరించు వారెల్లరును చేయవచ్చును. దానివలన వారికి యోగానుభూతి వల్ల క్రమవికాసం కలుగుతుంది. వాస్తవానికి సర్వప్రయోజనాలకును ప్రేయరు ఒక్కటి చాలును. దానివల్ల అన్ని సిద్ధించును. కాని సాధకుల మనస్సును బట్టి వేరుగా Courses నిచ్చిరి. సిద్ధికి సులభ మార్గాన్ని ప్రసాదించినప్పుడు చాలామందికి గురి కుదరదు. దేనికైనా ప్రత్యేకంగా సాధించాలనే అభిలాష (రజోగుణ దోషం) వారికుంటుంది. ఇట్టివారి కుతూహలమును తీర్చటానికే లీలాప్రాయంగా మాస్టరుగారు కోరనవన్నీ courses ప్రసాదించి వానికి సంబంధించిన వివిధ యోగానుభూతులను కల్పించారు.

వీరు స్థాపించిన యోగసాధనా సంప్రదాయం పేరు 'భృక్తరహిత తారక రాజయోగము'. సామాన్యంగా మానవులు పూర్వకర్మఫలాన్ని అనుసరించి జీవితాన్ని గడుపుకుంటారు. ఆ కర్మ వాసనారూపమై ఉండి వారి మనస్సును, వాక్కును, పనులను అంటియుండును. దానిచే ఎల్లరును బద్ధులవుతున్నారు. ఆ పూర్వ కర్మఫలాన్ని అనుభవించి తీరాలని, అప్పుడు కాని విమోచనం జరగదని కొందరు నమ్ముతున్నారు. తమకు శరణాగతి జొచ్చి, తమ యోగాన్ని ఆరంభించిన వారికి పూర్వ కర్మరహితమగునని మాస్టరుగారు వాగ్దానం చేసారు. రహితమగుటకు అనుభవింపనక్కరలేదు. వీరి విచిత్రమైన యోగ మార్గము చాలును.

ఈ సృష్టిలో చరాచర జగత్తుగా మనం గమనించేదంతా అణువులుగా నిర్మింపబడి, అంతర్లీనంగా ప్రవహిస్తున్న శక్తిచే నిర్వహింపబడి, శాశ్వత ప్రజ్ఞయందు స్థానం గొనియున్నది. కనుక అణుమయ జగత్తు, శక్తి, ప్రజ్ఞయను మూడును ఈ సృష్టియందున్న ప్రధానాంశాలు. ఈ మూడును దేన్నుండి ఉద్భవించి, దేనియందు వసించి, దేనియందు లీనమగుచున్నవో దానినే అనుభవించిన వారు బ్రహ్మము, పరబ్రహ్మము అనే పేర్లతో వ్యవహరిస్తున్నారు. మానవ శరీరమందు గూడా నీ మూడు అంశములే ఉన్నవి. ఇవి వర్తిస్తున్న పరబ్రహ్మ ఒక్కటే మూడుగా వర్తించుచుండుట ప్రకృతి అనబడే శక్తి వల్ల కలుగుతుంది. ఈ ప్రకృతి త్రిగుణాలుగా, మనోబుద్ధ్యహంకారా దులుగా, ప్రాణముగా, అణువులుగా దిగొచ్చి, ఈ అణువులు ఖనిజ పదార్థాలుగా పరిణామం చెంది, వాని సమ్మేళనంతో వృక్షములకు, జంతువులకు, మానవులకు శరీరాలు తయారవుతున్నాయి. కనుక ఇన్ని పరిణామాలకు మూల కారణం ప్రకృతే. ఈ శక్తి మానవశరీరం ఉన్నతస్థాయి చేరుకొంటుంది. దానినే పెద్దలు కుండలిని వ్యవహరించారు. వివిధ యోగమార్గాల వారు ఈ శక్తిని గూర్చి కృషి చేస్తున్నారు. శరీరంలోని ధాతువులను కొన్ని సాధానాలచే, ఆహారాది నియమాలచే పరిశుద్ధి చేసి వ్యాయామం, ఆసనాలు, ముద్రలు, బంధాలు మున్నగువానిచే కుండలిని ఉద్బోధన చేయు ప్రయత్నాన్ని హఠయోగం అంటారు. శబ్దోచ్ఛారణతో మనస్సును జతపరిచి, శ్వాస యందు మనస్సుగా మాయమై, హృదయమందు అనుభూతిగా, ప్రేమమయ స్వరూపుడుగా రెండవ జన్మమెత్తుట వేదమార్గానికి సంబంధించిన యోగం. గురువు అనుగ్రహం వల్ల తన శక్తిచే మనసును, బుద్ధిని, ఇంద్రియాలను శరీరమందలి ప్రతి అణువును 'తన' మయంగా చేసి తానందు వర్తించుట శ్రీకృష్ణుడు ఉపదేశించిన యోగం. యమము, నియమము మున్నగు ఎనిమిది అంగముల క్రమమున ఈ స్థితి అభ్యాసం చేయుట పతంజలి యోగమార్గం. ఇవి ప్రధానమైన మార్గాలు. ఇవికాక చిన్న చిన్న మార్గములు కొన్ని వేలు కలవు. ప్రధాన మార్గములను గమనిస్తే ఇన్ని విధాల యోగసాధనలు భిన్నంగా లేవనియు, ఒకే యోగమునకు వివిధ దశలలోని సాధానాలివని తెలుస్తోంది. ఇట్లే కర్మయోగం, జ్ఞానయోగం, భక్తియోగం అనునవి కూడా యోగసాధకుని సాధన సమన్వయానికి భగవద్గీత మున్నగు యోగ గ్రంథాల్లో చెప్పబడ్డాయి. పామరులు వానిలో ఒక్కొక్క దాని ఒక్కొక్క యోగసాధనా మార్గంగా భ్రమించి సాధింప వ్యర్థ ప్రయత్నాలు చేస్తున్నారు. మరికొందరు ప్రశాంతంగా సమన్వయిం చుకొనే సంకల్పం లేక, భగవద్గీత మున్నగు గ్రంథాల్లో తప్పులున్నాయని వ్యర్థ ప్రలాపాలు చేస్తూ, జన్మల చక్రంలో పడి నలిగిపోతున్నారు. అందులో కొందరు భగవద్గీతలోని తప్పులను చూపించుటకు మాత్రమే గ్రంథములు రచించి, యోగాన్ని సాధించామనుకొని చనిపోయనవారు కలరు. ఇన్ని యవస్థల వారిలో మాస్టరుగారి దర్శనం చేసినవారున్నారు. మాస్టరుగారి యోగమార్గం తమకు నచ్చిన ఒక భిన్నమైన మార్గమనుకొని భ్రమపడి కొందరు మిగిలిన మార్గాలకన్నా ఇది ఏ విధంగా ఘనమైందో నిరూపించుచుంటిమనుకొని పెడసరము వహించుచున్నారు. ఇందరినీ చూస్తూ వాత్సల్యభావంతో మాస్టారుగారు సమన్వయపరచుటకు తమ పరిపూర్ణ ప్రజ్ఞ సంస్పర్శనము కలిగించుకున్నారు. మహాత్ములకు ఇన్ని యోగమార్గాలు ఉండవు. యోగమనగా ఏకత్వమే కానీ, మిగిలిన మార్గాలకన్నా ప్రత్యేకత అవలంభించుతూ బహుత్వమను బురద గుంటలో బడుటకాదు. వీరందరును తమ అభిప్రాయాలను మాస్టరుగారి అభిప్రాయాలుగా నిరూపింపచూజుట తమలోని రజస్తమనస్సుల దోషాన్ని తెలియచేస్తుంది. మనం తెచ్చుకున్న రంగుల కంటి యుద్ధముల్లో నుండి మాస్టరుగారి యోగాన్ని పరికించి ప్రవచనం చేయరాదు. 'నాయమాత్మా ప్రవచనేన లభ్యః' మాస్టరుగారు నిర్వచనములకు, ప్రవచనములకు లభించువారు కారు. సాధకులు తమ లోపములతోపాటు తమ్ము మాస్టరుగారి దివ్యజ్యోతి యందు సమర్పణము చేసుకొని సన్యాసమును పొందవలెను. ఆ వెలుగుతో 'తదితరులు' మనయోగ మందలి కన్న వెలుపుల నున్న సామాన్య జీవులు కనుపించు జబ్బు నశింపవలెను. మాస్టారుగారు సాధనమార్గమిచ్చింది సాధకుని బేధభావం నశించుటకే గాని, తమ్ముతాము వేరుగా గుర్తించుకొనుటకు కాదు.

భౌతిక మానసికాధ్యాత్మిక శక్తులను సమన్వయించి మానవునిలో ప్రతి అణువుయోగ పరిపూర్ణత చెందుటయే మాస్టరు గారు సాధించిపెట్టిన పరిపూర్ణయోగం. ప్రత్యేక జన్మలలోని జనన మరణబంధ స్థితి నుండి సృష్టి పరిణామంలోని కుండలినీ ప్రజ్ఞలో ప్రవేశించి, మృత్యుంజయ స్థితి నుండి సృష్టి పరిణామంలోని కుండలినీ ప్రజ్ఞలో ప్రవేశించి, మృత్యుంజయ స్థితి నంది అట నుండి అమృతత్వంలోనికి సశరీరముగా నడుగుపెట్టుట మాష్టరుగారిచ్చిన యోగం. సృష్టి పరిణామమునకు, శరీర నిర్మాణానికి, దాంపత్యానికి, గర్భధారణమునకు, శరీర మానసికాది కోశముల పెరుగుదలకు ప్రజ్ఞా పరివ్యాప్తికి, ఆత్మవికాసమునకు ఏ కుండలినీ శక్తి కారణమో, అణువులలోని విశ్వలీలా నర్తనమునకు ఏ కుండలినీ శక్తికారణమో, దానినే మాస్టారుగారు మానవుని యోగపరిపూర్ణతకు కూడా ప్రధాన కారణంగా స్వీకరించారు.



మాస్టర్ సి.వి.వి

శత్రువులతో ఎలా వ్యవహరించాలి


చాణక్యం

శ్లో॥ అనులోమేన బలినం ప్రతిలోమేన దుర్జనమ్।
ఆత్మతుల్యబలం శత్రుం వినయేన బలేన వా॥

బలవంతుడైన శత్రువును అతనికి అనుకూలంగా వ్యవహరించును, దుష్టుడైన శత్రువును అతనికి ప్రతికూలంగా వ్యవహరించును, తనతో సమానమైన బలం గల శత్రువును వినయంతోగాని లేదా బలంతో గాని వశం చేసుకోవాలని చాణక్యుడు తన నీతిశాస్త్ర శ్లోకంలో తెలియచేస్తున్నారు. శత్రువులతో ఎలా వ్యవహరించాలో వివరిస్తున్నారు. మొదటి అంశం శత్రువుకు అనుకూలంగా వ్యవహరించటం. పూర్వకాలంలో ఇది రాజులకు వర్తిస్తుంది. రాజులు కూడా సాటి రాజ్యాల రాజుల బలాబలాలను అంచనా వేస్తుంటారు. దీని కోసం గూఢచారులను ఏర్పాటు చేసుకుంటూంటారు. వారు శత్రురాజుల బలాబలాలను విశ్లేషణ చేసి తనవైపు బలం ఎంత ఉందో అని విశ్లేషించుకుని దాని ప్రకారం వీరు పావులు కదుపుతుంటారు. అంటే అవతల శత్రురాజు బలమైనవాడయితే వీరితో స్నేహపూర్వకంగా ఉండటం, అతనికి అనుగుణంగా స్పందించడం వంటివి చేస్తూంటారు. దీనివల్ల యుద్ధ వాతావరణం రాకుండా ఏవైనా సమస్యలు ఉంటే శాంతియుతంగా పరిష్కరించుకుంటారు. తనతో సమానంగా ఉండే రాజులు ఉంటే వారిని తన వినయంతో గానీ బలం ఎక్కువగా ఉంటే వారిని వశపరచుకునేందుకు ప్రయత్నించవచ్చు. వీటన్నింటిని మించి దుష్టప్రవత్తితో వ్యవహరించే శత్రువులను ఇంకే మాత్రం ఆలోచించకుండా వారిని ఎదుర్కొనేందుకు వ్యూహం పన్ని వారిని ఓడించవచ్చు. ఇప్పటి కాలంలో కూడా మనకు కూడా ప్రత్యర్థులు ఉంటారు. మనం కూడా వారి బలాన్ని, తెలివితేటలను పరిగణనలోకి తీసుకుని తర్వాత వారి యెడల ఎలా వ్యవహరించాలో ఆలోచనలు చేసి దాని ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత కాలాన్ని బట్టి ఎదుటి వ్యక్తులను అంచనా వేయటం కొంచెం కష్టంగానే ఉండవచ్చు. వారిని అంచనా వేయడం చాలా సమయంతో కూడినది అవుతుంది. కాబట్టి వారితో శాంతియుతంగానూ, సమయస్ఫూర్తితో వ్యవహరించడం, వారిలో మనకు నచ్చని అంశాలున్నా కూడా సర్దుకుని స్నేహం చేయడం ద్వారా శత్రుత్వాన్ని తగ్గించుకోవచ్చు. అప్పటి కాలానికి, ఇప్పటి కాలానికి కొన్ని తేడాలు సాధారణంగా ఉంటాయి. అప్పటి కాలం ప్రకారం నడుచుకుంటే సమస్యలు పరిష్కారం కావు. కాబట్టి ఇప్పటి దేశకాలమాన పరిస్థితులకు తగ్గట్టుగా వ్యవహరిస్తే వ్యక్తుల మధ్య ఉద్రిక్తతలు తగ్గించుకుంటే స్నేహపూరిత వాతావరణం ఏర్పడి కాలం నిర్విఘ్నంగా గడిచిపోతుందనటంలో ఎటువంటి సందేహం లేదు.

– యామిజాల సుబ్రహ్మణ్యం

సంఘ నీతులు



నిన్న ఉదయం తొమ్మిది ముప్పావుకు బయటికి వెళ్ళిన భగవాన్ తిరిగి హాలు వద్దకు వచ్చేసరికి ఆశ్రమంలో తిరుగుతున్న ఒక కుక్క కొత్తగా వచ్చిన మరొక కుక్కపైన అధికార స్వరంతో అరుస్తూ, దాన్ని తరమాలని హాలు ముందర గంతులు పెడుతూ ఉన్నది. అక్కడ ఉన్నవారంతా దాన్ని అదిలిస్తూ ఉంటే భగవాన్ చూచి నవ్వుతూ 'ఎక్కడా మొదట వచ్చినవారంతా వెనుక వచ్చిన వారిపైన అధికారం చేయటం మామూలేగదా? ఇదీ అట్లాగే తన హక్కు స్థిరపరచుకొనే నిమిత్తం దానిమీద అధికారం చేస్తున్నది' అని చెప్పి ఆ పాత కుక్కను చూచి 'ఎందుకురా అరుస్తావు? పోపో' మ్మన్నారు. వారి మాటలు అర్థమైనట్లే అది తొలగిపోయింది.

ఈ ఉదయం పది గంటలకు డాక్టర్ అనంత నారాయణరావు భార్య రమాబాయి తమ తోటలోని మామిడి పండ్లు మంచిరకమని తెచ్చి ఇచ్చి 'కోతులు అన్నీ ఎత్తుకుపోవుతున్నవి. ఇవి మాత్రమే మిగలటం చేత త్వరపడి కోసి తెచ్చాం' అన్నది. భగవాన్ చిరునవ్వుతో 'ఓహో అట్లాగా, ఈ కోతులు అక్కడికిన్ని వస్తున్నవా?' అని రవంత ఆశ్చర్యం అనుభవించి, అందరి వంకా చూచి 'అవును. కోతులైతే ఒక్కక్కటే ఎత్తుకపోతవి. మనుష్యులైతే అన్నీ ఒక్కసారే గ్రహిస్తారు. అదేమీ అంటే, మా హక్కంటారు. కోతులది చిన్న దొంగతనమైతే వీరిది పెద్ద దొంగతనం. ఆ విషయం గమనించక వారిని వీరు తరుముతారు. వీరిది మహా న్యాయమైనట్లు' అన్నారు.

– సూరి నాగమ్మ
(రమణాశ్రమ లేఖలు)

అరబిక్ భాషలో వైద్య, ఖగోళ శాస్త్ర గ్రంథాలు

వేద విజ్ఞానం

భాగం-79

బెర్లిన్‌కు చెందిన ఆచార్య ఎడ్వర్డ్.సి.సచావ్ 'ఇండికా'ను ఇంగ్లీషు భాషలోకి అనువదించాడు. ఇది రెండు సంపుటాలుగా ముద్రించబడింది. ఈ రచయిత (దీక్షిత్) శక.950కు పూర్వపు గ్రంథకర్తలను గురించి ఇందులో ఉన్న సమాచారాన్ని అందిస్తున్నాడు.

మహమ్మదీయులలో హిందూ ఖగోళశాస్త్ర విస్తరణ

సింధు ప్రాంతం కొంతకాలం బాగ్దాద్ ఖలీఫాల నియంత్రణలో ఉండేది. క్రీ.శ. 753–774 ప్రాంతంలో ఖలీఫా మన్సూర్ కాలంలో, సింధు రాజ్యాధిపతి ఖలీఫా వద్దకు కొంత మంది దౌత్యవేత్తలను, ఖగోళ శాస్త్రవేత్తలను పంపడం జరిగింది. వీరి సహాయంతో సంస్కృతంలో ఉన్న కొన్ని గ్రంథములను అరబిక్ భాషలోకి మార్చడం జరిగింది. క్రీ.శ. 778లో బాగ్దాద్‌లో ఒక హిందూ ఖగోళశాస్త్రవేత్త నివసించాడు. కాలీఫ్ హరౌన్ (786–806) కాలంలో హిందువుల వైద్య, ఖగోళ శాస్త్ర గ్రంథములు అరబిక్‌భాషలోకి అనువదించబడ్డాయి. బ్రహ్మగుప్తుని బ్రహ్మసిద్ధాంతం, ఖండఖాద్యం అంతకుముందే తర్జుమా అయి ఉన్నాయి. వివిధ సంస్కృత ఖగోళశాస్త్ర గ్రంథముల ఆధారంతో అరబిక్‌లో స్వతంత్ర రచనలు చేశారని తెలుస్తోంది.

క్రీ.శ. 8వ శతాబ్దం ఉత్తరార్ధంలో అల్ ఫజారి, యాకుబ్–బిన్–తారిక్, అబూ అల్ హసన్ వంటి అరబ్ ఖగోళశాస్త్రజ్ఞులు ఉండేవారు. వీరు పైన తెలియచేసిన హిందూ ఖగోళశాస్త్రవేత్తల సహాయంతో, అరబిక్ భాషలో గ్రంథములను సంకలనం చేశారు. ఇవేమి ప్రస్తుతం లభించుట లేదు. పైన ఉదహరించిన ముగ్గురు అనువదించిన గ్రంథములు అల్ బెరూని వద్ద ఉండేవి. వీరిలోని పై ఇద్దరు రాసిన గ్రంథములను తరచు అవలోకనం చేసేవాడు. ఇందులో సంస్కృత గ్రంథములలో సాధారణంగా లభించే ఈ దిగువ తెలియచేసిన విశేషములు ఉండేవి. కాలగణన, మహాయుగంలో లేదా కల్పములో గ్రహభగణములు, గ్రహకక్ష్యల దైర్ఘ్యము, మధ్యగ్రహ సాధనకై అహర్గణ సాధన, కోణజ్యాలు, గ్రహ ఉదయాస్తమయములు, చంద్రోదయం మొదలైనవి. అరబ్బులు మొదట భారతీయ ఖగోళ శాస్త్రములను నేర్చుకున్న తర్వాత, వారికి టోలమీ గ్రంథముల గురించి తెలిసింది. భారతీయ ఖగోళశాస్త్రాన్ని మహమ్మదీయులకు బోధించిన మొదటి గురువు అల్ ఫజారి. యాకుబ్ తన గ్రంథాన్ని సంకలనం చేయడానికి ముందే, ఖండఖాద్యం అరబిక్ భాషలోకి అనువాదం చేశారు. దీని అనువాదకర్త అల్ ఫజారీ అని తెలుస్తోంది.

–డా॥ రేమెళ్ల అవధానులు

ధర్మ సందేహాలకు సమాధానాలు

అణిమాద్యష్టసిద్ధులు అంటే ఏమిటి?

1. అణిమ: తన రూపాన్ని కంటికి కనబడనంత అణురూపంగా మార్చుకోవడమే అణిమా సిద్ధి.

2. మహిమ: తన రూపాన్ని అతిపెద్దగా మార్చుకోవడం మహిమా సిద్ధి

3. గరిమ: తన శరీరాన్ని ఎవ్వరూ కదపలేనంత బరువుగా మార్చుకోగల శక్తిని గరిమాసిద్ధి అంటారు.

4. లఘిమ: తన శరీరాన్ని దూదికంటే తేలికగా మార్చుకోవడమే లఘిమాసిద్ధి

5. ప్రాప్తి: తన శరీరాన్ని ఎవ్వరికి ఏ రూపంగా కావలెనో ఆ రూపంగా కనబడేట్లు చేసుకొనే శక్తినే ప్రాప్తిసిద్ధి అంటారు.

6. ప్రాకామ్య సిద్ధి: 1. తన శరీరంతో ఆకాశంలో ఎగిరిపోవడం 2. నీటిలో ఎవ్వరికీ కన్పించకుండా కొన్ని రోజులుండడం 3. నీటిపై పద్మాసనం వేసుకొని కూర్చోవడం లేదా పడుకొని తేలిపోవడం 4. భూగృహంలో పాతిపెట్టినా జీవించడం.

7. ఈశత్వము: మాములు శక్తికన్నా గొప్పశక్తులు గల సూర్య చంద్రాదుల ద్వారా కూడా పనులు చేసుకొనే శక్తి ఈశత్వము.

8. వశిత్వము: క్రూర జంతువులను వశపరుచుకోవడం, అందరినీ ఆకర్షించే శక్తి వశిత్వము.

వరలక్ష్మీదేవి



త్రికోణాంబగా నన్ను నడిపిస్తూ, దిశానిర్దేశనం చేస్తున్న బాలాత్రిపుర సుందరికి ఆత్మాంజలి. లలితా మహాభట్టారిక ఏ దారిలో నన్ను నడిపించినా ఆ మార్గాన్ని, నడకను, నీకు దగ్గరగా మార్చే శక్తి ప్రసాదించమని భూత, భవిష్యత్ వర్తమానాల అధికారిణిని ప్రార్థిస్తున్నాను. మార్గమేదైనా, అడుగు ఎటువైపైనా ఓ తల్లీ! నీ కంటి చూపులను అనుసరించి నడవడమే మాకు ఇష్టమైన పని. మమ్ములను, మేము చేస్తున్న పనిని, మా అంతరంగంలోని ఆలోచనలను అన్నింటినీ సుగంధభరిత పుష్పమాలికగా మార్చి, కూర్చి, నీకే అలంకరిస్తున్నాను. ఈ అలంకారాన్ని ఇష్టపూర్వకంగా స్వీకరించి నన్ను అనుగ్రహించుమమ్మా! నీవు ఇచ్చిన స్ఫూర్తితోనే గదా, నీ అనుగ్రహంతోనే గదా ఈ వరలక్ష్మీవ్రతం, నీ ఇచ్ఛానుసారంగానే జరుగుతున్నది. నేను నిమిత్తమాత్రురాలిని. నీ ఆజ్ఞకు బద్ధురాలినై నీ అనుగ్రహాన్ని కోరుతున్నాను. నా ఆత్మసంతృప్తికై ఒక ఊహాజనిత రూపానికి బీజం పడింది. ఈ బీజం అద్భుతమైన, అనంతమైన వృక్షంగా మారి ఈ అలంకరణను ఫలవంతం చేయుగాక! త్రికరణశుద్ధిగా, ఆనంద మంత్రస్వరూపిణిగా కొలువుతీరే పద్ధతిలోని వివరాలను, అర్థాలను, స్వరూపాలను, అనంతమైన, పవిత్రశక్తినీ దర్శింప చేయాలన్న నీ ఆజ్ఞను నా భక్తి సంకల్పంగా స్వీకరిస్తున్నాను. శుద్ధ పరమాత్మ స్వరూపమై శక్తివంతమైన, కాంతివలయాల సమూహమైన వరలక్ష్మీదేవి ఈ సంవత్సరం తనకు తానే అలంకృతయై ఆత్మానందానుభూతినిచ్చి నాకు, నాతో పాటు దర్శించే వారందరికీ శుభప్రదం, మంగళప్రదం చేయుగాక! నీ సంకల్పాన్నీ, నీ అనుగ్రహాన్ని, వారంతా అణువు అంతైనా స్వీకరించి పాటింతురుగాక! అనంతమైన ఫలితాలను పొందుదురుగాక!


సర్వానందమయ భావోద్వేగంతో కూడిన నా సంకల్పాన్ని నిర్విఘ్నంగా నిర్వర్తించడానికి సిద్ధి, బుద్ధి సహిత గణపతిని, శ్రీవల్లీదేవసేన సహిత కుమారస్వామిని, నా కన్నా ముందుగా ఉండి దేవతావిష్కరణను సులభతరం చేయమని ప్రార్థిస్తున్నాను. ఈ జన్మకు అరుదైన వరంగా లభించిన నా సంకల్పానికి, 'షోడషీ' మంత్ర దేవతలు 'డామరి' రూపంగా మారి ఆనందాద్భుతంగా ఆవిష్కరింపచేయడానికి సహకరింతురుగాక! నిర్గుణ రూపాన్ని సంపూర్ణంగా, సగుణమయంగా, అహ్లాదంగా సాకారం చేస్తూ తనను తాను శ్రీలలితామహాభట్టారికగా, అద్దంలో చూసుకున్నట్లుగా ప్రకటితమగుగాక!

ఈ సందర్భంలో మహాత్ములకు, తాత్వికులకు, ఋషులకు మాత్రమే ప్రకటితమయ్యే యోగినిలకు అదృశ్యంగా ఉండే శక్తి స్వరూపిణిలకు, సిద్ధులకు, దశమహావిద్యా దేవతలకు, మనుః చంద్ర, కుబేర, లోపాముద్రవంటి ఉపాసకులకు, సాక్షాత్తు త్రిమూర్తులకు, వారి దేవేరులకూ, అష్టదిక్పాలకులకు, సర్వ ప్రకృతికి, సృష్టికి అతీతంగా దర్శనమిస్తున్న శ్రీలలితాత్రిపుర సుందరికి కూడా ఈ అలంకారం ప్రీతికరం కావాలని ప్రార్థిస్తున్నాను. అలాగే అదృశ్యంగా ఉండవలసిన యోగినిలకు, దేవతలకు, తరలివస్తున్న కష్టానికి క్షమాపణలు తెలుపుతున్నాను. సర్వమంత్ర దేవతలు, నా ఆవాహనను మన్నించి తిష్టవేసుకుందురుగాక! నా సంకల్పానికి బలాన్నిచ్చి, ఆనందాద్భుతంగా ఆవిష్కరింప చేయడానికి సహకరింతురుగాక! విత్తనమైన, ఆదిపరాశక్తి అనంతమై శ్రీచక్ర నవావరణలో నిక్షిప్తమై తనకు తాను ముస్తాబవుతూ ప్రకటితమగుగాక! ఈ ప్రక్రియలో ప్రకటితమైన దేవతలందరూ శ్రీచక్రానికి స్థావరమైన తమ తమ యథాస్థానాలలో ఆసీనులగుదురుగాక! శ్రీషోడషి మంత్ర స్వరూపిణి సర్వతంత్ర స్వరూపంగా, మనోజ్ఞంగా స్వయాలంకృత మగుగాక! ఈ కారణంగా నన్ను ఉద్ధరించడానికి, వరలక్ష్మీ స్వరూపంగా నిన్ను అలంకరించడంలో నేను నిమిత్తమాత్రు రాలిని. ఈ విధి విధానానికి నన్ను భాగస్వామినిగా చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఇందుకుగాను ఆజన్మాంతం నేను నీకు ఋణపడి ఉంటానని ప్రమాణం చేస్తున్నాను. ఇకనుంచి నాలో అవాహనయైన నీవే సర్వం అయి నిర్వర్తింతువు గాక!

త్రిగుణాత్మక స్వరూపిణి



–సి. విజయలక్ష్మీ రాజం

ఇనుము విరిగెనేని యినుమారు ముమ్మారు
కాచి యతుకనేర్చు గమ్మరీడు
మనసు విరిగెనేని మరియంట నేర్చునా?
విశ్వదాభిరామ వినురవేమ

భావం: ఇనుము విరిగితే దానిని రెండు మూడు సార్లు అతికించవచ్చు.కానీ అదే మనిషి మనసు ఒక సారి విరిగితే(అంటే ఏదైనా విషయం వల్ల మనసు నొచ్చుకుంటే)దానిని మరలా అతికించుట ఆ బ్రహ్మ దేవుడి వల్ల కూడా కాదు.

కనకం మోగదు కంచులా....


వికాసమే విజయం

- నిండు కుండ తొణకదు, ఖాళీ కుండ శబ్దం చేయకుండా ఉండదు. ఇత్తడి చేసే శబ్దం పుత్తడి చేసే దాని కన్నా ఎక్కువ
- అన్ని మూర్ఖపు ప్రశ్నలకూ మౌనమే సరైన సమాధానం, అన్ని క్లిష్ట సమయాల్లోనూ చిరునవ్వే సరైన ప్రతిస్పందనం.
- విరుద్ధ విషయాల కలయికే జీవితం. సంతోషాన్ని ఆస్వాదించడానికి విషాదాన్ని అనుభవించాలి. నిశ్శబ్దాన్ని అభినందించడానికి రణగొణ ధ్వనులు కావాలి. కలిమిని గౌరవించాలంటే లేమిని అనుభూతి చెందాలి.
- మన చిరునవ్వు వెనక ఉండే బాధను, మన కోపం వెనక ఉన్న ప్రేమను, మన మౌనానికి కారణాన్ని అర్థం చేసుకునే వారే మన మాటల్ని ఎలా అర్థం చేసుకోగలరు.
- రెండు విషయాలు మన బలహీనతనే సూచిస్తాయి. మాట్లాడాల్సిన సమయంలో మౌనంగా ఉండటం, మౌనంగా ఉండాల్సిన సమయంలో మాట్లాడటం!

– స్వామి పార్థసఖానంద

శివానందలహరి

శ్రీ ఆదిశంకరాచార్యుల విరచితం-10



శ్లోకము:

నరత్వం దేవత్వం నగ వన మృగత్వం మశకతా
పశుత్వం కీటత్వం భవతు విహగత్వాది జననమ్ |
సదా త్వత్పాదాబ్జ స్మరణ పరమానందలహరీ
విహారాసక్తం చే ద్ధృదయ మిహ కిం తేన వపుషా || 10 ||

భావము:

నా మనస్సు పరమేశ్వర స్మరణము కలదియై శివానందలహరి యందు ఓలలాడుచున్నచో, ..మనస్సు నీ పాదపద్మముల స్మరణలో పరమానందముగా విహరించుటయందు, ఆసక్తి కలిగిఉన్నచో దేవుడిగాగాని నరునిగాగాని, కీటకముగాగాని, పర్వతముగాగాని, అడవిగాగాని,మృగముగాగాని,పశువుగాగాని, మగాగాని, పక్షులు మొదలగు వాటిగాగాని జన్మ వచ్చినా బాధ లేదు.

వివరణ:

పిపీలికాది బ్రహ్మ పర్యంతం భక్తి విషయంలో ఏ జన్మ అయినా అవరోధం కాదుఅనే విషయాన్ని

ఆదిశంకరులు ఈ శ్లోకం లో నొక్కి వక్కాణించారు. నర ,దేవ ,రాక్షస ,నగ ,మృగ,వన ,పర్వత ,మశక ,పశు ,తరు ,కీటక,విహంగ ,జన్మలలో ,ఏ జన్మకు చెందిన జీవి అయినప్పటికీ వచ్చే నష్టం ఏదీ లేదు.హృదయం కనక ఈశ్వర పాదారవిందయుగళ స్మరణ అనే ప్రవాహంలో నిమగ్నమై ఆనందించటానికి ఆసక్తి కలిగినదైతే చాలు. ఏ విధమైన జన్మకు చెందిన జీవి అయినా , ఏ విధమైన శరీరం తో జీవిస్తున్నా తరించటానికి అవేవీ అడ్డుకావు,అడ్డు రావు.

ఉదా: సాలెపురుగు (కీటకం), సర్పము లేదా 'కాళము', ఏనుగు(పశువు) ఈ మూడూ గూడా ఈశ్వరుని ఆరాధించి అర్చించి ఈశ్వర క్షేత్రాన్ని ,తమ పేర్లతోనే 'శ్రీ కాళహస్తి' అనే పుణ్యక్షేత్రంగా విరాజిల్ల చేసిన సంగతి తెలిసిందే గదా! భక్తికి కావలసినది నిరంతర ఈశ్వరాయత్తమైన హృదయం గాని నజరు గొలిపే నాణ్యమైన జన్మలు కాదు 'రమణీయమైన ఆకృతులు కాదు ' అని ఈ శ్లోకం సారాంశం.

ఆ ఆదిదంపతుల పాదపద్మాలకు నమస్కరిస్తూ
సర్వేజనా సుఖినోభవంతు

–డా।। శ్రీరామ్, హైదరాబాద్

రామాయణం ఎలా ప్రారంభమైంది?

శ్లో।। అప్సు నిర్మథనాత్ ఏవ రసాత్ తస్మాత్ వర స్త్రియః |
ఉత్పేతుః మనుజ శ్రేష్ఠ తస్మాత్ అప్సరసో అభవన్ ||
షష్టిః కోట్యో అభవన్ తాసాం అప్సరాణాం సువర్చసాం |
అసంఖ్యేయాః తు కాకుత్స్థ యాః తాసాం పరిచారికాః ||

అలా వచ్చిన అందమైన అప్సరసలని, దేవత రాక్షసులలో ఎవరూ కోరలేదు. అందుకని వాళ్ళు దేవ వేశ్యలు అయ్యారు. తరువాత అందులోనుంచి వరుణుడి కుమార్తె అయిన వారుణి అనే సురరసం వచ్చింది. దేవతలు ఆ వారుణిని తాగారు కాబట్టి వాళ్ళని సురులు అని పిలుస్తారు, రాక్షసులు ఆ సురరాసాన్ని వద్దన్నారు కాబట్టి వాళ్ళని అసురులు అని అంటారు. ఆ వారుణిని సేవించలేదు కనుక రాక్షసుల మనస్సులు ఎప్పుడు సంతోషంగా ఉండవు. తరువాత వచ్చిన ఉచ్చైఃశ్రవం అనే అశ్వాన్ని రాక్షసులు స్వీకరించారు, అలానే కౌస్తుభాన్ని శ్రీమహావిష్ణువు స్వీకరించారు. తరవాత పుట్టిన అమృతం కోసం అందరూ కొట్టుకున్నారు, చివరగా విష్ణు సహకారంతో దేవతలు ఆ అమృతాన్ని సొంతం చేసుకున్నారు.

కొంతకాలానికి రాక్షసుల తల్లి అయిన దితి కశ్యపుడితో ఇలా అనింది.........నీ కొడుకులైన దేవతలు నా కొడుకులైన రాక్షసులని చంపారు. నా కొడుకులకి ఇప్పుడు రాజ్యం లేదు, వాళ్ళు చాలా కష్టాలు పడుతున్నారు, దీనికంతటికి దేవతలకి రాజైన ఆ ఇంద్రుడే కారణం. కాబట్టి నాకు ఇంద్రుడిని చంపగలిగే కొడుకు కావాలి అని కశ్యపుడిని అడిగింది. అయితే నువ్వు సౌచంగా(భౌతికంగా, మానసికంగా ఎటువంటి దోషం లేకుండా ఉండడం) ఒక 1000 సంవత్సరాలు ఉండగలిగితే, నీకు ఈ లోకాలని శాసించగల, ఇంద్రుడిని సంహరించగల కొడుకు పుడతాడు, అని కశ్యపుడు అన్నాడు. దితి సరే అని శుక్లప్లవనం అనే ప్రదేశానికి వెళ్లి, తపస్సు చెయ్యడం ప్రారంభించింది. అలా తపస్సు చేసుకుంటున్న దితి దగ్గరికి ఇంద్రుడు వచ్చి, 'నేను నీకు సేవ చేస్తాను అమ్మ' అన్నాడు. దితి సరే అనడంతో రోజూ ఫలాలు తీసుకోచ్చేవాడు, రోజు తన తల్లి కాళ్ళు పట్టేవాడు. అలా 990 సంవత్సరాలు పూర్తయ్యాయి.

ఒక రోజు, మిట్ట మధ్యాహ్నం వేళ, దితి తన జుట్టుని విరబోసుకొని కూర్చుంది. బాగా అలసిపోవడం చేత ఆమె శిరస్సు కొంచెం ముందుకి వంగింది, అప్పుడామె జుట్టు పాదాలకి తగిలింది. అలా తగలడం చేత ఆమె సౌచం పోయింది. ఇలాంటి సమయం కోసమే ఎదురుచూస్తున్న ఇంద్రుడు వెంటనే ఆమె గర్భంలోకి ప్రవేశించి ఆ పిండాన్ని 7 ముక్కలు చేశాడు. అలా ముక్కలు చేస్తుండగా ఆ పిండం నరకద్దు నరకద్దు అని అరిచింది, ఆ ఏడుపు దితికి వినబడి, దితి కూడా నరకద్దు అని అనింది. అప్పుడు ఇంద్రుడు బయటకి వచ్చి, నీ మీద గౌరవంతో నేను ఆ పిండాన్ని సంహరించలేదు అని అన్నాడు. నాయందు సౌచం పోయింది కనుక నువ్వు నా పిండాన్ని నరకడంలో తప్పులేదు, కాని నా పిండాలకి దేవతా స్వరూపం ఇచ్చి వాటిని వాయు స్కంధాలకి అధిదేవతలగా ఉండే వరం ఇవ్వమని దితి కోరింది. ఇంద్రుడు సరే అని బ్రహ్మలోకంలోని, ఇంద్రలోకంలోని, అంతరిక్షంలోని వాయు స్కంధాలతో పాటు నాలుగు దిక్కులకి వాయు స్కంధాలుగా ఉండే వరం ఇస్తున్నాను అని అన్నాడు. ఆ ఏడుగురిని మరుత్తులు అని పిలుస్తారు. రామా! ఆనాడు దితి 990 సంవత్సరాలు తపస్సు చేసిన ప్రదేశమే ఈ విశాల నగరం. ఈ నగరాన్ని మొదట ఇక్ష్వాకు రాజు పరిపాలించాడు. ఆయన భార్య అయిన అలంబుష వల్ల వాళ్ళకి విశాలుడు జన్మించాడు. ఆ విశాలుడికి హేమచంద్రుడు, హేమచంద్రుడికి సుచంద్రుడు, సుచంద్రుడికి ధూమ్రాశ్వుడు, ధూమ్రాశ్వుడికి సృంజయుసుడు, సృంజయుసుడికి సహదేవుడు, సహదేవుడికి కుశాశ్వుడు, కుశాశ్వుడికి సోమదత్తుడు, సోమదత్తుడికి కాకుత్సుడు, కాకుత్సుడికి సుమతి జన్మించాడు, ఆ సుమతి ఇప్పుడు ఈ విశాలా నగరాన్ని పరిపాలిస్తున్నాడు.

తన రాజ్యానికి విశ్వామిత్రుడు వచ్చాడని తెలుసుకొన్న సుమతి ఆయనని సగౌరవంగా ఆహ్వానించాడు. సకల మర్యాదలు చేశాడు. అప్పుడు సుమతి విశ్వామిత్రుడితో నీ పక్కన ఉన్న వాళ్ళు ఎవరు, సూర్యచంద్రులు లాగ ఉన్నారు, చాలా అందంగా ఉన్నారు అన్నాడు. వాళ్ళని రామలక్ష్మణులంటారు, దశరథుని కుమారులు, నా యాగ సంరక్షణ కోసం వచ్చారు అని చెప్పి, కుశల ప్రశ్నలు అడిగాక అక్కడి నుంచి బయలుదేరారు. అలా మిథిలా నగరానికి దెగ్గరగా వచ్చాక వాళ్ళకి ఒక ఆశ్రమం చాలా శోభాయమానంగా కనిపించింది, కాని అది నిర్జనంగా ఉంది. అప్పుడు రాముడు ఈ ఆశ్రమం ఎవరిదని అడుగగా, విశ్వామిత్రుడు ఇలా చెప్పెను......

గౌతమస్య నరశ్రేష్ఠ పూర్వం ఆసీత్ మహాత్మనః |
ఆశ్రమో దివ్య సంకాశః సురైః అపి సుపూజితః ||



ఈ ఆశ్రమం గౌతమ మహర్షిది, ఆయన దర్శనం కోసం ఈ ఆశ్రమానికి దేవతలు వచ్చేవాళ్ళు. ఆ గౌతముడు తన భార్య అయిన అహల్యతో కలిసి తాపసిగా ఇక్కడ ధార్మికమైన జీవనం గడిపేవారు. అహల్య బ్రహ్మదేవుడి మానస పుత్రిక, అద్భుతమైన సౌందర్యం కలిగినది. ఇంద్రుడికి అహల్య మీద ఉన్న కోరిక వలన, ఒకరోజు ఉదయాన్నే గౌతమ మహర్షి సంధ్యావందనాది క్రతువులు నదిలో చేసుకునే సమయంలో, ఆయన ఇంటి వద్ద లేని సమయంలో, గౌతమ మహర్షి వేషంలో ఇంద్రుడు ఆయన ఇంటిలోకి ప్రవేశించాడు. ఇంటిలోకి ప్రవేశించి నేను నీ సంగమాన్ని కోరుకుంటున్నాను అని అహల్యతో అన్నాడు.

ముని వేషం సహస్రాక్షం విజ్ఞాయ రఘునందన |
మతిం చకార దుర్మేధా దేవ రాజ కుతూహలాత్ ||

అహల్యకి వచ్చింది గౌతముడు కాదు ఇంద్రుడని తెలుసు, కాని ఆమె కన్యత్వంలో ఉండగా ఆమెకి ఇంద్రుడి మీద మనసులో కోరిక ఉండేది, అందువలన ఇంద్రుడితో సంగమించింది.

అహల్య ఇంద్రుడితో ఇలా అనింది ' నేను నీతో సంగమించి చాలా ఆనందం పొందాను, కృతార్థురాలినయ్యాను, నువ్వు ఇక్కడినుంచి తొందరగా వెళ్ళిపో. నిన్ను నువ్వు గౌతముడి నుండి రక్షించుకో ' అని చెప్పింది. అప్పుడు ఇంద్రుడు ఒక నవ్వు నవ్వి, నేను చాలా ఆనందంపొందాను, ఎలా వచ్చానో అలానే వెళ్ళిపోతాను అని చెప్పి ఆశ్రమం బయటకి రాగానే......

గౌతమం స దదర్శ అథ ప్రవిశంతం మహామునిం |
దేవ దానవ దుర్ధర్షం తపో బల సమన్వితం ||

దేవతలని, దానవులని నిగ్రహించగలిగే, శాసించగలిగే అపారమైన తపః శక్తి ఉన్న గౌతమ మహర్షి బయటకి వస్తున్న ఇంద్రుడిని చూశారు. ఇంద్రుడి ముఖం మాడిపోయింది. అప్పుడు గౌతమ మహర్షి ఇంద్రుడితో ఇలా అన్నారు ' నా రూపం ధరించి నువ్వు చెయ్యరాని పాపం చేశావు. స్త్రీల మీద నీకు ఇంత కామం ఉండడానికి కారణం నువ్వు పురుషుడవన్న అహంకారం, కావున పురుషత్వానికి చిహ్నములైన నీ అండములు నేల జారి పడిపోవు గాక ' అని ఇంద్రుడిని శపించారు.

పేతతుః వృషణౌ భూమౌ సహస్రాక్షస్య తత్ క్షణాత్ |

అహల్య వైపు చూసి గౌతముడు ఇలా అన్నాడు ' నువ్వు ఇక్కడ కొన్ని వేల సంవత్సరాలు తపస్సు చేస్తూ పడుండు, ఆహారం తీసుకోకు, గాలిని భక్షించు. నీ మీద బూడిద కప్పబడుతుంది, కావున నువ్వు ఎవరికీ కనబడవు. కొంతకాలానికి ఈ ఆశ్రమానికి రామచంద్రుడు వస్తాడు. ఆయన ఈ ఆశ్రమ ప్రవేశం చెయ్యగానే నీకు శాపవిమోచనం కలుగుతుంది. నీకు శాప విమోచనం కలగగానే నువ్వు నా పత్ని స్థానాన్ని పొందుతావు.

అప్పటిదాకా నేను హిమవత్ పర్వత ప్రాంతంలో ఉంటాను' అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఇంతలో ఇంద్రుడు దేవలోకంలో దేవతలకి జెరిగినదంతా చెప్పాడు. నేను కామంతో ఈ పని చెయ్యలేదు, గౌతమ మహర్షి తపఃశక్తి పెరిగిపోతుంది, ఆయనని నేను ఏమి చెయ్యలేను, అందుకనే అపచారం అహల్య పట్ల చేశాను, ఆగ్రహించిన గౌతమ మహర్షి నన్ను, అహల్యని శపించడం వల్ల కొంత తపఃశక్తిని కోల్పోయారు. మిమ్మల్ని రక్షించడం కోసం నేను నా అండాలని పోగొట్టుకున్నాను, కావున మీరే నాకు అండాలని తీసుకొచ్చి పెట్టాలి అన్నాడు. అప్పుడు వాళ్ళు గొర్రె వృషణములను తీసుకొచ్చి ఇంద్రుడికి పెట్టారు. అలా పోగొట్టుకున్న పుంసత్వాన్ని ఇంద్రుడు పొందాడు. అప్పుడు ఆయనని మేష వృషణుడు అని పిలిచారు.

విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో కలిసి ఆ ఆశ్రమంలోకి ప్రవేశించాడు. రాముడు ఆ ఆశ్రమం లోకి వెళ్ళగానే, ఇన్ని వేల సంవత్సరాల నుండి శాపగ్రస్తురాలైన అహల్య దుర్నిరీక్షమైన తేజస్సుతో పైకి లేచింది. ఆవిడని చూడగానే రాముడు ఆమె కాళ్ళకి నమస్కారం చేశాడు. గౌతమ మహర్షి చెప్పిన విషయం గుర్తుకు వచ్చి, వచ్చిన వాడు రాముడని గ్రహించిన అహల్య రాముడికి నమస్కారం చేసింది. వాళ్ళకి భోజనం పెట్టింది. అప్పుడు అక్కడికి వచ్చిన గౌతమ మహర్షి అహల్యతో కలిసి తపస్సు చేసుకోడానికి వెళ్ళిపోయాడు.


ప్రవచనం

– డా।। శ్రీ చాగంటి కోటేశ్వర రావు

సేకరణ: నరేందర్ చింతం

చికిత్స విజ్ఞానం-ఆయుర్వేదం

ఆరోగ్య ప్రతిభ



ఆయుర్వేదం విజ్ఞానం మొదట బ్రహ్మ నుచి ప్రజాపతికి, ప్రజాపతి నుంచి అశ్వినీ కుమారులకు, అశ్వినీ కుమారుల నుంచి ఇంద్రునకు, ఇంద్రుని నుంచి భరద్వాజ మహర్షికీ, అతని నుంచి ఆత్రేయ పునర్వసునికి, అతని శిష్యులు అగ్నివేశుడు, కేలుడు, హరితుడు మొదలైన వారికి ఈ పరంపర కొనసాగింది. కాలక్రమంలో ఇది రెండు పరంపరలుగా విడివడి 1. ఆత్రేయ పరంపర, 2. ధన్వంతరీ పరంపరలుగా వాసికెక్కింది. ఆత్రేయ పరంపరలో కాయచికిత్స ప్రధానమైనది. ఈ విధానంలో ప్రసిద్ధుడు చరకుడు. ఇతని గ్రంథం 'చరక సంహిత'.

ధ్వంతరీ పరంపరలో శల్యచికిత్స ప్రధానమైనది. ఈ పరంపరలో ప్రముఖుడు సుశ్రుతుడు. ఇతను రచించిన గ్రంథం 'సుశ్రుత సంహిత.' ఇవి కాకుండా దక్షిణ దేశంలో అగస్త్య మహాముని ప్రసాదిత 'సిద్ధ వైద్యం' కూడా ఎంతో ప్రాచుర్యం పొందింది. యోగవాశిష్ట్యం – రోగం మొదట మానసిక స్థాయిలో ఉద్భవిస్తుందనీ, తద్వారా నెమ్మదిగా ప్రాణ వ్యవస్థను దెబ్బతీస్తుందనీ, ఆ తరువాత నాడీమండలం దోషమయం అవుతుందనీఅ, దీనివలన మొత్తం శరీరం రోగమయమవుతుందని వివరించింది. భారతీయ ఆరోగ్య విజ్ఞానం మనిషి ఆరోగ్యానికీ, మనిషి ఆలోచనలకూ గల సంబంధం గుర్తించి, ఆనాడే ఈ చికిత్స విధానాన్ని రూపొందించింది. నేటి ఆధునిక వైద్యశాస్త్రం కూడా 'సైకో సోమాటిక్ ప్రాబ్లమ్స్' రోగాలకు మూలమని తెలుసుకుంటూ ఉంది. కనుక భారతీయ యోగ, ఆయుర్వేదం, ప్రకృతి చికిత్సలకు నేడు ప్రపంచ వ్యాప్తంగా విపరీతమైన గిరాకీ ఏర్పడింది. మనం ఇంతటి ఘనత సాధించటం మన ప్రాచీన ఋషివరుల కృషి ఫలితమే.

చరక సంహితంలో ఆరోగ్యకరమైన వ్యక్తి గురించి మాట్లాడుతూ 'ప్రతి వారిలోనూ వాత, పిత్త, కఫమను త్రిదోషాలు, సప్తధాతువులు, మలవిసర్జన వ్యవస్థ సమతుల్యంగా ఉండి. ఆత్మ ఇంద్రియనిగ్రహం, మనసు ప్రశాంతస్థితిలో ఎవరికుంటుందో అట్టివారు ఆరోగ్యంగా ఉంటారు అని చెప్పింది."

సమదోషః సమాగ్నిశ్చ సమధాతు మలక్రియః।
ప్రసన్నాత్మేంద్రియ మనాః స్వస్థ ఇత్యభిధీయతే॥

వేదకాలంనాడే అష్టాంగాయుర్వేదం శాఖలుగా అభివృద్ధి చెంది ఉండేది. అవి.

1. కాయచికిత్స –సాధారణ చికిత్స, 2. కౌమర భృత్యమ్ –బాలరోగ చికిత్స, 3. శల్యతంత్రం –శస్త్ర చికిత్స, 4.శాలాక్యతంత్రం – కన్ను, ముక్కు, గొంతు చికిత్స, 5. భూత విద్య –మనోరోగ చికిత్స, 6. విష తంత్ర – విషచికిత్స, 7. రసాయన – రసాయన చికిత్స, 8. వాజీకరణ – పురుషత్వ వృద్ధి

ఔషధములు

'రోగ చికిత్సకు అవసరమైన ఔషధులను ప్రకృతి ప్రసాదించింది' అని అంటాడు చరకుడు. ఇతని చరక సంహితలో 582 రకాల ఔషధాలు చెప్పబడ్డాయి. సుశ్రుత సంహితలో 496 రకాల ఔషధాలు చెప్పబడినాయి. వీటిలో చూర్ణం, రసం, కషాయం వంటి మందులు ఉపయోగించేవారు. ఆచార్య నాగార్జునుడు, వాగ్భటుడు వంటి వారు 'రసాయన' శాస్త్రాన్ని అభివృద్ధి చేసి తద్వారా లోహాలను కూడా వైద్య రంగంలో వినియోగించే విధానం కనుగొన్నారు. ఆయుర్వేదము 'పంచకర్మల' ద్వారా చేసే చికిత్స గురించి తెలిపింది. అది:


1. వమనం – వాంతులు చేయించి దోషం తొలగించటం. 2. విరేచనం – మల విసర్జన ద్వారా దోషం తొలగించటం, 3. బస్త్రిక – ఎనీమా చేయటం. 4. రక్తమోక్షణ – విష, చెడు రక్తాన్ని తొలగించి దోషనివారణ చేయటం. 5. నస్యం – ముక్కు ద్వారా పదార్థాలు పంపించి దోషనివారణ చేయటం.

చరక సంహిత సూత్రస్థానం, అధ్యాయం 16లో పేరా 176–21లలో 'పంచకర్మ' చికిత్సల ఉపయోగాలు చెప్పారు. అవి 'ఉదరం' పరిశుభ్రమైతే శరీర నిర్మాణం వేగవంతం అవుతుంది అని చెబుతాయి. కనుక మనిషికి జబ్బులు రావు. ఇంద్రియాలు బాగా పని చేస్తాయి. చర్మం రంగు పెరుగుతుంది. బలం కలిగి, త్వరగా ముసలితనం దరిచేరదు. రక్తమోక్షణ వైద్య విధానానికి జలగలను ఉపయోగించే వారు. (లీచ్ థెరఫీ.) ఈ విధానం సుశ్రత సంహిత సూత్రస్థానం అధ్యాయం 13, 19వ పేరాలో చెప్పబడింది. ఆధునిక వైద్య విధానం కూడా ఈ విధానాన్ని అనుసరిస్తూ ఉంది. చివరకు మన విజ్ఞానశాస్త్రం ఎంత ఉన్నతమైనదంటే స్త్రీ 'పాలు' కూడా సుమారు 70 రకాల రోగాలకు నివారణగా, మందులుగా ఉపయోగించుకునే విజ్ఞానం ఇచ్చింది. ఉదా: కాస్త నల్లగా ఉండే స్త్రీల చనుబాలు కంటి జబ్బులను తగ్గిస్తాయని మన వారి పరిశీలన.



బృందావనవాసులకు సుఖాన్నిచ్చిన కృష్ణుడు

బాల మకరందం



ఈ కలియుగానికి ముందు యుగమైన ద్వాపరయుగంలో కృష్ణపరమాత్ముడు భూమి మీద అవతరించాడు. బృందావనం, ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కృష్ణుడు అత్యంత ఇష్టుడు. కృష్ణుడి మేనమామ కంసుడికి తన మరణం కృష్ణుడి వల్లేనని తెలియడంతో, అతడిని అడ్డు తొలగించుకోవడానికి అలాగే బృందావనవాసులను ఇబ్బంది పెట్టడానికి అనేక మంది రాక్షసులను పంపాడు. కృష్ణుడు తమతో ఉన్నాడన్న నమ్మకం బృందావనవాసులది.

ఏ సమస్య వచ్చినా వారు అతడిని వేడుకునేవారు. అతడు ఎల్లప్పుడూ చిరునవ్వు చిందిస్తూ సమస్యలను పరిష్కరించేవాడు. తనకు ఆప్తులైనవారిని రక్షించుకోవడం తన బాధ్యతగా భావించేవాడు కృష్ణుడు. వేణుగానంతో మురిపిస్తూనే ఇతరులకు సహాయపడడం అతడి లక్షణం. ఆయన పరిష్కరించిన అనేక సమస్యలున్నాయి. యమునా నదిని కలుషితం చేస్తున్న బహుతలల కాళీయుని మర్దించడం అందరికీ తెలిసిన ఒక సంఘటన. ఇంద్రుడి కోపంతో పుట్టిన వర్షాల నుండి, ఈదురుగాలుల నుండి తన వారిని రక్షించడం కోసం గోవర్ధనగిరి ఎత్తి గొడుగులా నిలిపిన మరోఘటన కూడా ఉంది. ఒకసారి నందమహారాజును వరుణుడు వరుణ లోకం ఎత్తుకుపోగా, ఆ లోకం వెళ్లి తన తండ్రిని రక్షించి తెచ్చుకున్నాడు. మరోసారి దావానలం నుండి తన వారిని రక్షించుకున్నాడు. ఎవరైతే తన మీద సంపూర్ణ విశ్వాసం కలిగి ఉంటారో, వారి సమస్యలను పరిష్కరిస్తూ, సర్వవేళలా అండగా ఉంటాడు కృష్ణుడు.

గ్రహించవలసిన లక్షణం: ఇతరులకు సహాయపడే గుణం

శ్రీ భగవాన్ ఉవాచ
యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు।
యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా॥


తాత్పర్యము:
ఆహార విహారాదులయందునూ, కర్మాచరణములయందునూ, జాగ్రత్స్వప్నాదుల యందునూ నియంత్రించాలి. అతనికి ఇదే యోగము

నీతి:
మనకొచ్చే అన్ని అనారోగ్యాలకు చెడు ఆహారం, అదుపులేని నిద్ర, మితిమీరిన వినోదం కారణమవుతాయి. రోగాలకు మందులు వాడడంకన్నా, రోగం రాకుండా చూసుకోవడమే మంచిది.

ముఖ్యపదం : నిద్ర

–డా।।హరెక్రిష్ణ చంద్రశేకరన్

తత్త్వమసి (మేక పులి)



– పరమహంస గూఢార్థ కథలు

నేను బద్ధజీవుణ్ణి! నాకు ఎప్పటికీ భక్తి, జ్ఞానము కలుగవా! అని కొంతమంది అంటూ ఉంటారు. కాని గురువు అనుగ్రహం పొందినావాడికి ఆ భయం లేదు.

సంగ్తా (శ్రీరామకృష్ణుల గురువైన తోతాపురి) నాకో కథ చెప్పారు. అని శ్రీకృష్ణులు ఈ క్రింది. కథను చెప్పారు.

ఒకసారి ఒక ఆడపులి ఒక మేకల మంద మీద పడింది. అదే సమయంలో దూరం నుండి ఒక బోయ వాడు బాణం వేసి దానిని చంపివేశాడు. ఆ పులి నిండుచూలాలు. బాణం దెబ్బకు అది చనిపోతూ, ఒక పిల్లను కని కన్నుమూసింది. ఈ పులికూన మేకలమందలో కలిసి పెరుగుతూ వచ్చింది, ఆ మేకలే దానికి పాలిచ్చి పెంచాయి. క్రమక్రమంగా రోజులు గడిచేకొద్దీ ఆ పులిపిల్ల మేకలతో కలిసి తిరగడం, వాటిలాగా గడ్డి మేయడం, అవి అరుస్తున్నట్లే, మే,మే అని అరవడం మొదలు పెట్టింది. క్రమంగా అది పెరిగి ఒక పెద్దపులి లాగా తయారైంది. అయినా కూడా అది గడ్డితినడం, మేకలలాగా అరవడం చేస్తూనే ఉంది. ఏదైనా క్రూర మృగం వచ్చి తరిమితే ఈ మేక–పులి కూడా మేకలాగా మేకలగుంపుతో కలిసి పారిపోతూ ఉండేది.

ఇలా ఉండగా ఒకసారి మరొక భయంకరమైన పులి ఆ మేకలమంద మీద పడింది. ఆ మందలో గడ్డి తింటూ, మేకలతో పరుగెత్తిపోతున్న ఈ మేక– పులిని చూచి ఆశ్చర్యపడింది. ఇతర మేకలను వదలి ఆ పులి ఈ గడ్డితినే మేక–పులిని వెంటాడి పట్టుకుంది. అది భయంతో వణుకుతూ మేకలాగా అరుస్తూ, తప్పించుకోవడానికి ప్రయత్నించింది. కాని ఈ భయంకరమైన పులి దానిని నీటి దగ్గరకు ఈడ్చుకుపోయి. నువ్వు నాలాగా పెద్దపులివై ఉండి కూడా మేకలతో తిరుగుతూ గడ్డి తింటున్నావెందుకు? నీళ్ళలో నీ ముఖం చూసుకో! నాకున్నట్లుగానే గుండ్రమైన ముఖం నీకు కూడా ఉంది. అని దాని నోటిలో మాంసం ముక్కను కుక్కింది. గడ్డి తినడానికి అలవాటుపడిన ఆ మేక– పులి మొదట మాంసం తినడానికి ఇష్టపడలేదు. కాని మాంసం నాలుకకు తగిలేసరికి, రుచుమరిగి తినడం ప్రారంభించింది. చివరకు ఆ భయంకరమైన పులి దానితో, ఎంత సిగ్గుచేటు! ఈ మేకలతో కలిసి తిరుగుతూ గడ్డి తింటున్నావు. చూడు! నాకు, నీకు తేడా ఏమైనా ఉన్నాదా? ఏమీ లేదు. నాతో కలిసి అడవిలోకి రా! అన్నది. ఈ మాటలు విని ఆ మేక–పులి తన ప్రవర్తనకు సిగ్గుపడి. తన నిజస్వరూపాన్ని తెలుసుకొని, ఆ పులితోపాటు అడవిలోకి వెళ్ళిపోయింది. ఈ కథను గురుదేవులు శ్రీరామకృష్ణ కథామృత రచయిత అయిన మహేంద్రనాథ గుప్తకు చెప్పి, గురువు అనుగ్రహం పొందినవాడికి భయం లేదు. అసలు నీవెవరివో, నీ నిజతత్త్వమేమిటో, గురువు నీకు తెలియజేస్తాడు. ఈ కథలో గడ్డి తినమంటే, కామినీ–కాంచన సుఖాలలో మునిగితే లడం. మే, మే అని అరుస్తూ పారిపోవడమంటే సామాన్య మానవునిలాగా సంసారంలో మెలగడం. కొత్త పులిని అనుసరించిపోవడమంటే మన ఆధ్యాత్మిక చైతన్యాన్ని మేల్కొల్పిన గురువు శరణుపొంది, ఆయనయే మన ఆప్తబంధువని గుర్తించడం నీటిలో తన ముఖం యొక్క ప్రతిబింబాన్ని సరిగ్గా చూసుకోవడమంటే తన ఆత్మతత్త్వాన్ని అనుభూతి పొందడం అని వివరించారు. తత్త్వమసి (అదే నీవు! అంటే నీవు ఈ అశాశ్వతమైన శరీరానివి కావు ఆ పరమాత్మవే) అనే మహావాక్య వివరణే ఈ కథలోని అంతరార్థం అని వివరించారు.

ఓటు నమోదు కోసం ప్రత్యేక కార్యక్రమం

విజయక్రాంతి, మెహిదీపట్నం: ఓటు నమోదు పై ప్రతీ ఒక్కరిని అవగాహన పరచాలని కార్వాన్ డిప్యూటీ కమిషనర్ సదామ్ను పిలుపునిచ్చారు. శుక్రవారం లంగర్ హౌజ్ రింగ్‌రోడ్డులోని గ్రాండ్ గార్డేన్ ఫంక్షన్‌హాలులో జరిగిన బూత్ లెవల్ సూపర్‌వైజర్ల, ఆఫీసర్ల సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ డిప్యూటీ కమిషనర్ విజయ లక్ష్మిపాల్గొన్నారు. ఈ నెల 19,20 తేదిలలో ఓటు నమోదుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉదయం10.30నుండి సాయంత్రం 5 వరకు,ఈ నెల 22,23, 24 మూడు రోజుల పాటు సాయంత్రం 4గంటల నుండి 7గంటల వరకు దగ్గర్లోని ఓటు నమోదు కేంద్రాలలో ప్రత్యేక అవకాశం కల్పించినట్లు తెలిపారు.

కేసీఆర్ నాయకత్వంలోనే..
'బంగారు తెలంగాణ'



(మొదటిపేజీ తరువాయి) కేటీఆర్ అన్నారు. గజ్వేల్‌లో అభివృద్ధి కార్యక్రమాలు ఎలా జరుగుతున్నాయో అందరికీ తెలిసిందేనని, తక్కువ సమయంలోనే ప్రతాప్‌రెడ్డి చాలామంది కార్యకర్తలతో పార్టీలో చేరడం మంచి పరిణామమని ఆయన అన్నారు. టీఆర్ఎస్‌లో చేరిన వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలని తాను పార్టీలో చేరుతున్నానని ప్రకటించారు. ముఖ్యమంత్రి తీసుకున్న సంక్షేమ పథకాలకు ప్రజలు బ్రహ్మరథం పట్టి ఇటీవల ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీని గెలిపించారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అనేకమంది కార్యకర్తలు వంటేరు నాయకత్వంలో టీఆర్ఎస్‌లో చేరారు.

రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా 'పోచారం'

- ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు సభలో ప్రొటెం స్పీకర్ ప్రకటన

విజయక్రాంతి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా పోచారం శ్రీనివాసరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సభ ఉదయం సమావేశం కాగానే అధ్యక్షస్థానంలో ఉన్న ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సభాపతి పదవికి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. దీంతో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, కాంగ్రెస్‌పార్టీ శాసనసభ్యుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇతర సభ్యులు ఆయనను స్పీకర్ స్థానం వద్దకు తోడ్కొని రాగా ఆయన అధ్యక్షస్థానంలో ఆశీనులయ్యారు. సభాపతిగా ఎన్నికైనందుకు పోచారం శ్రీనివాస్‌రెడ్డిని అభినందిస్తూ పలువురు సభ్యులు ప్రసంగించారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ఆయన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోం

- లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం
- ఆమ్ ఆద్మీ పార్టీ స్పష్టం

న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని ఆమ్ ఆద్మీ పార్టీ స్పష్టం చేసింది. ఎన్డీయే కూటమికి వ్యతిరేకంగా జట్టు కట్టాలన్న కాంగ్రెస్ ప్రతిపాదనను ఆప్ తిరస్కరించింది. ఆ పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ శాఖ కన్వీనర్ గోపాల్ రాయ్ శుక్రవారం ఈ విషయాన్ని ప్రకటించారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోబోమన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడటమే తమ లక్ష్యమని, కానీ ఆ ప్రయత్నంలో కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేసేది లేదన్నారు. పంజాబ్, హర్యానా, ఢిల్లీలోని అన్ని లోక్‌సభ స్థానాలకు ఆప్ సొంతంగానే పోటీ చేస్తుందని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడం కోసం కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడానికి గతంలో ప్రయత్నించామని, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో మాత్రం అలాంటి ప్రయత్నం చేయబోమని తేల్చిచెప్పారు.

లోక్‌సభ ఎన్నికల్లో ఆప్ తమకెలాంటి పోటీ కాదని పంజాబ్ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత అమరీందర్ సింగ్, దేశ రాజధానిలో కాంగ్రెస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకువస్తామని ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ షీలా దీక్షిత్ మాట్లాడిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు గోపాల్ రాయ్ వెల్లడించారు. దేశ ప్రయోజనాల కోసం తాము కాంగ్రెస్ విషాన్ని తాగడానికి సిద్ధమయ్యామని, అయితే కాంగ్రెస్ ఇప్పటికీ దురహంకారంతో కొట్టుమిట్టాడుతున్నట్లు ఆ పార్టీ నేతల ప్రకటనలు తెలియజేస్తున్నాయని ఆయన విమర్శించారు. ఢిల్లీ, పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో తమ పార్టీకి మంచిపట్టుందని, పార్టీ బలం పెంచుకునేందుకు ఒంటరిగా పోటీ చేస్తామని, అభ్యర్థులను త్వరలోనే ప్రకటిస్తామని గోపాల్ వివరించారు.

ఉద్యాన వర్సిటీని మార్చి నాటికి సిద్ధం చేయండి



విజయక్రాంతి, హైదరాబాద్: ములుగులో ప్రతిపాదించిన శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం పనుల్లో వేగం పెంచాలని వ్యవసాయ సహకార శాఖ ప్రధాన కార్యదర్శి సి. పార్థసారథి ఆదేశించారు. ప్రధాన పరిపాలనా కార్యాలయం, పోస్ట్ గ్రాడ్యుయేట్ కళాశాల, అనుబంధ విభాగాల పనుల పురోగతిపై సంభందింత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎట్టి పరిస్థితులలోనూ భవనాలను పూర్తిచేసి, మార్చి నెల చివరి నాటికి అప్పగించాలని ఇంజనీర్లను ఆదేశించారు. ఈ లోపు పరిపాలనా భవనం, కళాశాలలో నూతనంగా రూపొందించిన ల్యాండ్స్కేప్ ప్రణాళికను పూర్తి చేయాలని చెప్పారు. ప్రయోగశాలలు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉండేలా చూసేందుకు విశ్వవిద్యాలయం అధికారులు, నిపుణులు, శాస్త్రవేత్తలతో సంయుక్త కమిటీని ఏర్పాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం చేపడుతున్న వ్యవసాయ, ఉద్యాన పథకాలకు పరిశోధనాత్మక, శాస్త్రీయ సలహాలు అందించాలని శాస్త్రవేత్తలను కోరారు. రాష్ట్రస్థాయిని ప్రతి సాగుభూమిలో అత్యంత అనువైన పంటలసాగుకు పంటకాలనీల ఏర్పాటుకు సర్వే చేయాలని, దీంతో సాగు వ్యయం తగ్గి రైతులకు లాభసాటిగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఉద్యాన విశ్వవిద్యాలయం రూపొందించిన 2019 కేలండర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎం.విజయ, డాక్టర్ భగవాన్, డాక్టర్ రవీందర్ రెడ్డి , డాక్టర్ కిరణ్, పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

విజయక్రాంతి, మంచిర్యాల: ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట పట్టణ ఎస్సై మధుసుధన్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సుప్రజ అనే విద్యార్థిని జాతీయ స్థాయి హాండ్‌బాల్ క్రీడల్లో బంగారు పథకం సాధించిన సందర్భంగా జనగనమణ స్టీరింగ్ కమిటి ఆధ్వర్యంలో క్రీడాకారినికి ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల పట్ల మానసిక ఉల్లాసం పొందవచ్చునని తెలిపారు. అంతేకాకుండా ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రత్యేక కోటా ఉంటుందని అందులో మొదటి ప్రాధాన్యత ఇలాంటి క్రీడాకారులకు మాత్రమే ఉంటుందని తెలిపారు. విద్యార్థినిలు పట్టుదల, క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, చదివే పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రతి విద్యార్థిని క్రీడల్లో సుప్రజను ఆదర్శంగా తీసుకోని అంతకంటే రెట్టింపు విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం క్రీడాకారిణి సుప్రజను శాలువాతో ఘనంగా సన్మానించి ఐదువేల రూపాయాలను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రవీందర్, జనగనమణ స్టీరింగ్ కమిటి సలహాదారు మైలారపు శ్రీనివాస్, కన్వీనర్ బొప్ప సతీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యశోద, క్రీడా ఉపాధ్యాయులు రోజావరకుమారి, రమేష్, రఘునాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పల్లె పోరులో..ప్రలోభాల పర్వం

- అసెంబ్లీ ఎన్నికలను తలపిస్తున్న హడావిడి
- ఓటర్లను ఆకట్టుకునే పనిలో పోటీదారుల పోటీ
- పట్నం ఓటర్ల ఉరుకుల పరుగులు

విజయక్రాంతి, సంగారెడ్డి: గ్రామ పంచాయితీ ఎన్నికల్లో హడావిడి ఊపందుకుంది. రెండో విడత నామినేషన్ల తతంగం ముగిసిన నేపథ్యంలో మూడో దిశ నామ పత్రాల సమర్పణ షురూ సైతం అయింది. ఎన్నడూ లేనంతగా ఈదఫా పంచాయితీ ఎన్నికలు ముగిసిన 2018 శాసనసభ ఎన్నికలను తలపిస్తున్నాయని ప్రస్తుతం పల్లెల్లోని హడావిడి బట్టి తెలుస్తోంది. పంచాయితీ పోరు పల్లెల్లో ఉండగా..పట్నంలో నామపత్రాలు సమర్పించిన అభ్యర్థుల ఉరుకులు పరుగులు కనబడుతున్నాయి. పల్లెల్లో ఓ దఫా, పట్టణంలో ఓ దఫా రేయింబవళ్లు ప్రచార వేగం పెంచుతున్నారు. గ్రామాల్లో ఉపాది కరవై.. పొట్ట కూటి కోసం వలస బాట పట్టిన గ్రామీణ ప్రాంత ఓటర్లను మచ్చిక చేసుకోవటానికి పోటీదారులు పోటీ పడుతున్నారని చెప్పవచ్చు. అన్నా,అక్కా, అవ్వా అంటూ వరుసలు కలుపుతూ ఫోన్లో పలకరింపులు, ఆపై పట్టణానికి పరుగులు తీయడం.. ఓటర్లను దర్శనం చేసుకోవడం, పనిలో పనిగా వస్తూ, ధన రూపేనా వారిని ప్రలోభాలకు గురిచేయటం ప్రధానంగా కనబడుతోంది.

మెదక్ ఉమ్మడి జిల్లా 1615 గ్రామాల్లో జరుగనున్న పంచాయితీ ఎన్నికల్లో ప్రచార పర్వం ఊపందుకుంది. ప్రచార ఆర్బాటంలో అధికార పక్షం టీఆర్ఎస్ పార్టీ పరుగులు తీస్తుండగా.. కారు జోరుకు ప్రతిపక్ష పార్టీలు అడ్డుకట్ట వేసే విధంగా సన్నాహాలు చేస్తున్నాయి. 2018 శాసనసభ ఎన్నికల దృష్ట్యా అభ్యర్థులను వెనువెంటనే ఖరారు చేస్తూ.. పంచాయితీ బరిలోకి దింపుతున్నాయి. ముఖ్యమంత్రి ఇలాక అయిన మెదక ఉమ్మడి జిల్లాలో ఎక్కువ శాతం పంచాయితీలను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్లు తెలుస్తోంది. ఏక గ్రీవంగా అధికార పార్టీకే ప్రజలు పట్టం కడుతున్నట్లు సమాచారం. మొదటి రెండో విడత నామినేషన్ల ప్రక్రియ ముగియగా.. మూడో నామపత్రాల సమర్పణ ప్రారంభమయింది. నామ పత్రాల సమర్పణ ఓ పక్క జరుగుతుండగానే.. మరో పక్క ప్రచారానికి తెరతీసారు. నామినేషన్ల పరిశీలన, ఉప సంహరణ, గెలుపోటముల సంఘతి ఎలా ఉన్నా ఎన్నికల గడువు సమీపిస్తుండగా.... ప్రచారానికి దూసుకెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నారు. ముందు అనుచరులు, కుటంబ సభ్యులు ఇలా వాడా వాడలా తిరుగుతూ తమ అభ్యర్థిని గెలిపించండి అని బొట్టు పెడుతున్నారు. ఇదిలా ఉండగా.. అధికార పార్టీకి చెందిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఎమ్మెల్యేలు రంగంలోకి దిగారు. గ్రామం పురోగతి పరిచే బాధ్యత మాది.. మీరు టీఆర్ఎస్ అభ్యర్థినే గెలిపించండంటూ ఓటర్లను కోరుతున్నారు.

తాయిలాల పర్వం..

పంచాయితీ ఎన్నికల్లో ఓటర్లను మభ్య పెట్టేందుకు అభ్యర్థులు ముందస్తు ప్రణాళికలు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు తాయిలాలు సిద్ధం చేసుకొని చాపకింద నీరులు విస్తృతంచేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా మెదక్ జిల్లా పరిధిలోని గ్రామాల్లో ఓటర్లకు కానుకలు సమర్పించేందుకు రాజకీయ పార్టీల నాయకుల ఇండ్లతో భారీగా సరంజామా సిద్ధం చేసి ఉంచారు.

సమాచారం అందుకున్న పోలీసులు సోదాలు నిర్వహించి పంపిణీకి సిద్ధంగా ఉన్న సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని మాచవరంలో మద్యం, చీరలు పంపిణీ చేస్తుండగా మెదక్ గ్రామీణ పోలీసులు గుర్తించి పలువురిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసిన ఘటన గ్రామంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 13 ఆదివారం రాత్రి అందిన విశ్వసనీయ సమాచారంతో మాచవరం గ్రామానికి వెళ్లి అక్కడి కాంగ్రెస్ నాయకులు రాధాకృష్ణ ఇంట్లో తనిఖీ చేయగా ఓటర్లకు పంపిణీ చేసేందుకు సిద్దంగా ఉంచిన మద్యాన్ని గుర్తించి వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. అలాగే గ్రామానికి చెందిన వేణుగౌడ్, నాగేశ్వర్ రావు, బాలయ్యల ఇళ్లలో 22చీరలు, తెరాస నాయకులు సుబ్బారావు ఇంట్లో మద్యం సీసాలను స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం ఇదే గ్రామానికి చెందిన శ్రీనివాస్, రాములు, పురుషోత్తంలు చీరలు పంపిణీ చేస్తుండగా వాటిని స్వాదీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేశారు. మొత్తం 11 కార్టన్ల మద్యం (528 సీసాలు), 8బీర్లు,2పుల్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక పోలీసులు చెప్పారు.

హంతకులకు జీవిత ఖైదు

విజయక్రాంతి, రామగుండం: కట్టుకున్న భర్తను ఇద్దరు యువకులతో కలిసి హతమార్చిన నేరంపై ఓ మహిళతోపాటు యువకులకు యావజ్జీవ కారాగార శిక్షను విధిస్తు గోదావరిఖని జిల్లా 6వ అదనపు న్యాయస్థానం తీర్పునిచ్చింది. పారిశ్రామిక ప్రాంతంలో సంచలనం కల్గించిన ఈ హత్యోదంతం 2014 అగస్టు 5న జరుగగా, గోదావరిఖని సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వాసుదేవరావు నేతృత్వంలో కోర్టు కానిస్టేబుల్ ఎస్.రాధాకృష్ణ ఈ శిక్షకు సంబంధించి పూర్తి వివరాలను తెలిపారు. స్థానిక విద్యానగర్‌లో నివాసముండే సింగరేణి కార్మికుడు కల్వల రాజేందర్‌కు భార్య చనిపోవడంతో కల్వల ప్రేమలత అనే యువతిని వివాహం చేసుకున్నాడు. రాజేందర్‌కు సంబంధించిన ఆస్తి విషయంలో రాజేందర్, ప్రేమలతల మధ్య వివాదం నెలకొల్పింది. ఈ క్రమంలో ప్రేమలత స్థానిక రమేష్‌నగర్‌కు చెందిన పొన్నం సాయికృష్ణ, అశోక్‌నగర్‌కు రాసూరి మల్లిఖార్జున్‌లతో కలిసి రాజేందర్‌ను తీవ్రంగా కొట్టారు. గొంతును నులిమి చంపారు. అయితే రాజేందర్ మరణాన్ని ఆత్మహత్యగా చిత్రీకరించారు. రాజేందర్ సోదరుడు నరేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సిఐ శ్రీధర్ కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టగా ఈ మరణం హత్యగా పోస్టుమార్టంలో బయటపడింది. ఈ ముగ్గురిపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరుచగా తగు సాక్ష్యాలను పిపి భూసగణపతి కోర్టుకు సమర్పించారు. ఈ మేరకు శుక్రవారం ప్రేమలత, సాయికృష్ణ, మల్లిఖార్జున్‌లకు జీవిత ఖైదిని ఖరారు చేస్తు అదనపు జిల్లా న్యాయమూర్తి సాంబశివరావునాయుడు తీర్పు చెప్పారు. అలాగే మరో ఏడేళ్లు కూడ జైలు శిక్ష విధిస్తు ఒక్కొక్కరికి రూ.500 జరిమాన విధించారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

విజయక్రాంతి, ఎల్బీనగర్: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు 23వ వర్ధంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు సామ రంగారెడ్డి పిలుపు మేరకు ఎల్బీనగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ డివిజన్ చౌరస్తాలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యంజాల జగన్, బిఎన్‌రెడ్డి డివిజన్ అధ్యక్షుడు రవి శంకర్, నూతి శ్రీనివాస్, విజయకుమార్, వెంకట గాంధీ, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

విజయక్రాంతి, మిర్యాలగూడ: మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన తలకొప్పుల పిచ్చయ్య కుటుంబానికి శుక్రవారం ఆర్డీవో జగన్నాధరావు ఆర్థిక సాయం అందజేశారు. గతంలో తలకొప్పుల పిచ్చయ్య పల్లా కృష్ణయ్య చేతుల్లో హత్యగావించబడటంతో అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ నుంచి మంజూరైన రెండో విడత రూ.4,12,500లను చెక్కు రూపంలో అందజేశారు.

ఆంధ్రాలో వైఎస్ఆర్‌సీపీయే గెలుస్తుంది

విజయక్రాంతి, నల్లగొండ: తెలంగాణలో టిడిపి, కాంగ్రెస్‌ను ఏ విధంగా తిరస్కరించారో ఆంధ్రాలో కూడా ఆ పార్టీకి అదే గతి పడుతుందని రై.స.స రాష్ట్ర అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గురువారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ టిఆర్ఎస్ రాష్ట్ర కార్యానిర్వాహక అధ్యక్షుడు కేటిఆర్, కేసీఆర్ ఆదేశాలతో ఫెడరల్ ఫ్రంట్‌లో భాగంగా వైసిపి అధినేత జగన్‌ను కలిశారని జగన్‌కు వస్తున్న ప్రజాధరణ చూడలేక టిఆర్ఎస్‌తో పొత్తు అంటూ టిడిపి విషప్రచారం చేయడం పనికిమాలిన చర్యగా అభివర్ణించారు. బిజెపితో గత నాలుగు సంవత్సరాలుగా సంసారం చేసి ఆంధ్ర ప్రజలను నట్టేట ముంచి ఎన్నికల సమయంలో టిడిపి నేతులు శ్రీరంగ నీతులు చెప్పడం హాస్యస్పదం అని అన్నారు. తెలంగాణలో రెండవసారి అధికారంలోకి వచ్చి తెరాస ప్రజా ప్రతినిధులు శాసనసభలో ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా వారందరికి శుభాకాంక్షలు తెలుపుతున్నానని రాష్ట్రాల హక్కుల సాధన కోసమే ఫెడరల్ ఫ్రంట్ స్థాపిస్తున్నారని దానికి టిడిపి నాయకులకు భయం ఎందుకు వస్తుందో అర్థం కావట్లేదని ఏపిలో టిడిపి పరాజయం తప్పదని తెరాసపై విమర్శలు చేస్తే తెరాస నాయకులు చూస్తూ ఊరుకోరని ఇంకా క్నొ రోజుల్లో టిడిపి అడ్రస్ లేకుండా పోతుందని ఆయన జోస్యం చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో తిప్పర్తి ఎంపిపి పాశం రాంరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పుల్లెంల వెంకటనారాయణగౌడ్, నల్లగొండ ఎంపిపి దైద రజిత వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో అప్పీల్

విజయక్రాంతి, ముషీరాబాద్: గ్రామపంచాయితీ బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతం కు తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారి చేసిన ఆర్డినెన్సు రద్దు చేయాలనీ సుప్రీంకోర్టు లో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశామని బీసీ జాతీయ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ విద్యానగర్ బీసి భవన్ లో ఆయన మాట్లాడుతూ మంత్రి వర్గ సమావేశం లేకుండా అసెంబ్లీలో పాసైన పంచాయత్ రాజ్ చట్టాన్ని సవరించడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ లో పేర్కొన్నామని తెలిపారు.

భద్రతను పటిష్టం చేయాలి: ఎస్పీ

విజయక్రాంతి, సిరిసిల్ల: రాబోవు ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా భద్రతను పటిష్టం చేయాలని జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే సూచించారు. శుక్రవారం పోలీసు కార్యాలయంలో జిల్లాలోని పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని మూడు విడతల్లో జరిగే పంచాయతీ ఎన్నికలను పోలీంగ్ కేంద్రాల నిర్వహణ ప్రణాళిక ప్రకారం ముందుకెళుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించేలా చూడాలన్నారు.

గత ఎన్నికల్లో నమోదు ఐన కేసులు, ఎన్నికల్లో గొడవలు అల్లర్లు సృష్టించిన వారిపై నిఘాను తీవ్రతరం చేయాలన్నారు. గొడవలు అల్లర్లు సృష్టించే వారిని ముందుగానే గుర్తించి సంబందిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఎన్నికలకు సంబందించి ఏవైనా ఫిర్యాదులు వచ్చినా సంఘటనకు సంబంధించి వీడియో,పుటేజీలు తప్పని సరిగా నమోదు చేయాలన్నారు.

కౌన్ బనేగా గ్రామ సర్పంచ్

- చివరి అంకానికి చేరుకొన్న ఎన్నికల ప్రచారం.
- ఓటర్లకు గాలం వేసేందుకు జోరుగా మద్యం, నగదు పంపిణి



విజయక్రాంతి, రాజేంద్రనగర్: గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల ప్రచారం చివరి అంకానికి చేరుకొంది. టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, టిడిపీ, ఇతర వామపక్ష పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు ఎవరికివారు అన్నట్లుగా రాత్రి, పగలు అనేతేడా లేకుండా జోరుగా ప్రచారం చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల కంటే గ్రామ పంచాయతీ ఎన్నికలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. కాగా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండల పరిధిలోని గ్రామాల్లో ఓటర్లను మభ్య పెట్టేందుకు సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులు, వారి అనుచరులు నగదు, మద్యం పంపిణీచేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈనెల 21న ఎన్నికల ప్రక్రియ జరుగనుండటంతో గ్రామాల్లో రాజకీయ వేడి మరింత పెరిగింది. ఇక కొన్ని గ్రామాల్లో అధికార పార్టీ టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య నువ్వా...నేనా అన్నట్లు పోటీ నెలకొంది. మరి కొన్ని గ్రామాల్లో టీఆర్ఎస్, బీజేపీ, టిడిపి పోటీ నెలకొలకొంది. శంషాబాద్ మండలం గ్రేటర్ మహానగరానికి అతి సమీపంలో ఉండటంతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం ఉండటంతో రియల్ వ్యాపారం సైతం జోరుగా ఉండటంతో ఒక్కో సర్పంచ్ అభ్యర్థి లెక్కకు మించి (లక్షల్లో) ఖర్చు చేస్తున్నారు. శంషాబాద్ మండల పరిధిలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు ఉండగా వీటిలో ఒకే ఒక్క గ్రామం మదన్‌పల్లి కొత్త తాండ గ్రామ పంచాయతీ మాత్రమే ఏకగ్రీవంగా ఎన్నికైంది. మిగిలిన 26 గ్రామ పంచాయతీల్లో అన్ని రాజకీయ పార్టీల్లో రసవత్తర పోటీ నెలకొంది.

ఓటర్లకు సర్పంచ్ అభ్యర్థుల తాయిలాలు..

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలిచేందుకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన సర్పంచ్‌లుగా బరిలోకి దిగిన అభ్యర్థులు నామినేషన్లు వేసినప్పటి నుంచి రోజు నిత్యం విచ్చలవిడిగా మద్యం పంపిణీ చేస్తున్నారనే విమర్శలున్నాయి. విచిత్రమేమిటంటే ఈ సంక్రాంతి పండుగకు గుంపులు, వర్గాల వారిగా మద్యంతో పాటు మేకపోతులు, చికన్ పంపిణీ చేయటం ఆశ్చర్య కరంగా ఉందంటున్నారు.

ఇక నిత్యం అన్ని గ్రామాల్లో జోరుగా మద్యం పంపిణీ చేస్తుండటంతో స్థానిక వైన్‌షాపుల్లో మద్యం కొరత ఏర్పడటంతో ఇతర ప్రాంతాల నుంచి మద్యం దిగుమతి చేసుకొన్నరని సమాచారం. అంతే కాదు ఇతర వస్తూ, సామాగ్రిని సైతం అభ్యర్థులు పంచిపెట్టారనే ఆరోపణలున్నాయి. ఇక ఏ గ్రామంలో చూసిన ప్రజలు తమ ఇంటి పనులు మానుకొన్ని ఎన్నికల ప్రచారంలో ఉంటూన్నారని పలు గ్రామాల ప్రజలు తెలిపారు. మండల పరిధిలోని పాల్మాకుల, ముచ్చింతల్, పెద్దతుప్పర గ్రామాల్లో టీఆర్ఎస్, బీజేపీల పార్టీ అభ్యర్థులు నువ్వా, నేనా అన్నట్లు ఉందన్నట్లు కనిపిస్తుంది. అదే విధంగా పెద్దషాపూర్, అమీదుల్లానగర్, సుల్తాన్ పల్లి, నర్కుడ గ్రామాల్లో టీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీల మధ్య పోరు నెలకొంది. అధికార పార్టీకి చెందిన పెద్ద నాయకులతో పాటు స్థానిక ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకొనేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. ఇక రెండు రోజుల్లోనే ఎన్నికల జరుగనుండటంతో గ్రామాల్లో ఎన్నికల కోలాహలం నెలకొంది. చాలా గ్రామాల్లో ఎన్నికల నియామవళిని ఉల్లంఘిస్తున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహారిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో తెలంగాణ స్టాల్



విజయక్రాంతి, హైదరాబాద్: బెంగుళూరు ప్యాలేస్ మైదానంలో ప్రారంభమైన ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో తెలంగాణ వ్యవసాయశాఖ తృణధాన్యాల స్టాల్ ను ఏర్పాటు చేసింది. సేంద్రీయ సాగు, తృణధాన్యాల పంటల పెంపకం, మార్కెటింగ్ ను ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టినట్లు విత్తన, సేంద్రీయ ధృవీకరణ సంస్థ డైరెక్టర్ డా. కేశవులు ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ప్రారంభమైన ఈ ట్రేడ్ ఫెయిర్ ఆదివారంతో ముగియనుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ ఫెయిర్‌ను గత మూడేళ్లుగా నిర్వహిస్తున్నారు. తెలంగాణ ఏర్పాటు చేసిన స్టాల్‌లో సేంద్రీయ సాగులో రైతులు సాగుచేసిన కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలు, చిరుధాన్యాలను ప్రదర్శనకు పెట్టారు.

తెలుగు యునివర్శిటీలో ముగిసిన నాట్యోత్సవాలు

విజయక్రాంతి, మెహిదిపట్నం: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం యక్షగాన కేంద్రం కూచిపూడి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16 నుండి 18 వరకు నిర్వహించిన తెలుగు నాట్యోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ముడవ రోజు సదస్సులో "తెలుగు నాట్యాల పరిశోధన క్రమం సమాలోచనం" అనే అశంపై వక్తలు ప్రసంగించగా,సదస్సుకు ఆచార్య ఎంఎస్ శివరాజు అధ్యక్షత వహించారు. పేరణికుమార్ పేరణి నాట్య రీతులను సవివరంగా వివరిస్తూ పత్ర సమర్పణ చేసారు.సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి.ముగింపు ఉత్సవాలకు తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య అలేఖ్య పుంజాల, విశ్వవిద్యాలయ నృత్యశాఖ అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు, పలువురు నాట్యభిమానులు పాల్గొన్నారు.

సఫాయి మృతులకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా

- ఎస్సీ కమిషన్ సభ్యులు కె.రాములు



విజయక్రాంతి, హైదరాబాద్: ఎస్సీలందరూ కలిసికట్టుగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చని జాతీయ ఎస్సీ కమీషన్ సభ్యులు కె. రాములు తెలిపారు. శుక్రవారం ఖైరతాబాద్ జలమండలి ప్రధాన కార్యాలయంలో జలమండలి తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికులు మ్యాన్‌హోళ్లలో పడి చనిపోతే రూ. 20 లక్షలు నష్ట పరిహారం అందేలా జాతీయ ఎస్సీ కమీషన్ చర్యలు తీసుకుందని తెలిపారు. జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ నగరంలో 1.2 కోట్ల మందికి సేవలు అందించటం క్షేత్రస్థాయి కార్మికుల వల్లేనని తెలిపారు. కార్మికులు చేస్తున్న కృషి వల్లే సంస్థ ఎన్నో అవార్డులు సాధిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీల సమస్యలను బోర్డుకు తెలియజేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి ప్రాజెక్టు1 డైరెక్టర్ . ఎం.ఎల్లాస్వామి,ఆపరేషన్1 డైరెక్టర్. అజ్మీరా కృష్ణ, లతో పాటు అసోసియేషన్ ప్రతినిధులు ప్రెసిడెంట్ బి.భూమయ్య, జనరల్ సెక్రెటరీ బి. ఆర్. శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ సి.రాజు, బి. జ్ఞానేశ్వర్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఎం.రాజా, ట్రెజరరీ పి. కృష్ణ, ప్రతినిధులు ఎం.ఎస్. శేఖర్ లతో పాటు పలువురు అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ జట్టుకు ఎంపికైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని

విజయక్రాంతి, శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండలం మియాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ కె లక్ష్మి జాతీయస్థాయి కబడ్డీ జట్టుకు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తంచేశారు. తెలంగాణ జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక కావడం యావత్ మండలానికే గర్వకారణమని మండల విద్యాధికారి రాంచందర్ రావు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థిని లక్ష్మీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ మరియు హోప్ ఫౌండేషన్ సభ్యులు లక్ష్మీని అభినందిస్తూ ప్రోత్సహకంగా రూ.5000ల నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. అలాగే విద్యార్థికారి రాంచందర్ వ్యక్తిగతంగా రూ. రెండువేలు, లయన్స్ క్లబ్ సభ్యులు రూ.6000 లు బహుకరించారు.

27న కోటి హనుమాన్ చాలీసా పారాయణం

విజయక్రాంతి, అంబర్‌పేట్: సద్గుణ బాల మాస పత్రిక ఆధ్వర్యంలో "ధర్మ రక్షణ – దేశ సంక్షేమం" కోసం కోటి హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమం ఈ నెల 27వ తేదిన ఆదివారం శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ సాయంత్రం 4:30గంటల నుంచి 8:30గంటల వరకు కాచిగూడ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న శ్యాం బాబా మందిర్‌లో నిర్వహిస్తున్నట్లు సద్గుణ బాల సంపాదకులు డి.ఆర్.ఎస్.నరేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమం సంబంధించిన గోడ పత్రికను ఎమ్మెల్సీ, బీజేపీ గ్రేటర్ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విడుదల చేశారు. హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ కేంద్రమంత్రి, ఎంపి బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.కె.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి, శ్యామ్ మందిర్ సేవా సమితి అధ్యక్షుడు అశోక్ జీ.టిబ్రేవాల్, ఎమిరిటస్ ఆంధ్రప్రదేశ్ మహేష్ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ రమేష్‌కుమార్ బంగ్‌లు, విజయ నగర సామ్రాజ్య సంస్థాన పరంపర ఆచార్యులు శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య శ్రీ హంపీ విరూపాక్ష పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతీ స్వామి పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో న్యాయవాది గూడా వెంకటేశ్వర్‌రావు, సామల ఓంకార్, బైర్కొండ శేఖర్ పాల్గొన్నారు.

సంక్షేమ శాఖను కుదించొద్దు

- సీఎంకు టీఎస్‌బీసీడబ్ల్యూఏ లేఖాస్త్రం

విజయక్రాంతి, హైదరాబాద్: వివిధ సంక్షేమ శాఖలను ఒకే గొడుగు కింది తెచ్చేందుకు వాటిని కుదించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని ప్రభుత్వాన్ని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కోరింది. ఈ మేరకు సీఎం కు ఆ సంఘం లేఖాస్త్రం సంధించింది. రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో ఆ సంఘం ప్రతినిధి బృందం ఈ లేఖను సీఎం కార్యదర్శి భూపాల్ రెడ్డి కి సమర్పించడం జరిగింది. ఈ బృందంలో ఇ నిరంజన్, కనకల శ్యామ్, జాజుల లింగమ్ గౌడ్, బతిని రాజు, బండిగారి రాజు, శ్రీరామ్ తదితరులున్నారు. లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. పరిపాలనా సౌలభ్యం కోసం 10 జిల్లాలను 33 జిల్లాలుగా చేసినప్పుడు సంక్షేమ శాఖలను కుదించటంలో అర్థం లేదని ఎత్తిచూపారు.

65 పంచాయతీలు ఏకగ్రీవం

విజయక్రాంతి, ఆదిలాబాద్: జిల్లాలో రెండో విడత ఎన్నికల్లో 65 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఈ విడతకు సంబంధించిన నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగిసింది. దీంతో ఆ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఐదు మండలాల పరిధిలోని 149 గ్రామ పంచాయతీల్లో రెండో విడత ఎన్నికలు జరుగనుండగా 58 పంచాయతీల్లో ఒకే నామినేషన్ దాఖలైంది. దీనికి తోడు మరో ఏడు గ్రామాల్లో కొంతమంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 65 పంచాయతీలు ఏకగ్రీవం కాగా మిగిలిన 83 పంచాయతీల్లో సర్పంచ్ పదవీకోసం 303మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు.ఇందులో బోథ్ మండలంలోని 33 పంచాయతీలకు గాను 13చోట్ల ఏకగ్రీవం కాగా 20 పంచాయతీల్లో 86మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. గుడిహత్నూర్‌లో 26 పంచాయతీలకు గాను 09 ఏకగ్రీవం మరో 17చోట్ల 64మంది పోటీపడుతున్నారు. బజార్‌హత్నూర్ మండలంలో 30 పంచాయతీల్లో 11ఏకగ్రీవం 19ల్లో 58మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. తలమడుగులో 28కి 16 ఏకగ్రీవం, 12పంచాయతీల్లో 45మంది, నేరడిగొండ మండలంలో 32 పంచాయతీలకు 16 ఏకగ్రీవం కాగా మరో 16చోట్ల 50మంది అభ్యర్థులు తలపడుతున్నారు.

పోలియో డే వాయిదా

విజయక్రాంతి, హైదరాబాద్: జాతీయ పోలియో నివారణకు ఇమ్యూనైజేషన్ డే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసింది. ఇంతకు ముందు జాతీయ ఇమ్యూనైజేషన్ డేను ఫిబ్రవరి 3న నిర్వహించాలని తలపెట్టిన సంగతి తెలిసిందే. కాగా అనివార్య కారణాల మూలంగా ఇమ్యూనైజేషన్ డేను వాయిదా వేస్తున్నట్టు కేంద్రం అన్ని రాష్ట్రాలకు శుక్రవారం సమాచారం పంపించింది. తదుపరి ఇమ్యూనైజేషన్ డేను ఎప్పుడు నిర్వహించేది విషయాన్ని నిర్ణయిస్తామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఇమ్యూనైజేషన్ విభాగం డిప్యూటీ కమిషనర్ (ఇన్‌చార్జి) డాక్టర్ ప్రదీప్ హల్దార్ రాష్ట్రాలకు పంపిన లేఖలో తెలిపారు.



శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో అభిమానులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పక్కన ఎమ్మెల్యే భట్టి విక్రమార్క.

సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క

- ఉత్తర్వులు జారీ చేసిన అశోక్ గెహ్లాట్

విజయక్రాంతి, హైదరాబాద్: ఎట్టకేలకు కాంగ్రెస్‌లో సీఎల్పీ నేత ఎవరన్నదానిపై ఉత్కంఠతకు తెరపడింది. శుక్రవారం సాయంత్రం సీఎల్పీ నేతగా మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కను ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ నియమించారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అశోక్ గెహ్లాట్ ప్రకటించారు. దీనికి సంబంధించిన నియామక ఉత్తర్వులను ఆయన విడుదల చేశారు. సీఎల్పీ నేత ఎవరన్నదానిపై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కూడా తీవ్రంగానే కసరత్తు చేసినప్పటికీ సీఎల్పీ నేత ఎవరన్నదానిపై స్పష్టత రాలేదు. దీంతో నిర్ణయాన్ని పార్టీ అధిష్టానానికి వదిలేయాలని ఇటీవల కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. పార్టీ అధిష్టానం ఎవరిని నిర్ణయించినా తమకు సమ్మతమేనంటూ ఏకగ్రీవంగా ప్రకటించారు.

సీఎల్పీ నేతగా ప్రధానంగా పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మల్లుభట్టి విక్రమార్కల మధ్యే పోటీ ఉన్నదని పలు వురు భావించారు. కానీ ఈ కోవలో మరి కొందరు కాంగ్రెస్ నేతలు కూడా చేరారు. దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి రాజాగోపాల్ రెడ్డిల కు మద్దతుగా కూడా పలువురు కాంగ్రెస్ నేతలు మద్దతు ప్రకటించారు. అటు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కూడా సీఎల్పీ ఆశావాహుల జాబితాలో ఉన్నారు. అంతేగాకుండా మహేశ్వరం నుంచి విజయ దుందుభి మోగించిన సబితా ఇంద్రారెడ్డి కూడా సీఎల్పీ పదవికి అర్హురాలని పలువురు పేర్కొన్నారు.

కాగా ఏఐసీసీ ప్రతినిధి వేణుగోపాల్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ కుంతియా సమక్షంలో 19 మంది పార్టీ సభ్యుల నుంచి వ్యక్తిగతంగా అభిప్రాయాలు సేకరించారు. అసెంబ్లీ మీడియా సమక్షంలో వేణుగోపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల నుంచి అభిప్రా యాలు



సేకరించినట్లు తెలిపా రు. ఈ అభిప్రాయాలన్నీ ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి వివరిస్తానని ప్రకటించారు.

సీఎల్పీ నేత నిర్ణయాన్ని గురువారమే ప్రకటించాల్సి ఉన్నా, రాహుల్‌గాంధీ ఢిల్లీలో అందుబాటులో లేని కారణంగా ప్రకటించ లేకపోయామని పార్టీ సీనియర్ నేతలు తెలిపారు. రాజకీయ, సామాజిక సమీకరణాల నేపథ్యంలో సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్కను ఎన్నుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

గతంలో మల్లుకు డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. 2009లో చీఫ్ విప్ అయ్యారు. 2014లోనూ ఎమ్మెల్యేగా గెలుపొందారు. తాజాగా కూడా ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

ఫిబ్రవరి ఒకటి నుంచి కరీంనగర్‌లో

బాలల చలనచిత్ర వారోత్సవాలు



విజయక్రాంతి, కరీంనగర్: ఫిబ్రవరి ఒకటవ తేదీ నుంచి వారం రోజుల పాటు కరీంనగర్‌లో బాలల చలన చిత్ర వారోత్సవాలు నిర్వహించనున్నట్లు కరీంనగర్ జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో చిల్డ్రన్స్ ఫిలిం సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, జిల్లా విద్యాధి కారులు, పోలీస్ అధికారులు, సినిమా థియేటర్ల యజమానులతో బాలల చలన చిత్ర వారోత్సవాల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న పిల్లలకు ఉపయోగపడే మంచి సందేశాత్మకమైన బాలల చలన చిత్రాలను ఉచితంగా నగరంలోని అన్ని సినిమా థియేటర్లలో ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. చదువుతో పాటు బాలల చలన చిత్రాలు తిలకించడం వలన విద్యార్థులలో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీస్తుందని అన్నారు.

అలాగే నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 6 నుండి 9వ తరగతి వరకు చదివే విద్యార్థిని, విద్యార్థులకు చలనచిత్రాలు చుపించుటకు వీలుగా రోజు వారిగా, థియేటర్ వారి గా కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని, నగరానికి చుట్టు పక్కల గల మండలాలలో గల విద్యాలయలతో పాటు కస్తుర్భా, నవోదయ, మోడల్ స్కూళ్లలో చదివే విద్యార్థులు కూడా తిలకించేలా ప్రణాళికలు తయారు చేయాలని విద్యాధికారులను కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో బిక్షునాయక్, ఎసీపీ రాగ్యానాయక్, సమాచార శాఖ ఉపసంచాలకులు ఎన్. వెంకటేశ్వర్‌రావు, సంస్థ ప్రతినిధులు, విద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు

ఎన్డీ అశోక్ కమాండర్, ఇరువురు కొరియర్లు అరెస్ట్

విజయక్రాంతి, మహబూబాబాద్: తమకు అందిన సమాచారం మేరకు కొత్తగూడ తాటి వారి వేంపల్లి అడవులలో ఎన్డీ అశోక్ దళంలోని డిప్యూటి కమాండర్, ఇద్దరు కొరియర్లను అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి తెలిపారు. శుక్రవారం మహబూబాబాద్ టౌన్ పోలీస్ కాన్ఫరెన్స్ హల్‌లోని మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం కొత్తగూడ మండలంలో తాటివారి వేంపల్లి గ్రామ ప్రజలతో సమావేశమై గ్రామ పంచాయతీ ఎన్నికలలో తమ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలతో మాట్లాడుతున్నారన్న సమాచారం మేరకు అటవీ మార్గంలో పోలీసులు నిఘా వేశామన్నారు. ఎదురైన నక్సలైట్లను పట్టుకునే ప్రయత్నంలో డిప్యూటి దళ కమాండర్ ఇద్దరు కొరియర్లు దొరికారని మిగతా దళం పారిపోయారని ఎస్పీ తెలిపారు. వారి నుంచి స్ప్రింగ్ ఫిల్డ్ ఆయుధంతో పాటు 48తూటాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పీ రావుల గిరిధర్, డిఎస్పీ నరేష్ కుమార్ కొత్తగూడ ఎస్సై తాహిర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

విజయక్రాంతి, నాగర్‌కర్నూల్: ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా ఆశా సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దశరథ్‌నాయక్ కోరారు. శుక్రవారం నాడు జిల్లా వైద్యశాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సిబ్బంది. నోడల్ పర్సన్‌ల జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సిబ్బంది గర్భిణీలను గుర్తించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. గ్రామాల నుంచి ఆసుపత్రికి 102 వాహనం ద్వారా తరలించి వారికి చికిత్స అందించాలని సూచించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రోత్సహించిన విధంగానే ప్రసవాలను ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగే విధంగా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉప వైద్యాధికారి వెంకట్‌దాస్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, డాక్టర్ మీరా సిబ్బంది మంగకుమార్ పాల్గొన్నారు.

వేములవాడ కళ్యాణకట్టలో

వేడినీళ్ల కేంద్రం ఏర్పాటు



విజయక్రాంతి, కరీంనగర్: ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలోని కళ్యాణకట్టలో భక్తుల సౌకర్యార్థం వేడినీళ్ల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో దూస రాజేశ్వర్ తెలిపారు. 3.5 లక్షలతో ఇటీవల సోలార్‌ప్లాంటును ఏర్పాటు చేయగా శుక్రవారం ఈవో సోలార్‌కేంద్రం పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడినీళ్ల ఏర్పాటు చేయడం ద్వారా తలనీలాలు సమర్పించుకునే భక్తులు వేడినీళ్లతో స్నానాలు చేసే అవకాశం ఉందని, ఈ కేంద్రం గంటకు వెయ్యిలీటర్ల నీటిని అందిస్తుందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి శుక్రవారం భక్తులు చేరుకోగా రద్దీ నెలకొనగా ఆలయం సందడిగా మారింది. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సీతారామచంద్రమూర్తి, అనంతపద్మనాభస్వామి వారి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించి కోడె మొక్కులు చెల్లించుకున్నారు.

పంచాయతీ ఎన్నికలకు ముమ్మర ఏర్పాట్లు

విజయక్రాంతి, మంచిర్యాల: గ్రామ పంచాయతీల ఎన్నికలకు పోలింగ్ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన వాటన్నింటిని మంచిర్యాల జిల్లాలోని ఆయా ఆయా మండల పరిషత్ అధికారులు సమకూర్చారు. గ్రామాలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాను పోలింగ్ అధికారులకు అందజేసే ప్రక్రియలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా జరిపేందుకు అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఈ నెల 21వ తేదిన గ్రామ పంచాయితీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో విధులలో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆయా ఆయా మండల కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఎన్నికల్లో సర్పంచ్, వార్డు మెంబర్లుగా పోటి చేసే అభ్యర్థులపై ఫ్లైయింగ్ స్క్వాడ్ నిఘా పెట్టింది. వారు ప్రచారంలో చేస్తున్న ప్రతి పైసా ఖర్చు వివరాలతోపాటు, ఎవరైనా మద్యం, డబ్బులతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారో అని నిఘా తీవ్రతరం చేశారు.

సాత్నాల మండలంలో కలపొద్దు

విజయక్రాంతి, ఆదిలాబాద్: ఏజెన్సీ పరిధిలోని గ్రామాలను నూతనంగా ఏర్పడే సాత్నాల మండలంలో కలపొద్దని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ)నేతలు డిమాండ్ చేశారు. స్థానికంగా నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన నేతలు టీఆర్ఎస్ సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆదివాసీల హక్కులను తుంగలో తొక్కి తమ హక్కులను కాలరాస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు. ఆదివాసీ గ్రామాల ప్రజలను భయభ్రంతులకు గురిచేస్తున్నారన్నారు. ఇప్పటికే 5వ షెడ్యూల్డ్‌లోని గ్రామాలను జిల్లాల పేరిట విడదీసి చింపిన విస్తరీలా చేసిన ప్రభుత్వం తాజాగా సాత్నాల మండలం పేరిట చించుఘాట్, వాన్వట్, మామిడిగూడ, పిప్పల్‌దరి, మలెబోరిగాం గ్రామాలను అందులో కలిపేందుకు ప్రయత్నిస్తుందన్నారు. అధికారుల ఈ నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. దీన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపడుతామన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోడం గణేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సలాం జంగుపటేల్ పాల్గొన్నారు.

హెటెరో డ్రగ్స్ ప్రాంగణ నియామకాలు

విజయక్రాంతి, కరీంనగర్: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని శ్రీ చైతన్య విద్యాసంస్థలు ఏర్పాటు చేసిన ప్రాంగణ నియామకాల్లో భాగంగా ప్రముఖ ఔషధ సంస్థ హెటెరోడ్రగ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన ఉదయం 9.30 గంటలకు నియామక ప్రక్రియ ప్రారంభిస్తారని విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెటెరో డ్రగ్స్ ప్రతినిధులు జిల్లా యువత నుండి మంచి స్పందన కోరుకుంటున్నారని తెలిపారు. 2016–17, 2017–18లో బీఎస్సీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన వారందరు ఈ నియామకాల్లో పాల్గొనవచ్చని, ఆసక్తిగల వారు ఎల్ఎండీలోని చైతన్య కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.ఎంపికయిన వారికి వెంటనే నియామక పత్రాలను అందజేయడం జరుగుతుందని, ఆసక్తిగల వారు తమ అర్హతా పత్రాలతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలుడు.. ఇద్దరి దుర్మరణం

- ఎనిమిది మందికి గాయాలు..
- నలుగురి పరిస్థితి విషమం

విజయక్రాంతి, ఉప్పల్: హైదరాబాద్‌లోని కుషాయిగూడా పోలిస్‌స్టేషన్ పరిధిలో గల కాప్రాలో శుక్రవారం ఉదయం సిలిండర్ పేలడంతో ఇద్దరు మృతి చెందారు. ఎనిమిది మందికి గాయాలయ్యాయి.. నిస్తున్నారు. ఇంట్లో గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న సమయంలోనే ఈ ఘటన జరిగి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దర్యాప్తులో అన్ని నిజాలు బయటకు వస్తాయని పోలీసులు చెబుతున్నారు. పేలుడు విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అన్ని రకాలుగా



మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన స్థానికుల్లో తీవ్ర భయాందోళనలను రేకెత్తించింది. వివరాల్లోకి వెళితే మోహన్‌లాల్ చౌదరి అనే వ్యక్తికి చెందిన రెండంతస్తుల భవనంలో ఇంట్లో గ్యాస్ సిలిండర్ భారీ శబ్దంతో పేలింది. పేలుడు ధాటికి ఇల్లు పూర్తిగా కుప్పకూలిపోయింది. భవనంలోని రాయి రోడ్డుపై వెళుతున్న రవి అనే వ్యక్తికి బలంగా తగలడంతో అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఇంట్లోని నలుగురు తీవ్రంగా గాయపడతా ఇంటియాజమాని మోహన్‌లాల్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని సహాయకచర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.

పేలుడు ధాటికి చుట్టుపక్కల ఇళ్ల అద్దాలన్నీ పగిలిపోయాయి. అరకిలోమీటరు వరకు రాళ్లు ఎగిరిపడినట్లు స్థానికులు చెబుతున్నారు. కిలోమీటరు వరకు భారీ శబ్దం వచ్చినట్లు తెలిపారు. అయితే కేవలం గ్యాస్ సిలిండర్ పేలుడు వల్లే ఇంత విధ్వంసం జరిగిందా? లేక వేరే కోణాలున్నాయా? అని పోలీసులు అనుమా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

రూ. 3లక్షల ఎక్స్‌గ్రేషియా

కాప్రా సర్కిల్ పరిధిలో శుక్రవారం ఉదయం గ్యాస్ సిలిండర్ పేలుడు సంఘటనలో మరణించిన రవి అనే వ్యక్తి కుటుంబానికి జీహెచ్ఎంసీ నిధుల నుంచి రెండు లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియాగా అందజేస్తున్నట్టు నగర మేయర్ బొంతు రామ్మోహన్ ప్రకటించారు. ఈ సంఘటన జరిగిన విధానాన్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, ఫైర్ సర్వీస్, పోలీసులు సంఘటన స్థలంలో పునరావాసా చర్యలను చేపట్టాయని మేయర్ పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్ విషయంలో నిర్లక్ష్యం వల్లే గ్యాస్ లీకేజ్ అయ్యి ప్రమాదం సంభవించిందని మేయర్ పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి రూ. 2లక్షల ఎక్స్‌గ్రేషియాను అందించడంతో పాటు ఆపద్బంధు పథకం నుంచి మరో లక్ష రూపాయలు అందిస్తామని తెలిపారు. క్షతగాత్రులను సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని మేయర్ తెలిపారు.

ముగిసిన నామపత్రాల తుదిగడువు

విజయక్రాంతి, ఆసిఫాబాద్: మూడో విడత నామపత్రాలు శుక్రవారం రోజు తుదిగడువు కావడంతో భారీగా ఆయా క్లస్టర్ల వారీగా సర్పంచ్ వార్డు సభ్యులు ఆశావాహులు నామ పత్రాలు సమర్పించారు. పూర్తిగా ఏజెన్సీ మండలాలైన కెరమెరి, జైనూర్, సిర్పూర్–యు, లింగాపూర్ మండలాలతో పాటు, వాంకిడి మండలంలో కూడా నామ పత్రాలు స్వీకరించారు. ఈ మండలాల్లో అనేక పంచాయతీలు నూతనంగా ఏర్పడ్డాయి. చిన్న పంచాయతీలు వాటిని ఏకగ్రీవం చేయడానికి స్థానిక నేతలు, నాయకులు, గ్రామ పెద్దలు తమ ప్రయత్నాలతో కొన్నిచోట్ల సఫలీకృతులయ్యారు. ఏజెన్సీ మారుమూల పంచాయతీల్లో నామపత్రాల దాఖలు చేసే సందర్భంలో అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోటి చేసే అభ్యర్థులను బలపరిచే వ్యక్తులు తప్పనిసరిగా నోడ్యూస్ ధ్రువపత్రాలు కలిగి ఉండాలనే నిబంధన చివరి నిమిషంలో అభ్యర్థులకు తెలియడంతో వాటి కోసం అభ్యర్థులు ఆయా కార్యాలయాలకు ఉరుకులు పరుగులు పెట్టారు. మొదటి విడతలో బెజ్జూర్ (07) పెంచికల్ పేట్ (03) కౌటల (03) సిర్పూర్–టి (01) దహెగాం(03) చింతలమానేపల్లి (01) పంచాయతీలు ఏకగ్రీవం కాగా, రెండో విడతలో ఆసిఫాబాద్ (01) కాగజ్‌నగర్ (09) తిర్యాణి (08) రెబ్బెన (01) పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

ప్రధాన సమస్యలను తీర్చాలి: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

విజయక్రాంతి, ఎల్బీనగర్: ఎల్బీనగర్ నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు అయిన ఇంటి పన్ను, డ్రైనేజి, వాటర్, రోడ్లు, కరెంట్, పార్కు, కబ్జా సమస్యలపై జీహెచ్ఎంసీ కమిషనర్ దాన కిషోర్‌ను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుండే డ్రైనేజీ పనులు చేస్తే ప్రజలకు కొంతమేర ఉపశమనం కలుగుతుందన్నారు. అలాగే నియోజకవర్గంలో కొన్ని చోట్ల పార్కులు కబ్జాకు గురి అవుతున్నాయన్నారు. ప్రధానంగా మన్సూరాబాద్ డివిజన్ నందు అగమయ్య కాలనీ చుట్టూ దాదాపు పదుల కాలనీ వాసులకు (అగమయ్యకాలనీ, మల్లికార్జున నగర్, బ్యాంకు కాలనీ, సాయినాథ్ కాలనీ, గణేష్ నగర్ కాలనీ, హకీమాబాద్ కాలనీ, ఇంద్రనగర్, ఈశ్వరమ్మ కాంప్లెక్స్) డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో చిన్నపాటి వర్షానికి కాలనీలోని రోడ్లు మునిగిపోవడమే కాకుండా వర్షానికి వాహనాలు కూడా కొట్టుకు పోవడం జరుగుతుందన్నారు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే పెద్ద ట్రంక్ లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ విధంగా చేస్తే రాబోయే 30 సంవత్సరాల వరకు ఎలాంటి ఇబ్బంది ఉందన్నారు. ఎల్బీనగర్ నుంచి చింతల కుంట సాగర్ రింగ్ రోడ్ నుంచి ఎల్బీనగర్ ఫ్లైఓవర్ పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఈశ్వరమ్మ యాదవ్, లింగాల నాగేశ్వరరావు, బిచేనేపల్లి వెంకటేశ్వర్లు, తులసి శ్రీనివాస్, చింతల రవి, కృష్ణమాచారి, శ్రీనివాస్ యాదవ్, లింగాల రాహుల్ గౌడ్, అఫ్సర్, పీవీ ఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై పోలీసుల బైక్ ర్యాలీ

విజయక్రాంతి, కరీంనగర్: హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ కరీంనగర్ పోలీసులు, ఎల్అండ్‌టీ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కమిషనరేట్ కార్యాలయం నుంచి ప్రారంభం అయిన ఈ వాహన ర్యాలీని కరీంనగర్ పోలీస్ కమిషనర్ వీబి. కమలాసన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించిన అనంతరం కమిషనర్ మాట్లాడుతూ హెల్మెట్ వినియోగం వల్ల ప్రమాదాల్లో తీవ్రత తగ్గడం, మద్యం సేవించి బండినడపడం వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ శ్రీనివాస్, ఎసీపీలు అశోక్, శ్యాంసుందర్, సీతారెడ్డి, శ్రీలత, తుల శ్రీనివాస్‌రావు, దేవారెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పోటీలు

విజయక్రాంతి, రామగుండం: సింగరేణి కంపెనీ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు ఆకట్టుకున్నాయి. శుక్రవారం రామగుండం ఏరియా సిఇఆర్ క్లబ్‌లో ఈ పోటీలను నిర్వహించగా క్రీడాకారులు తమ ప్రదర్శనను చూపించారు. ఈ పోటీల్లో మిస్టర్ సింగరేణిగా మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా కార్మికుడు సమ్మయ్య ఎంపికకాగా, బెస్ట్ లిఫ్టర్‌గా భూపాల్‌పల్లి ఏరియాకు చెందిన భాస్కరాచారి, స్ట్రాంగ్ మెన్‌గా ఆర్‌జి–2 ఏరియాకు చెందిన అరవిందరావు విజేతలుగా నిలిచారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు కోల్ఇండియా స్థాయిలో పోటీలకు అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో అధికారులు వి.విజయపాల్‌రెడ్డి, త్యాగరాజు, హన్మంతరావు పాల్గొన్నారు.

తూకంలో తప్పులు జరగొద్దు

విజయక్రాంతి, సిద్దిపేట: బియ్యం తూకం విషయంలో తప్పులు జరగరాదని మండల్ లెవల్ స్టాకిస్ట్ పాయింట్ నుంచి అన్ని రేషన్ షాపులకు 30 తేదిలోపు సరుకుల రవాణా చేయాలని సిద్దిపేట జిల్లా జాయింట్ కలెక్టర్ పద్మాకర్ ఎమ్ఎల్ఎస్ పాయింట్ల ఇంచార్జిలకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలోడి ఎస్ఓ వెంకటేశ్వర్లుతో జిల్లాలోని 9 ఎమ్ఎల్ఎస్ పాయింట్‌ల ఇంచార్జ్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసిల్దార్ కార్యాలయం నుంచి డీలర్లు చెల్లించిన ఆర్.ఓ లను చెల్లించి, మండల లెవల్ స్టాకిస్ట్ పాయింట్ నుంచి అన్ని రేషన్ షాపులకు సరుకుల రవాణా 19 వ తేది నుంచి ప్రారంభించాలని అన్నారు. అలాగే రోజు వారి స్టాక్ బుక్ అప్‌డేట్ చేయ్యాలని, ప్రతి నెల సకాలంలో తగిన లారీలను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

విజయక్రాంతి, సిరిసిల్ల: జిల్లాలోని కంది రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ యాస్మిన్ భాషా పిలుపునిచ్చారు. శుక్రవారం సిరిసిల్లలోని వ్యవసాయ మార్కెట్ కమిటిలో కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో 750 హెక్టార్లలో కందిని రైతులు పండించడం జరిగిందన్నారు. కందుల్లో 12శాతం తేమ తగ్గకుండా వెంటనే కొనుగోలు కేంద్రానికి తీసుకు రావాలన్నారు. అదే రోజు తూకం వేయించుకొని గిట్టుబాటు క్వింటాలుకు ధర రూ. 5675లు పొందాలని సూచించారు. అలాగే సిరిసిల్లతో పాటు వేములవాడ,రుద్రంగి మండలాలలో కంది కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని జిల్లాలోని రైతులందరూ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈసారి ప్రభుత్వం క్వింటాలుకు అదనంగా రూ.225లు అదనంగా పెంచిందన్నారు. పండించిన కంది పంటను నేరుగా మార్కెట్ తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలన్నారు. దళాలరులను ఆశ్రయించవద్దని కోరారు. మార్కెట్ కొనుగోలు కేంద్రాలలో అధికారులు అందుబాటులో ఉండి రైతులకు సహకరిస్తారని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

విదేశీ విద్య స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

విజయక్రాంతి, ఆసిఫాబాద్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని బీసీ విద్యార్థు లు విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసానికి విద్యానిధి పథకం ద్వారా సహాయం పొందాలను కొనే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడినతుగతుల అభివృద్ధి అధికారి జె.రాజేశ్వర్ తెలిపారు. ఈ నెల 16 వ తేది నుంచి ఫిబ్రవరి 15వ తేదిన సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకం కింద విదేశాలలో విద్యాభ్యాసం చేయగోరు విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వంచే 20 లక్షలు స్కాలర్ షిప్ పొందొచ్చన్నారు.

ఈ నెల 31, ఫిబ్రవరి 1,2 తేదీల్లో

ఎంసీపీఐయూ రాష్ట్ర మహాసభలు

విజయక్రాంతి, మిర్యాలగూడ: ఈ నెల 31, ఫిబ్రవరి 1, 2 తేదీల్లో కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎంసీపీఐయూ తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వరికుప్పల వెంకన్న తెలిపారు. శుక్రవారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభల కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 15 నుంచి 18వ తేదీ వరకూ కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్‌లో జాతీయ మహాసభలు నిర్వహించనున్నామని, దీనికి గాను వామపక్ష పార్టీల జాతీయ కార్యదర్శులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెంచి సామాన్యులపై భారం మోపిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వస్కుల సైదమ్మ, భరత్, గోపి, కాశీ, బాబురావు, వెంకన్న, స్వర్ణమ్మ, జ్యోతి, సతీష్, నాగరాజు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

విజయక్రాంతి, పెద్దపల్లి: ఎన్నికల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించడానికి ఎన్నికల ఫిర్యాదు కేంద్రాలను బలోపేతం చేయాలని ఐటీసీ డైరెక్టర్ కుశాల్ పతాక్ పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ కాంటాక్ట్ సెంటర్, హెల్ప్‌డెస్క్ సంబంధిత అంశాలపై శుక్రవారం ఆయన తెలంగాణాలోని జిల్లాల ఎనికల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. దేశంలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు నాణ్యమైనా, సమయానుకూలంగా సేవలందించేందుకు ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్ వ్యవస్థను బలోపేతం చేయాలని, దీని ద్వారా ప్రజలకు, రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఫిర్యాదులను త్వరగా పరిష్కరించే అవకాశముంటుందని అన్నారు. నేషనల్ గ్రీవియన్స్ సర్వీస్ పోర్టల్ ద్వారా 4800మంది ఎన్నికల అధికారులు, సిబ్బంది ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు పనిచేస్తారని తెలిపారు. ప్రతి జిల్లాలోను జిల్లా కాంటాక్టు సెంటర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన, డీఆర్ఓ నరసింహమూర్తి, ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, కె.నగేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ గల వారితో ఆర్థిక వ్యవస్థకు బలం

హెచ్1బీ వీసాల నిబంధనలపై రోజుకో తీరుగా వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ వీసాలపై పనిచేస్తున్న వారు శ్రమ దోపిడీకి గురవుతున్నట్లు తాజా అధ్యయనంలో తేలింది. భారతదేశానికి చెందినవారే ఎక్కువ మంది అమెరికాలో హెచ్1బీ వీసాపై ఉద్యోగాలు చేస్తున్నారు. అమెరికాలో హెచ్1బీ వీసాపై ఉద్యోగం చేస్తున్నవారు దోపిడీకి గురవుతున్నారని, వేధింపులు ఎదుర్కొంటు న్నారని సౌత్ ఆసియా సెంటర్ ఫర్ ది అట్లాంటిక్ కౌన్సిల్ అనే సంస్థ జరిపిన అధ్యయనంలో తేలింది. వారికి శ్రమకు తగిన వేతనం లభించడం లేదని, పని ప్రదేశాల్లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని అమెరికాకు చెందిన ఆ సంస్థ వెల్లడించింది. ఉద్యోగులు ఇలాంటి పరిస్థితుల్లో పనిచేయడం ఆమెరికా దేశానికే ఎక్కువ నష్టమని హెచ్చరించింది. హెచ్1బీ వీసా ద్వారా అమెరికాలో శాశ్వత నివాసానికి వీలు కల్పించేలా వీసా విధానంలో సంస్కరణలు చేస్తామని, నైపుణ్యం కలిగిన విదేశీ ఉద్యోగుల్ని ప్రోత్సహిస్తామంటూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఆ సంస్థ అధ్యయనం చేసింది. హెచ్1బీ ఉద్యోగుల హక్కుల్ని కాపాడాలని, వారు పనిచేసే వాతావరణాన్ని మెరుగుపరచాలని ఆ సంస్థ తన నివేదికలో సూచించింది. వేతనాలు ఎక్కువగా ఇచ్చి ప్రతిభ కలిగిన విదేశీ ఉద్యోగుల్ని పనిలోకి తీసుకుంటే అమెరికా ఆర్థిక వ్యవస్థకు మరింత బలం చేకూరుతుందని అభిప్రాయపడింది. హెచ్1బీ ఉద్యోగులు తక్కువ వేతనాలకే పనిచేయాల్సి వస్తోంది. వారి శ్రమను దోపిడీ చేస్తున్నారు. వేధింపులకు గురిచేస్తున్నారు. పని చేసే ప్రదేశాల్లోనూ దారుణమైన పరిస్థితులున్నాయని వివరించింది. ఈ పరిస్థితులను మెరుగుపర్చేందుకు పలు సూచనలు చేసింది. మొదట హెచ్1బీ ఉద్యోగుల వేతనాల పెంచాలని స్పష్టం చేసింది. దీంతో ట్రంప్ కోరుకుంటున్నట్లు నిపుణులైన ఉద్యోగులు వస్తారని తెలిపింది. నైపుణ్యం కలిగిన అమెరికన్లనూ ఉద్యోగాల్లోకి తీసుకోవాలని, అర్హతల్ని బట్టి వారిని అత్యున్నత పదవుల్లో నియమించాలని పేర్కొంది. ఇక ఉద్యోగుల భర్తీ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించింది.

పెరగని మహిళల ప్రాతినిధ్యం

మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీ పడుతున్నా రాజకీయాల్లో మాత్రం ఇంకా వెనుకంజలోనే ఉన్నారు. మహిళలను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని వేదికలపై ఉపన్యాసాలిచ్చే నాయకులు కూడ ఎన్నికల్లో వారికి తగిన అవకాశాలు ఇవ్వటం లేదు. గత ఏడాది జరిగిన అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 678 సీట్లకుగాను కేవలం 62 సీట్లలో మాత్రమే మహిళలు విజయం సాధించారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాల్లో మొత్తం 9.30 కోట్ల మంది మహిళలు ఉండగా, వారిలో కేవలం 9 శాతం మంది మాత్రమే మహిళలు చట్టసభలకు ఎన్నికయ్యారు. 2013–2014 సంవత్సరంలో ఈ రాష్ట్రాల్లో మహిళా ఎమ్మెల్యేల సంఖ్య 77 ఉందని, అంటే 11 శాతం ఉండేదని భారత ఎన్నికల కమిషన్, అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫారమ్స్ సంయుక్తంగా నిర్వహించిన సర్వే వెల్లడించింది.

ఈసారి ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో గతంలో కన్నా ఎక్కువ మందే పోటీ చేసినప్పటికీ తక్కువ మందే ఎన్నికయ్యారు. ఒక్క చత్తీస్‌గఢ్‌లో మాత్రమే గతంలో కన్నా ఈసారి ఎక్కువ మంది విజయం సాధించారు. మిజోరంలో పది లక్షలకుపైగా కలిగిన జనాభాలో 49 శాతం మంది మహిళలు ఉన్నప్పటికీ అసెంబ్లీలో వారి ప్రాతినిధ్యం శూన్యం. ప్రజాస్వామ్యంలో మహిళల ప్రాతినిధ్యం అంటే ఇంటి నుంచి బయటకు వచ్చి ఓటు వేయడం కాదని, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా, ఓ ఎంపీగా గెలవడమని అమెరికాలోని పెన్సిల్వేనియా యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రితికా కుమార్ వ్యాఖ్యానించారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో మహిళలు చురుగ్గా పాల్గొని ఎన్నికవడమే కాకుండా మళ్లీ పోటీచేసి కూడా విజయం సాధిస్తున్నారని ఆన్నారు.

గత మూడు ఎన్నికల నుంచి వరుసగా ఈ ఐదు రాష్ట్రాల్లో మహిళలు ఎక్కువ మందే పోటీ చేస్తున్నప్పటికీ వారు ఎక్కువగా గెలవలేక పోతున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి 2,716 మంది అభ్యర్థులకుగాను 235 మంది మహిళలు పోటీ చేశారు. 2013 ఎన్నికల్లో 108 మంది, 2008 ఎన్నికల్లో 226 మంది మహిళలు పోటీ చేశారు. ఫలితాల్లో మాత్రం వెనకబడుతున్నారు. 2008లో 25 మంది, 2013లో 30 మంది విజయం సాధించగా, ఈసారి 22 మంది మహిళలు మాత్రమే విజయం సాధించారు. ఇక రాజస్థాన్‌లో 2008లో 154 మంది, 2013లో 152 మంది పోటీ చేయగా ఈసారి ఏకంగా 182 మంది పోటీ చేశారు. 2013 ఎన్నికల్లో 25 మంది విజయం సాధించగా, ఈసారి 22 మంది మాత్రమే విజయం సాధించారు.

పోటీ చేస్తున్న వారి సంఖ్యలో గెలుస్తున్న వారి సంఖ్యను తీసుకుంటే మగవారి కన్నా మహిళలే ఎక్కువ విజయం సాధిస్తున్నారు. రాజస్థాన్‌లో మొత్తం పోటీ చేసిన వారి సంఖ్యలో మహిళల శాతం ఎనిమిది ఉండగా, విజయం సాధించిన వారి శాతం 11.5 శాతం ఉండడమే అందుకు ఉదాహరణ. నేషనల్ ఎలక్షన్ వాచ్ అధ్యయనం ప్రకారం జాతీయ పార్టీలైన కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలు ఈసారి 12 శాతం సీట్లను మహిళలకు ఇచ్చారు. అన్ని పార్టీలకన్నా అతి తక్కువగా తెలంగాణలోని టీఆర్‌ఎస్ పార్టీ 3 శాతం సీట్లనే మహిళలకు ఇచ్చింది. ఇక ఓ మహిళ అధ్యక్షులుగా ఉన్న బహుజన సమాజ్ పార్టీ 9 శాతం టిక్కెట్లను మహిళలకు ఇచ్చింది. వివిధ పార్టీల తరపున పోటీ చేసిన మహిళల్లో కాంగ్రెస్ పార్టీ నుంచే ఎక్కువ మంది విజయం సాధించారు. చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లు చర్చకు వస్తున్న సందర్భంగా ఇలాంటి వివరాలు అవసరమని రితికా కుమార్ అభిప్రాయపడ్డారు.

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో దాదాపు 6 వేలకు పైగా గ్రామ పంచాయతీలకు మహిళలు నేతృత్వం వహించనున్నారు. అయితే కేవలం పేపర్ల మీదనే కాకుండా నిజమైన అధికారాలు మహిళలు చేతుల్లో ఉండాల్సిన అవసరం ఉంది. విధాన నిర్ణయాలలో మహిళల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత సమాజంలో ఆ పరిస్థితులు కనబడడం లేదు. మహిళా రిజర్వేషన్లు పూర్తి స్థాయిలో ఉపయోగపడాలంటే మహిళలు తమ హక్కులపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలి. రాజకీయ హక్కులు పూర్తిస్థాయిలో మహిళలు ఉపయోగించుకున్నపుడు మాత్రమే మహిళా సాధికారికత సాధ్యపడుతుంది. మహిళలు తమ హక్కులను కాపాడుకుంటూ పూర్తిస్థాయిలో తమ విధులను నిర్వర్తించినప్పుడు మాత్రమే మహిళా రిజర్వేషన్లు వెల్లివిరుస్తాయి. ఆ దిశగా మహిళలు చైతన్యం పొందాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భవిష్యత్ కార్యాచరణకు అంతిమ రూపం ప్రణాళిక

చురుకుగా ఉంటూ ఫలితాలను సాధించు. ఆచరణే నిర్దిష్ట ఫలితాలను ఇస్తుంది. ఎదుగుదలకు కృషిచేయి. నీసొంత పనినీ, కర్తవ్యాలను, బాధ్యతలనూ, ముందుగా చేయవలసిన పనినీ నిర్లక్ష్యం చేయకు.

మంచి భవిష్యత్తుకు (ముందుచూపు) మనఃపూర్వక స్ఫూర్తి అవసరం. వర్తమానంలో కర్తవ్యనిష్ఠతో కూడిన ఆచరణ ఆ భవిష్యత్తుకు అత్యంత ఆవశ్యకం. ప్రస్తుతం శ్రమించు, భవిష్యత్తును నిర్మించుకో. కర్తవ్యదీక్షతో నీ పాత్రను పోషించు. సరియైన ఆచరణే ఉజ్జ్వల భవిష్యత్తును ఇస్తుంది. సరియైన ఆచరణ అంటే భాగస్వాములందరి క్షేమాన్ని కాంక్షిస్తూ, ఎవరినీ నొప్పించనిదే.

ఆచరణలు ఆలోచనల నుంచి ఉద్భవిస్తాయి. మధురమైన సదభిప్రాయాలు ఉపయుక్తకార్యానికి తగిన ఆచరణకు పురికొల్పుతాయి. యథార్థంలో ప్రవర్తించు. వాస్తవికతపై ఆధారపడేలా ఆచరించు. నీ విద్యార్థులకు, వ్యక్తులకు, సమాజానికి ఉపకరించే కార్యకలాపాలలో ఎల్లప్పుడూ అతిచురుకుగా వ్యవహరించు.

భవిష్యత్ కార్యాచరణకు అంతిమ రూపం ప్రణాళిక. సరియైన ప్రణాళికతో కార్యారంభానికి సిద్ధంగా ఉండు. వనరులను, నిన్ను, నీ సమూహాన్ని సరిగ్గా అమర్చుకొని, నియమించుకొని ఆ ప్రణాళికను అనుసరించి సాధించు. వ్యక్తులే మూలం. వారితో పాటుగా అభివృద్ధిపథంలో సాగిపో.

శ్రేష్ఠమైన కార్యాచరణకు చేయీ–చేయీ, అడుగూ–అడుగూ, భావం–భావం, మనసూ–మనసూ ఏకంచేయి. ఎల్లప్పుడూ తత్పూర్వ, తత్సమయ, తదంతస్సమయ, తత్పరకాలాలలో చురుకుగా ఉండు.

కార్యాచరణకు పూనుకోకముందే ఆ పనిని గురించి చక్కగా ఆలోచించి నిర్ణయించు. వనరులన్నీ సిద్ధమేనా గమనించు. కార్యసాధనలో ఒకవేళ మేళనలు, సవరణలు అవసరమేమో చూస్తూ, కార్యసమాప్తి తరువాత సమగ్రతలోనూ, శ్రేష్ఠతలోనూ లోపాలను పరిశీలిస్తూ తరువాత ఏమిటో గుర్తించు.

సమూహంగా కృషి చేయి. కలసి కృషి చేస్తే ఫలితాలు, సంబంధాలు రెట్టింపు అవుతాయి. టీమ్ అంటే ట్యూనింగ్ మేళనము. శక్తి, సర్దుబాటుతనం, కర్తవ్యం. వ్యష్టి, సమష్టి సమర్థతలు శక్తికీ, కలసి మెలసి పనిచేయటానికీ, వ్యక్తుల సర్దుబాటుతనం సమర్థతకే – కార్యసఫలతకే టీమ్.

చురుకుగా ఉండు కానీ అతిచురుకుతనం వద్దు. స్పందించు కానీ నిర్లక్ష్యంగా ప్రతిస్పందించకు. నిరాకరణలు, పునరావృతాలు లేకుండా నీ ఆచరణలను దక్షతతో, సమర్థతతో నిర్వర్తించు.



నీవు స్వీకరించిన పనిని పూర్తి చేయి. అసమర్థ ఆచరణల ఫలితాల కార్యం అసంపూర్ణకార్యం. అసలు కార్యమే కాదు. లక్ష్యసాధనకు పరిశ్రమతో, ఏకాగ్రతతో, నిర్దిష్టతతో కృషి చేయి. అడ్డంకులను తొలగించుకో. అవకాశాలను ఉపయోగించుకుంటూ లక్ష్యాన్ని సాధించు.

ఆచరణ కోసం నిర్ణయాలు కానీ వాయిదాలకు కాదు. సమగ్రమైన ప్రణాళిక ఎప్పుడూ సాధ్యం కాదు. అందువలన ద్వంద్వార్థతతో (సాధ్యాసాధ్యాల విచక్షణ) వ్యవహరించడం నేర్చుకో! కార్యసఫలతా మార్గంలో ముందుకు సాగిపో! పనే మార్గం, ఔషధం, పరిష్కారం, విలువ, అర్హత, ప్రతిష్ఠ.

ప్రియమైన అద్భుతమైన సుప్రియా! అనుకూలంగా ఉండు, చురుకుగా ఉండు, ఆనందంగా ఉండు, ప్రయోజనకరంగా ఉండు. చురుకుతనమే ఆనందాన్ని విస్తరింపచేస్తుంది. సోమరితనాన్ని, నిస్సహాయతను, మందకొండితనాన్ని తొలగిస్తుంది. నీ ఉన్నతమైన ఆచరణలు కేవలం నీకే కాదు, నీ చుట్టూ ఉన్నవారికి కూడా ఆనందం కలిగిస్తాయి. ఎందుకంటే ఉన్నతమైన ఆచరణలు అందరి యోగక్షేమాలను విస్తరింపచేయటానికి ఉపకరిస్తాయి. ఆచరించు, ఆనందించు.

ఆచరించు, నీ అంతర్నిహితభావాలను వాస్తవికంగా రూపొందించు.

చురుకుతనాన్ని సాధించే మార్గాలు

1. నీ రోజువారీ ఆచరణలను సూచికగా తయారు చేయి, పూర్తి చేసిన వాటిని గుర్తించు.
2. అనుకొన్నపనిని పూర్తిచేయి, రేపటికి వాయిదావేయకు, వాయిదా వేయటం ఆపివేయడమే.
3. ఇప్పుడే చేయి.
4. ఇప్పుడూ, ఎప్పుడూ, ఎప్పటికీ, సమగ్రతతో, శ్రేష్ఠతతో పనిచేయి. పొరపాట్లను పునరావృతం చేయకుండా ఫలితాల, ఆచరణల నిష్పత్తికి నిరంతరంగా శ్రమించు.
5. నీవు ఏ పనిని చేయాలనుకున్నా అది నీకు, ఇతరులకు ఆనందాన్ని కలిగిస్తుందా ఆలోచించు. అలాగే ఏ కోణంలో అయినా బాధను కలిగిస్తుందా గమనించు. అలాంటిస్థితి వస్తే ఆ పనిలోని బాధాకరమైన విషయాన్ని తొలగించి, ఆనందకరం చేయి. ఇదే ఆనందపు పరీక్ష.
6. ఆ ఆనందపు పరీక్షను నీకు, నీవారికి నిర్వహిస్తూ ఉండు.
7. ప్రతిరోజూ చివర నీ విద్యార్థులు ఆనందంగా ఇంటికి వెళ్ళారా, నీ తోటి వారు ఆనందంగా ఉన్నారా పరిశీలించు.
8. నీవు ఇప్పుడు ఆనందంగా ఉన్నావా? నిన్ను నీవు ఆనందంగా ఉంచటానికి ఏం చేస్తావు?



గట్టు నారాయణ

బ్రహ్మానందరెడ్డికి అనుకూలంగా తీర్మానం

(నిన్నటి పేజీ తరువాయి)

ఈ విజ్ఞప్తిని పురస్కరించుకొని కార్యవర్గంలో కొంత చర్చ అనంతరం మైకులు అమర్చిన వాహనాలు పాత ఎం.ఎల్.ఏ క్వార్టర్స్ 'ఏ' బ్లాక్ వద్దకు పంపమని ఈ రచయిత శ్రీ సుశీల్ కుమార్‌కు చెప్పాలనే నిర్ణయం జరిగింది. ఆ తర్వాత సమితి నాయకులు శ్రీ సర్వోత్తమ రెడ్డి, శ్రీ సత్యనారాయణ రెడ్డి, శ్రీ వెంకట్రామిరెడ్డి, శ్రీ జి. నారాయణరావు, శ్రీమతి టి.యన్. సదాలక్ష్మి, శ్రీమతి జె.ఈశ్వరీబాయి, శ్రీమతి లక్ష్మిరెడ్డి, శ్రీ జగన్ మోహన్‌రెడ్డి, శ్రీ బి.సి. జెయన్, శ్రీ వెంకటేశ్వరరావు యాదవ్, తెలంగాణా వాణిజ్య మండలి అధ్యక్షులు శ్రీ మోహన్‌లాల్ గుప్త మొదలైనవారు, కొందరు విద్యార్థులను కూడ సహాయం తీసుకొని అనేక బృందాలుగా విడిపోయి వీధులలోకి వెళ్ళి ప్రశాంతంగా తమతమ ఇండ్లకు వెళ్ళవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేసి వారిని అదుపు చేయటంలో పోలీసులకు సహాయం చేశారు. ముఖ్యమంత్రి రాజీనామాతో తమ ఉద్యమం కొంతమేర సఫలీకృతం అయినట్టు ఉద్యమకారులు భావించారు. ముఖ్యమంత్రి తన రాజీనామా లేఖను కాంగ్రెస్ అధిష్ఠాన వర్గానికి పంపిన మర్నాడే, ఇక పదవులు పోయి తమ బ్రతుకు కుక్కలకు కూడ ఉండవనుకున్న తెలంగాణా మంత్రులు తాము కూడ పదవులకు రాజీనామా ఇస్తున్నట్టు ప్రకటించారు. రాజీనామా తతంగం వెనుక ఏదో ఒక పెద్ద కుట్ర ఉన్నదని కొందరు ముందుగా అనుమానించినట్టే ముఖ్యమంత్రి కాంగ్రెస్ అధిష్ఠానవర్గంలోని అల్పులను ఆశ్రయించి తమ రాజీనామా లేఖకు అధ్యక్షుని ఆమోదం దొరకకుండా ఉండేట్టు చూడగలిగారు.

బ్రహ్మానందరెడ్డి వ్రాసిన లేఖపై పార్టీ అధ్యక్షుడు శ్రీ నిజలింగప్ప తక్షణ చర్య ఏమీ ప్రకటించలేదు. అయితే జూలై 6వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న శాసనసభా పార్టీ ఈ విషయం చర్చించి తగు నిర్ణయం గైకొనగలదని అఖిల భారత కాంగ్రెస్ సంఘం ప్రకటించింది. పరిస్థితిని సరిదిద్దేందుకు బ్రహ్మానందరెడ్డిని పదవి నుండి తొలగించడమే మార్గమని ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు దామోదరం సంజీవయ్య అభిప్రాయపడగా, తొలగించ కూడదని రాయలసీమ, ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు చెందిన ముగ్గురు నాయకులు పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, కాకాని వెంకటరత్నం, శ్రీ పి.వి. నరసింహారావు గట్టిగా పట్టు పట్టారు. అధిష్ఠానవర్గం నిర్ణయం మేరకు శాసనసభ్యుల అభిప్రాయాన్ని స్వయంగా తెలుసుకునేందుకు జులై 5వ తేదీన కాంగ్రెస్ అధ్యక్షులు నిజలింగప్ప, మాజీ అధ్యక్షులు కామరాజ్ నగరానికి వచ్చారు. జులై 6వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన శాసనసభాపార్టీ సమావేశంలో 43 మంది తెలంగాణ శాసనసభ్యులు, 14 మంది శాసనమండలి సభ్యులు పాల్గొన్నారు. బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుదలకు అనుకూలంగా చర్చ కొనసాగింది. ఈ వాదనను బలపరుస్తూ శ్రీ పి.వి. నరసింహారావు ఒక తీర్మానం ప్రతిపాదించగా, కృష్ణాజిల్లా శాసనసభ్యుడు శ్రీ అక్కినేని భాస్కరరావు దానిని బలపరిచారు. శ్రీ బ్రహ్మానందరెడ్డికి పెంపుడుకుక్కల వలె ప్రవర్తించిన ఈ ఇద్దరు పెద్దలు, శాసనసభ్యుల అభిప్రాయాలు తెలుసుకునే బదులు పదవిలో కొనసాగాలన్న బ్రహ్మానందరెడ్డి అభిప్రాయాన్ని వారి నెత్తిన రుద్ది ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడేవారికెవరికీ సమావేశంలో మాట్లాడే అవకాశం కల్పించకుండానే ఆయన నాయకత్వంపై అందరికి విశ్వాసం ఉన్నట్టు ఒక తీర్మానం తయారయేందుకు దోహదం చేసారు. అయితే, కామరాజ్, నిజలింగప్పల సమక్షంలో జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో తెలంగాణ ఉద్యమాన్ని తీవ్రంగా ఖండించి, ముఖ్యమంత్రిని కొందరు గట్టిగా సమర్థించారు. పదవులను ఆమోదించి, ఖైదీలుగా బ్రతకటానికి ముగ్గురు మాత్రం అంగీకరించలేదు. ముఖ్యమంత్రి రాజీనామా వార్త గురించి తెలుసుకొన్న తర్వాత క్షణాలలోనే, హైదరాబాదు జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ భోజిరెడ్డి, హయత్‌నగర్ పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ కె. ప్రభాకరరెడ్డి వంటి కొందరు నాయకులు తాము ప్రత్యేక రాష్ట్రవాదాన్ని బలపరుస్తున్నట్టు ప్రకటనలు చేశారు. హడావిడిగా ప్రజాసమితి నాయకులతో మంతనాలు జరిపేందుకు మధ్యవర్తుల ద్వారా ప్రయత్నించగా వీరి నిజాయితీని వారు, సమితి నాయకులు నమ్మజాలకపోయారు. అనుమానించినట్టే, తిరిగి బ్రహ్మానందరెడ్డి పదవిలో కొనసాగనున్నారనే సంగతి తేలిపోవడంతో, ఈ అవకాశవాదులంతా నాలుక కొరచుకొని మళ్ళీ వెళ్ళి 'మహాప్రభూ క్షమించు' అంటూ బ్రహ్మానందరెడ్డి కాళ్ళపై పడి తెలంగాణ రాష్ట్ర వాదాన్ని వ్యతిరేకించారు. చాలాకాలం 'తెలంగాణ మహాసభ' అధ్యక్షులుగా వ్యవహరించిన శ్రీ భోజిరెడ్డి, ఇప్పుడు (1969) ప్రత్యేక రాష్ట్రాన్ని కోరే వారిలోనే అవకాశవాదులు ఉన్నారని వాదిస్తారు.

తను ముఖ్యమంత్రిగా కొనసాగాలని శాసనసభ్యులు తీర్మానించిన అనంతరం, రాజీనామా ప్రతిపాదనను విరమించుకొన్న ముఖ్యమంత్రి జులై 7వ తేదీ నుండి బెంగుళూరులో జరుగవలసి ఉన్న కాంగ్రెస్ కార్యవర్గ సమావేశాలలో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్ళారు. ఆ సమావేశాలలో రాష్ట్రపతి అధ్యక్ష పదవికి పార్టీ అభ్యర్థి ఎన్నిక జరగవలసి ఉన్నది. (రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ మృతితో ఏర్పడిన ఖాళీకి ఆగస్టు 30వ తేదీన ఎన్నిక జరగవలసి ఉన్నది.) **(సశేషం)**

– ఆదిరాజు వెంకటేశ్వర రావు

రోడ్డు దాటాలంటేే చాలా కష్టం

కూకట్‌పల్లిలోని ముంబయి జాతీయ రహదారి దాటాలంటే పాదచారులు హడలిపోయే పరిస్థితి నెలకొంది. మెట్రో రైలు ప్రాజెక్టుతో రహదారి విశాలంగా ఉండటంతో వాహనాలు వేగంగా దూసుకు పోతున్నాయి. పధాన చౌరస్తాలు మూసివేయడంతో వాహనాల జోరుకు అవరోధాలు లేకుండా పోయంది . రోడ్డు దాటే క్రమంలో పాదచారులు వాహనాలు ఢీకొని గాయపడుతుండగా కొందరి నిండు ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. సమస్య పరిష్కారానికి అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుని చేతులెత్తేయడంతో నానాటికీ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. కూకట్‌పల్లి నియోజకవర్గంలో భరత్‌నగర్ వంతెన నుంచి ముంబయి జాతీయ రహదారి హైదర్‌నగర్ వరకు దాదాపు పది కిలోమీటర్ల ఈ మార్గంలో పాదచారులు రోడ్డు దాటడానికి కేపీహెచ్‌బీ కాలనీ వద్ద ఒకటే వంతెన అందుబాటులో ఉంది. మూసాపేట, కూకట్‌పల్లి, భాగ్యనగర్ కాలనీ, జేఎన్టీయూ చౌరస్తాల్లో మాత్రమే పాదచారులు రోడ్డు దాటేందుకు అనుగుణంగా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. మిగతా ప్రాంతాల్లో ఎక్కడైనా రోడ్డు దాటాలంటే ప్రాణాలపై ఆశ వదులుకోవాల్సిందే. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసిన ప్రాంతాలతో పాటు యూటర్నుల వద్ద ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వర్తించాలి. అయితే వారు చాలా చోట్ల ఉండటం లేదు. దీంతో సిగ్నల్స్ వెలిగినా కొందరు వాహనదారులు దూసుకుపోతున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ సిబ్బంది సమన్వయంతో తగిన చర్యలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చు. భరత్‌నగర్ నుంచి హైదర్‌నగర్ వరకు ఉన్న జాతీయ రహదారిలో రోడ్డు దాటేందుకు మరిన్ని పాదాచారుల వంతెనలు ఏర్పాటు చేయాలి.

నర్సింహారెడ్డి
కూకట్‌పల్లి, హైదరాబాద్

పిల్లలకు బాల్యాన్నే బహుమతిగా ఇద్దాం

నేటి బాలలే రేపటి పౌరులు. బాలలే భారత భాగ్య విధాతలు. ఇలాంటి నినాదాలు వింటున్నప్పుడు మధురాతిమధుర అనుభూతి ఏదో మనల్ని మైమరిపిస్తుంది. మనం మన పిల్లలను నిజంగా ప్రేమిస్తున్నామా? మనల్ని మనం ప్రశ్నించుకోగలమా? మన దేశంలో బాల్యం అనేక దృశ్యాలను ఆవిష్కరిస్తుంది. కొన్ని దృశ్యాలు మనసును పరవశింపచేస్తాయి. మరి కొన్ని దృశ్యాలు గుండెను బరువెక్కిస్తాయి. బాల్యం ఎవరికైనా మధుర జ్ఞాపకమే. కానీ , అందరి బాల్యం ఒక్కలా ఉండదు. ఒక చోట జననం ఓ ఉరకలెత్తే కడలి ప్రవాహం. మరోచోట అదే ఎండిపోయిన సాగర గర్భం. కొందరికీ పట్టు మంచాలు సేద తీరిస్తే ,మరి కొందరిని కళ్ల తెరచీ తెరవక ముందే మృత్యువు వెన్నాడుతోంది. మన దేశంలో ఏటా దాదాపు పన్నెండు లక్షల మంది శిశువులు నెల నిండకుండానే కన్ను మూస్తుండడం ప్రపంచంలో మరెక్కడా లేని విషాదం.

బాల్యం ఓ అద్భుత వరం: బాల్యం గుర్తుకొస్తే చాలు భారమైన వయసు తేలికవుతుంది. బాల్యం నాటి జ్ఞాపకాలను మరోమారు మనసులోనే ఆవిష్కరింపజేస్తుంది. జీవితంలో ఒక్కసారైనా బాల్యాన్ని తలుచుకోని మనిషి ఉండడు. ముద్దు ముద్దు మాటలతో, చిలిపి అల్లరి చేష్టలతో ఇంటిల్లిపాదినీ అలరించే బాలలంటే అందరికీ ప్రేమే. ప్రకృతితో సహా అందరి ప్రేమకు అర్హులైనవారు వీరు మాత్రమే. వారికోసం ప్రత్యేకంగా బాలల దినోత్సవం నిర్వహిస్తున్నారు. బాలలంటే బడికి వెళ్ళే పిల్లలే కానక్కరలేదు. సాటి పిల్లల్లా విద్య ద్వారా ఉత్తమ భవిష్యత్తును అందుకోవాలని ఆశించినా, ఆర్థిక స్థితిగతుల వల్ల, బడికి దూరమై బ్రతుకు భారాన్ని అతి పిన్నవయసులో మోయవలసిన పరిస్థితిలో... భవిష్యత్తంటే ఏ పూటకాపూట కడుపు నింపుకోవడమే అనే లక్ష్యానికి బలై బ్రతికే ప్రతీ బాలుడు,బాలిక. మరి వారి బాల్యాన్ని ఎందుకు కోల్పోతున్నారు? అని ఆలోచిస్తే అనేక కారణాలు లభిస్తాయి . ప్రధాన కారణం మాత్రం బాలల హక్కులను కాలరాస్తున్న మన పాలకుల నిర్లక్ష్యధోరణి. కారణం పరిశీలిస్తే వారికి ఓటు హక్కు లేక పోవడమే . దేశంలో బాల్యాన్ని బాల్యంలా అనుభవిస్తున్న పిల్లల సంఖ్య చాలా తక్కువ. తల్లిదండ్రుల పేదరికం పిల్లలను ఆనందానుభూతుల్లోకి కాకుండా నరకంలోకి నెడుతోంది. బాలకార్మికులు, ఆకలితో అల్లాడే పిల్లలు మన దేశంలోనే ఎక్కువ. కొన్ని కోట్ల మందికి అసలు బాల్యమే లేదు. ఎందుకంటే పుట్టిన 5 ఏళ్ల లోపే వారు మరణిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మరణిస్తున్న ఐదేళ్ళ వయస్సు లోపు పసి పిల్లల సంఖ్య భారత్‌లోనే అత్య



ధికంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఐదేళ్ళ వయస్సు లోపున్న పిల్లల మరణాలలో మూడో వంతు మన దేశంలోనే జరుగుతున్నాయి. 2017లో మరణించిన పిల్లల్లో 22 శాతం మంది భారత్‌లోనే ఉన్నారని ఐక్య రాజ్యసమితి నివేదిక వెల్లడించింది. భారత్‌లో పుట్టిన వెయ్యిమంది శిశువుల్లో 62 మంది ఏడాదిలోపే చనిపోతుంటే, మిగిలిన వారిలో కొంతమంది పోషకాహార లోపంతో మృతి చెందుతున్నారు. ఏటా 14.5 కోట్ల మంది పిల్లలు పుట్టిన రెండుమూడేళ్లకే తనువు చాలిస్తున్నారని ఐరాస తెలపడం మనదేశ పాలనలోని డొల్లతనాన్ని తెలియజేస్తుంది. శిశు మరణాలను నివారించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమౌతున్నాయి. వాగాడంబరం, ఆచరణశూన్యత శైశవానికి శాపాలుగా మారుతున్నాయి. చాలా గ్రామాల ఆసుపత్రులలో మౌళిక వసతులు సైతం లేకపోవడం,ఆసుపత్రులున్నా డాక్టర్లు లేకపోవడం,మందులు లేకపోవడం మరణాల రేటు పెరగడానికి ప్రధాన కారణమౌతోంది. ఏజెన్సీలో సరైన వసతులు లేకపోవడం వలన కలిగే చిన్నారుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలేనని పౌర సమాజం, ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నా పాలకులకు చీమకుట్టినట్లయినా లేకపోవడం భాధాకరం.

నేడు మనిషి తన బాల్యదశను క్రమ క్రమంగా కోల్పోతూ వస్తున్నాడు. నేడు బాల్యం చిదిమివేయబడుతోంది. లేనివాళ్లింటో ఆకలి, అనారోగ్యం, అవిద్యతోనూ, బాల కార్మికులుగాను చిదిమివేయబడుతున్న బాల్యం, ఉన్నవాళ్లింట్లో రెండు మూడేళ్లకే ప్రారంభమవుతున్న ప్రైవేటు, కాన్వెంటు చదువులు, కార్పొరేట్ స్కూళ్లలో సర్వనాశనం అయిపోతోంది. మనుష ధర్మం ఛిద్రమైన ఈ సమాజంలోకి రావాలంటేనే శిశువు అనుమానిస్తున్నాడు, వచ్చినా ఆ బిడ్డ పెదవి నవ్వడానికీ సంశయిస్తున్నది. ఈ లోకంలో జరిగే అకృత్యాలను చూసే ధైర్యం లేక ఆ శిశువు అంధత్వం కోసం తపస్సు చేస్తున్నది. అందుకే ఆరోగ్యవంతమైన శిశువులను స్వేచ్ఛగా ఎదగనిద్దాం. భారతదేశంలో కోట్లాది చిన్నారుల్లో చాలామంది పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎదుగుదల లోపిం చి ఉంటున్నారు. ఆర్థిక, సామాజిక స్థితిగతుల కారణంగా ఈ అభివృద్ధి లోపం ఏర్పడుతున్నమాట వాస్తవం. రేపటి జ్ఞానవంతమైన, శక్తిమంతమైన, ఆరోగ్యవంతమైన నవభారతాన్ని నిర్మించాలంటే... నేటి బాలల అవసరాలను తీర్చడం ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న అంశం. అందుకు సమయమాసన్నమైనది.

ఇక బాలికల సంగతి చెప్పనక్కరలేదు. ఇంట్లో, బడిలో, గుడిలో ఎక్కడ సరైన రక్షణ లేదు, స్వేచ్ఛగా ఎగరడం సంగతి అటుంచి , సరిగ్గా బతకలేని పరిస్థితి. తల్లిదండ్రులు , కుటుంబం బాగున్న వారి పరిస్థితి వేరు. వలస వెళ్ళేవారు,తల్లిదండ్రులు పట్టించుకోని వారు, తాగుబోతుల పిల్లలు, అనాథలు ఇలాంటి వారి పరిస్థితి గురించి తలుచుకుంటేనే బాధ వేస్తుంది. వసతి గృహాలు, హాస్టళ్ళు వాటి గురించి చెప్పనవసరం లేదు. ఇది కాకపోతే అడ్డంగా తిని ఆంబోతులా బలిసిన కుర్రకారు ప్రేమా.... గీమా అని మోసం చేయడం, కుదరకపోతే యాసిడ్లు పోయడం , అఘాయిత్యం చేయడం, ఘోరంగా చంపేసే వార్తలు నిత్యకృత్యం.

పిల్లలకు మనం ఇచ్చే బహుమతి :ఒకచోట బడి పిల్లలు రాజ కుమారుల్లా దర్శనమిస్తారు. మరోచోట యోగి వేమనల్లే ఎదురొస్తారు. ఒకరికి వంటినిండా మోయలేనన్ని బరువులు. షూ, టై, బ్యాడ్జి, రిబ్బన్, వీపు మీద బ్యాగ్ . వీటిలో ఏది లోపించినా అది నేరం. మరచిపోయినా, మాసిపోయినా వళ్లంతా వాతల శిక్ష. మరొకరిది సిగ్గుబిళ్లలు కూడా కప్పుకోలేని దైన్యం. సుర్రున కాలే రోడ్డుమీద నడవాలన్నా, ముళ్ల బాటలో పరుగెత్తాలన్నా కనీసం చెప్పులేసుకోలేని దౌర్భాగ్యం. అతుకుల బొంతలే వారికి యూనిఫాం. ఎందుకీ దుస్థితి ? ఎవరిదా పాపం? బంగారు చెంచాలో తినాలని అతడికి ఎవరు రాసారు ? చెత్త కుప్పల్లో మెతుకులు ఏరుకొని తినమని వీడికి ఎవరు చెప్పారు? అంతా తలరాత అని సర్దుకుందామా ? ఏమిటీ దౌర్భాగ్యం ? మరెందుకీ దైన్యం? ప్రతి పిల్లవాడికి అందమైన బాల్యాన్ని ఇవ్వలేమా?

పిల్లలకి బహుమతిగా ఏమివ్వబోతున్నారు? ఖరీదైన ఎలక్ట్రానిక్ ఆట వస్తువులూ, థీమ్ పార్కు, మాల్స్, పర్యటనలు..? పోనీ మొబైల్ ఫోన్ ఇస్తారా? భవిష్యత్తు గురించి బాగా ఆలోచించి.. ఆర్థిక బాండ్లూ, బీమా పథకాలను కానుకగా ఇవ్వాలనుకుంటున్నారా? వారి పేరు మీద లక్షలు కాదు కాదు కోట్లు కూడకట్టాలనుకుంటున్నారా.. వారి అడుగు తీసి వేయకుండా కష్టం కాంపౌండ్ వాల్ దాటకుండా కాపలా ఉంటున్నారా.... చేయండి మంచిదే! కానీ వీటన్నింటికంటే మించినది ఒకటుంది అదే నేటి పిల్లలకి వాళ్ల బాల్యాన్నే వారికి బహుమతిగా ఇవ్వండి. ! నిజానికిది బహుమతి కూడా కాదు. వాళ్ల నుంచి మనం బలవంతంగా దూరం చేసిన ఒక అద్భుతమైన వరం. దాన్ని ఖచ్చితంగా వారికి తిరిగి ఇవ్వండి..మనకున్న ఎన్నో కోరికల మధ్య వాళ్లని వర్తమానంలో పిల్లలుగా చూడటం మరిచిపోతున్నాం. మార్కుల కోసం కొందరు,ర్యాంకుల కోసం మరికొందరు మంచి భవిష్యత్తునిస్తున్నామనే భ్రమలో.. వాళ్ల బాల్యాన్ని తీసేసుకుంటున్నాం! వారి నించి బలవంతంగా లాక్కుంటున్న దాన్నెలా మనం తిరిగివ్వాలి? ఉన్నదాన్ని ఎలా కాపాడాలి? తరగని ఆనందం, నియంత్రణలేని ఉద్వేగం ... ఇవే బాల్యం లక్షణాలు.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత ఈ ఏడు దశాబ్దాల కాలంలో నిశ్చితమైన నిబద్ధతతో కూడిన భారతదేశ రాజ్యాంగ, చట్టనిబంధనల ద్వారా బాలల కొరకు అవకాశాలను, కార్యాచరణ విధానాలను, కార్యక్రమాలను రూపొందించాల్సిన అవసరముంది.. ఈ శతాబ్దపు చివరి దశకంలో ఆకస్మిక సాంకేతిక అభివృద్ధిలో భాగంగా ఆరోగ్యం, పోషణ, విద్య అంశాలతో బాటు ప్రాదేశిక విషయాలతో నూతన ఆకాంక్షలను కల్పించే అవకాశాలను పిల్లలకు కల్పించేవిధంగా ఎన్నో నిర్ణయాలు తీసుకున్నప్పటికీ పిల్లల హక్కులను సంరక్షించే ఫలాలు ఇప్పటికీ అందరికీ అందడంలేదు .చిన్నారులపై ఏ ఒత్తిడీతేకుండా ఈ మూడింటిని సరైన దారి మళ్లించగలిగితే చాలు. మంచి బాల్యాన్ని బహుమతిగా అందించినట్టే. అపుడే బాలల పరమార్థం నెరవేరినట్టు.

–కాళంరాజు వేణుగోపాల్
8106204412

తెలుగు రాష్ట్రాల్లో జీవన ప్రమాణాల్లో పురోగతి

తెలుగు రాష్ట్రాల్లో సామాజిక, విద్యా పరిస్థితులు మెరుగుపడినట్లు చిన్నారుల విద్యా ప్రమాణాలపై నిర్వహించిన అసర్ (వార్షిక విద్యాప్రమాణాల రిపోర్టు) నివేదిక వెల్లడించింది. వివిధ జీవన ప్రమాణాల కొలమానాల్లో గత నాలుగేళ్లలో కనిపించిన పురోగతి ఇందుకు అద్దం పట్టింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జిల్లాల్లో గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించిన సర్వేలో వెలుగు చూసిన ప్రజల జీవన స్థితిగతులకు సంబంధించిన గణాంకాలను అసర్ నివేదికలో వెల్లడించారు. పక్కా ఇళ్లు, మోటార్ సైకిళ్లు, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, తల్లిదండ్రుల విద్యాభ్యాసాల గురించి ఇందులో వివరించారు. గత నాలుగేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో చదువులేని తల్లులు, తండ్రుల సంఖ్య తగ్గిపోయింది. పది, ఆపైన చదివిన తల్లుల సంఖ్య రెట్టింపయింది. ఈ అంశంలో తండ్రులు వెనుకబడి ఉన్నారు. పదిపైన చదివిన తండ్రుల శాతంలో పెద్దగా వృద్ధి నమోదు కాలేదు.



FIRE SAFETY AND FIRE DRILL

(నిన్నటి తరువాయి)

Alarm is raised

Confine the fire by closing all doors and windows

Extinguish the fire if safe to do so, evacuate if is not safe to extinguish the fire

The Training shall be conducted during new hired orientation, departmental orientation and through in service education, annual refresher training and drills.

P.A.S.S. – is an acronym designed to assist staff in remembering on how to operate the fire extinguisher, is as follows:

Pull the pin of the fire extinguisher

Aim the nozzle just above the base of the flames

Squeeze the handle or trigger on the fire extinguisher

Sweep the nozzle from side to side

PLAN ACTIVATION

IN THE DEPARTMENT: ANYONE DISCOVERING FIRE OR SMOKE SHOULD CALL A "CODE BROWN" WHICH BRINGS INTO ACTIVATION OF **R.A.C.E.** PROCEDURE IMMEDIATELY.

* **NOTE:** IF THERE IS A FIRE ALARM, YOU MUST EXPECT THAT UNTRAINED PEOPLE MAY PANIC DUE TO FEAR, CONFUSION AND DISORIENTATION. HOW MUCH PANIC WILL DEPEND LARGELY ON YOUR ACTION AND RESPONSE AS TRAINED STAFF.

One trained person, who may be you, should take a leadership role in response to a fire alarm.

Confidence and training should reassure untrained people that the situation can be managed.

Reduce panic in others by showing that you are in command and have been trained in what to do to manage the situation, while you take control.

RESCUE PATIENTS, VISITOR OR STAFF TRAPPED/AFFECTED BY THE FIRE/SMOKE, IF SAFE TO DO SO. LIFETHREATENING DANGER IS ALWAYS YOUR TOP PRIORITY. IF YOU SMELL SMOKE COMING FROM BEHIND A CLOSED DOOR, FOLLOW THIS PROCEDURE:

Feel the door with back of your hand, before opening

if it is too hot to touch, do not open it

if it is touchable, open it slowly

If you must enter the room, stay low.

ACTIVATE THE ALARM IMMEDIATELY:

Verbal code brown

Pull the manual fire alarm

Dial and give information to the operator:

– your name

– location of fire (building, level, unit, room)

– type of fire (if known)

– fire condition (extinguished, still burning, etc.)

EVACUATE THE AREA:

Follow your unit specific internal emergency plan, quickly and calmly Inspect each room, toilets and all other areas to ensure that all patients, visitors and personnel have evacuated.

Close the door.

Place the room checked tag on the handle outside A team consisting of safety officer, physicians, nursing supervisor, charge nurse, security, maintenance and other staff in the scene of disaster will ensure continuity of care during the whole situation.

They will ensure orderly evacuation of the patients from the scene of disaster.

The team leader at the scene of disaster keeps track of patients using the patient tracking form.

The medical record and kardex should be compulsorily sent along with each evacuated patient.

PRIORITY ORDER OF EVACUATION (PATIENTS WILL BE EVACUATED IN THE FOLLOWING ORDER)

Adults:

Ambulatory patients will be first let to safety.

Wheelchair patients will be taken next to safety.

Nonambulatory patients will be moved next using one of the emergency patient evacuation techniques/methods.

Critical care unit patients and other critical patients will be evacuated last but will generally at the discretion of the senior medical staff present, nursing supervisor or charge nurse for that area and be transported to other facility as soon as ambulance transportation is available.

Pediatrics:

Wrap each child in blanket and make certain the identification band is in place.

Nursery:

Where practical, give babies to mothers and evacuate them along with the mothers.

Nursing staff will evacuate all babies requiring special care.

Ensure each infant has its identification band, and is wrapped in a blanket.

Assign two employees to check each nursery to confirm removal of every infant.

Several Babies can be placed on a blanket and dragged to safety or two can be carried at a time.

EVACUATION ROUTE :

REFER TO THE DEPARTMENTAL EVACUATION MAP (FOR POSSIBLE EVACUATION ROUTES FROM THE AREA AND THE SECONDARY ASSEMBLY POINT.

ASSEMBLY:

A place of assembly should be pre determined and be situated away from the fire area.

Consideration should be given to the effects of smoke, embers, broken glass, traffic and any other factors that could affect the safety of people having evacuated from the building.

Further consideration should be given to the continuation of vital medical health services being provided to occupants and that some occupants could only be dressed in bed attire The comfort of health care patients in cold or wet environment needs to be a factor when selecting safe assembly places.

ROLL CALL:

Immediately the residents and staff have mustered at the place of assembly, a roll call should be taken, if possible from the registers, and each responsible person should report immediately to the chief warden that all people are accounted for or a search may be required.

It any one is missing, immediate search should be undertaken by the emergency team and advice of the progress of the search given to the arriving fire service officer.

Every place that residents or staff may have access to should not be over looked during the search.

The safety of those people involved in a search must be considered and effective control and communication of searching personnel is paramount.

DISASTER RECOVERY PERIOD:



నర్సింగ్ పోటీ పరీక్షల కోసం

The internal disaster will be considered to be in the recovery period when the following occurs:

when the fire commander or the civil defense team leader informs disaster command center that the situation is under control.

When all evacuated casualties are either readmitted, discharged or transferred to other facility. This fact should be confirmed by the various team leaders to the disaster command center.

When all evacuated casualties are either readmitted, discharged or transferred to other facility. This fact should be confirmed by the various team leaders to the disaster command center.

Internal disaster plan will be deactivated by disaster command center.

The team leader of disaster command center will instruct the operator to announce code brown all clear, three (3) times.

Onduty staff will return back to their respective units after instructed to do so by the team leader and continue their routine work.

offduty staff who responded to the call will report back to personnel pool to be correctly accounted for and logon in the sheet before going home An evaluation and review meeting shall be called the next day by the safety committee for further improvement(s) and correction(s) as necessary

RESPONSIBILITIES

Nursing supervisor shall:

Respond immediately to all disaster situations in hospital facilities.

Have authority in an internal disaster until relieved by a responding team leader and higher authority (e.g. Disaster command center, civil defense authority or fire brigade Oversee fire drills in nursing areas, as required in the unit specific fire drill schedule, and submit a critique for drills to the safety officer.

Nursing supervisor shall:

Receive notification from the head nurse or departmental safety representative that a hospital wide full fire drill will be carried out, and shall respond by dispatching personnel to perform the following tasks: Assist with evacuation of patients, visitors and personnel, if necessary. Prevent patients, visitors and personnel from reentering evacuated areas of the unit.

Assist in directing fire brigade to the site of the fire Head nurse/charge nurse shall:

Ensure the unit specific internal disaster emergency plan is established.

Notify the following: medical director, nursing director, nursing supervisor, safety officer, security head and telecommunication operator, that a hospital wide full fire drill will be carried out.

Plan and arrange drills at unit and department level, on scheduled basis.

Review and maintain records of fire drill critique reports and make recommendations for corrective action as appropriate to the supervisor of the area in which the drill was conducted Ensure all new hires receive orientation on the internal disaster plan, and are made familiar with their roles and responsibilities within their specific department/unit in any given emergency.

CONCLUSION:


Finally, it may be concluded that effective evacuation of patients and emergency plan of action in case of fire in a multistorey hospital will largely depend on the effective training of all personnel in the emergency plan of action, periodical conducting of fire drills, and review after fire drill and alteration of emergency procedures if required...



– MRS. RAJESWARI
అసోసియేట్ ప్రొఫెసర్,
అపోలో కాలేజ్ ఆఫ్ నర్సింగ్, హైదరాబాద్

దేశంలో తుఫాన్లు – విపత్తు నిర్వహణ

గ్లోబల్ వార్మింగ్‌తో వాతావరణంలో పెను మార్పు సంభవించింది. సాధారణ తుఫాన్‌ల స్థానంలో ప్రళయం వస్తోంది. వీటిని అడ్డుకోలేక పోయినా నివారణకు మార్గాలపై యావత్ ప్రపంచం దృష్టి పెట్టింది. భారీ జన, ధన నష్టం జరగకుండా చూస్తోంది. ఈ క్రమంలో ప్రత్యేక యంత్రాంగం ఉన్న ప్రపంచ నగరాల సరసన ఢిల్లీ, ముంబైతో పాటు హైదరాబాద్ మహానగరం చేరింది.



భారతదేశ తీరరేఖ ప్రాంతం ప్రపంచంలోనే ఎక్కువగా తుఫాన్లు తాకిడి కలిగిన ప్రాంతంగా గుర్తింపు పొందింది. ప్రపంచంలో ఏటా సంభవించే తుఫాన్లలో 8 శాతం భారతదేశంలోనే సంభవిస్తుంటాయి. ఎక్కువగా అక్టోబర్ నుంచి డిసెంబర్ మాసాల మధ్య తుఫాన్లు వస్తుంటాయి. అయితే, 2013లో వరుసగా నాలుగు తీవ్ర తుఫాన్లు వెనువెంటనే సంభవించడం సాధారణ ప్రజలకే కాక పర్యావరణవేత్తలకు, ప్రభుత్వాలకు ఆందోళన కలిగిస్తోంది. 2013 మే నుంచి డిసెంబర్ మధ్య ఇప్పటి వరకు తూర్పు తీరంలో తొమ్మిది తుఫాన్లు సంభవించాయి. అవి: మహాసేన్ (2013, మే), ఫైలిన్ (2013, అక్టోబర్), హెలెన్ (2013, నవంబర్), లెహర్ (2013, నవంబర్), మాది (2013, డిసెంబర్), హుదుద్ (2014, నవంబరు), వర్ధా (2016, నవంబరు), ఒక్కి (2017, నవంబరు), తితిలీ(2018, నవంబరు). ఇందులో మహాసేన్, ఒక్కి, తితిలీ, వర్ధ మాత్రమే సాధారణ తుఫాన్లు కాగా, మిగతావన్నీ పెనుతుఫాన్లు.

2013 అక్టోబర్ 12న ఒడిశాలోని గోపాల్‌పూర్ వద్ద తీరాన్ని తాకిన ఫైలిన్ తుఫాను ఇంతకు ముందెన్నడూ లేని రీతిలో భారీ విధ్వంసాన్ని సృష్టించింది. ఫైలిన్ ఒక్క ఒడిశా రాష్ట్రంలోనే 18 జిల్లాల్లోని 1.33 కోట్ల మందిపై ప్రభావం చూపింది. ఫైలిన్ తుఫాను, దానివల్ల వచ్చిన వరదల కారణంగా ఒడిశాలో 2.1 లక్షల ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రూ.4,200 కోట్ల నష్టం వాటిల్లింది. గడిచిన 23 సంవత్సరాల్లో ఎన్నడూ లేని విధంగా ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 5,50,000 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ రెండు రాష్ట్రాలతో పాటు అండమాన్‌నికోబార్ దీవులు, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్, బీహార్, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలను కూడా ఫైలిన్ వణికించింది. ఫైలిన్ తాకిడికి నేపాల్‌లోని కోసి, గండకి నదులకు వరదలు వచ్చాయి. అక్కడ ఏటా జరుపుకునే దశేన్ పండుగ ఈ తుఫాను కారణంగా పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. భారత వాతావరణ శాఖ ఫైలిన్‌ను అత్యంత తీవ్రమైన చక్రవాత తుఫాను అలజడి (Very Severe 3 Storm)గా వర్గీకరించింది. తుఫాను తీరం దాటే సమయంలో గంటకు 260 కిలోమీటర్లకు పైగా వేగంతో గాలులు వీచాయి.

ఫైలిన్, దాని అనంతరం వచ్చిన హెలెన్, లెహర్ తదితర తుఫాన్లతో ఆంధ్రప్రదేశ్ కోస్తా ప్రాంతంలోని రైతులు 12 లక్షల ఎకరాల్లో పంటను పూర్తిగా కోల్పోయారు. ఇది మొత్తం ఖరీఫ్ విస్తీర్ణంలో 7వ వంతు ఉంటుంది. ఇవన్నీ అధికారిక గణాంకాలు మాత్రమే. అనధికారిక అంచనాల ప్రకారం ఈ నష్టం ఇంకా ఎక్కువగా ఉండొచ్చు. వరుసగా వస్తున్న తుఫాన్ల వల్ల విపరీతమైన పంట, ఆస్తి, పశు నష్టంతో పాటు ప్రాణ నష్టం కూడా గణనీయంగా ఉంటోంది. అయితే గతంతో పోల్చుకుంటే ఇప్పుడు ప్రభుత్వాలు చేపడుతున్న విపత్తు నిర్వహణ కార్యక్రమాల వల్ల ప్రాణ నష్టాన్ని బాగా తగ్గించగలిగినప్పటికీ, పంట నష్టాలను, పర్యావరణ విధ్వంసాన్ని, విపత్తుల వల్ల వచ్చే ఇతర నష్టాలను కుదించడం సాధ్యం కావడం లేదు.

భారతదేశంలో తుఫాన్లు

ప్రపంచంలో అత్యంత విపత్తు ముప్పు కలిగి ఉన్న మొదటి 10 దేశాల్లో భారతదేశం కూడా ఒకటి. ఇందుకు అనేక ప్రకృతి పరమైన, మానవప్రేరేపిత కారకాలు దోహదం చేస్తున్నాయి. ప్రతికూల భౌగోళిక, శీతోష్ణస్థితి పరిస్థితులు, స్థలాకృతి స్వభావాలు, పర్యావరణ క్షీణత, జనాభా వృద్ధి, పట్టణీకరణ పెరుగుదల, పారిశ్రామికీకరణ మొదలైన వాటిల్లో అశాస్త్రీయ పద్ధతుల అవలంబన వంటి కారణాల వల్ల దేశంలో విపత్తుల తీవ్రత పెరుగుతోంది. ఈ కారకాలు నేరుగా గానీ, విపత్తు తీవ్రతను, ఆవృత్తిని పెంచడం ద్వారా గానీ పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టానికి దారి తీస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థను, ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి.

భారతదేశం తుఫాన్లు, వరదలు, భూకంపాలు, కరువులు వంటి ప్రకృతి విపత్తులకు దారితీయడానికి దాని విశిష్టమైన భౌగోళిక, భౌమ పరిస్థితులు చాలా వరకు దోహదపడుతున్నాయి. విపత్తులకు గురయ్యే స్వభావాన్ని బట్టి, భారత దేశాన్ని ఐదు ప్రాంతాలుగా విభజించవచ్చు. అవి... (1) హిమాలయ ప్రాంతం (2) ఒండ్రు మైదానాలు (3) ద్వీపకల్పంలోని కొండల భాగం (4) తీరప్రాంత మండలం (5) ఎడారి ప్రాంతం

హిమాలయ ప్రాంతం భూకంపాలు, భూపాతాల వంటి విపత్తుల ముప్పు కలిగి ఉంటే, మైదాన ప్రాంతాలు దాదాపు ప్రతి సంవత్సరం వరదలకు గురవుతున్నాయి. దేశంలోని ఎడారి ప్రాంతంతో పాటు ఇతర ప్రాంతాలు కరువుకాటకాలకు లోనవుతుండగా, తీర ప్రాంతాలు తుఫాన్లు, గాలివానలను ఎదుర్కొంటున్నాయి.

తక్కువ లోతు కలిగిన మహాసముద్ర సంస్తరం (Ocean Bed), తీర ప్రాంతపు తీరు కారణంగా భారత ఉపఖండం ప్రపంచంలోనే అత్యంత తీవ్ర తుఫాను ప్రభావిత ప్రాంతంగా మారింది. భారతదేశంలో తుఫాన్లు చాలావరకు మిత స్వభావం కలిగి ఉంటాయి. బలమైన గాలులు వీయడం, అసాధారణ వర్షం, తుఫాను కల్లోలం సృష్టించడం వీటి లక్షణాలు. కొన్ని సందర్భాల్లో భారీ కుండపోత వర్షం కురవడం వల్ల సముద్ర మట్టాలు పెరిగి, లోతట్టు ప్రాంతాలకు వరద ముప్పు ఏర్పడుతుంది. ఒక తుఫాను ఏర్పడటం, బలహీనపడి క్షీణించడం వరకు మధ్య ఉండే వ్యవధి సాధారణంగా 24 గంటల నుంచి ఆరు రోజులు. అయితే అసాధారణ పరిస్థితుల్లో ఈ వ్యవధి ఇంకా ఎక్కువగా ఉండొచ్చు.

చరిత్రలో ఇప్పటివరకు అత్యంత సుదీర్ఘమైన వ్యవధి కలిగిన తుఫానుగా టైఫూన్ జాన్ నమోదైంది. ఈశాన్య, వాయువ్య పసిఫిక్ పరివాహక ప్రాంతంలో 1994 ఆగస్ట్, సెప్టెంబర్లలో ఏర్పడిన ఈ తుఫాను 31 రోజుల పాటు కొనసాగింది. సాధారణ చక్రవాత తుఫాన్లు గంటకు 65 నుంచి 117 కిలోమీటర్ల వేగంతో తీరాన్ని తాకితే, బలమైన తుఫాన్లు గంటకు 119 నుంచి 164 కిలోమీటర్ల వేగంతో వస్తాయి. పెనుతుఫాన్లు అంతకంటే తీవ్రమైన వేగంతో దుసుకొస్తాయి. 1999 అక్టోబర్ 29న వచ్చిన సూపర్ సైక్లోన్ గంటకు 250 కిలోమీటర్ల వేగంతో ఒడిషా తీరాన్ని తాకింది. దీన్నే ఇప్పటి వరకు భారతదేశంలో సంభవించిన అత్యంత తీవ్రమైన తుఫానుగా భావిస్తున్నారు.

మొత్తం భారతదేశ వైశాల్యంలో 8శాతం ప్రాంతానికి తుఫాన్లు ముప్పు పొంచి ఉంది. తీరరేఖ వెంబడి ఉండే గుజరాత్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, ఒడిశా, పశ్చిమబెంగాల్, అండమాన్ నికోబార్ దీవులు, లక్షదీవుల్లోని 71% భూభాగంపై తుఫాన్ల ప్రభావం ఉంటోంది. అరేబియా సముద్రంతో పోల్చుకుంటే బంగాళాఖాతంలో తుఫాన్లు ఎక్కువగా వస్తుంటాయి. ఈ రెండు సముద్రాల్లో తుఫాన్లు సంభవించే తీరు 4:1 నిష్పత్తిలో ఉంటుందని అంచనా వేశారు. లోతు తక్కువగా ఉండే బంగాళాఖాత ఉత్తర తీరంలో తుఫాను కల్లోలం అధికంగా ఉంటుంది. అందువల్ల పశ్చిమ తీరంతో పోల్చుకుంటే భారతదేశంలో తూర్పు తీరరేఖే తుఫాన్లకు అత్యంత అనువుగా ఉంటోంది. భారతదేశంలో సంభవించే మొత్తం తుఫాన్లలో 80 శాతం తూర్పు తీరరేఖను తాకుతుంటాయి. ప్రపంచంలోని ఇతర సముద్రాల్లో ఉద్భవించే తుఫాన్లతో పోల్చుకుంటే బంగాళాఖాతం, అరేబియా సముద్రాల్లో ఉద్భవించే ఉష్ణమండల తుఫాన్ల ఆవృత్తి (Frequency) చాలా ఎక్కువగా ఉంటుంది.

(ఇంకా వుంది)

టెక్నికల్ అసోసియేట్ పోస్టులు

బెంగళూరులోని సౌత్ వెస్టన్ (నైరుతి) రైల్వే ఒప్పంద ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు ఖాళీలు: సీనియర్ టెక్నికల్ అసోసియేట్ 33, జూనియర్ టెక్నికల్ అసోసియేట్ 48.

మొత్తం ఖాళీలు: 81.

అర్హత: పోస్టును అనుసరించి డిప్లొమా, ఇంజినీరింగ్ డిగ్రీ, బీఎస్సీ, ఎంఎస్సీ, గేట్ ఉత్తీర్ణత.

వయస్సు: ఎస్టీఏ పోస్టులకు 20–33 ఏళ్లు; జేటీఏకు 18–33 ఏళ్ల మధ్య ఉండాలి.

ప్రభుత్వ ఉద్యోగాలు

ఎంపిక: ఎస్టీఏ పోస్టులకు గేట్ స్కోరు, జేటీఏకు విద్యార్హత మార్కుల ఆధారంగా. ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 01.02.2019. వెబ్‌సైట్: www.rrchubli.in

ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రీసెర్చ్‌లో ప్రాజెక్టు పోస్టులు

గాంధీనగర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రీసెర్చ్‌లో తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు.

పోస్టు ఖాళీలు: ప్రాజెక్ట్ సైంటిఫిక్ అసిస్టెంట్– 29, ప్రాజెక్ట్ ట్రేడ్స్‌మెన్– 02, ప్రాజెక్ట్ సైంటిఫిక్ ఆఫీసర్– 07, ప్రాజెక్ట్ టెక్నీషియన్– 06.

మొత్తం ఖాళీలు: 44.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఈ/ బీటెక్, ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: 30 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 31.01.2019.

వెబ్‌సైట్: www.ipr.res.in

నోటీస్ బోర్డు

అసిస్టెంట్ ప్రొఫెసర్లు

శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలు, పాలిటెక్నిక్లలో ఒప్పంద ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ.

వాక్ ఇన్స్

ఖాళీలు గల కళాశాలలు: కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్(ప్రొద్దుటూరు), ఏహెచ్ పాలిటెక్నిక్(బనవాసి/ మడకశిర), లైవ్‌స్టాక్ రిసెర్చ్ స్టేషన్(సిద్దరామాపురం/ మహానంది).

అర్హత: సంబంధిత విభాగంలో బీవీఎస్సీ, ఎంవీఎస్సీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత. ఇంటర్వ్యూ తేదీ: 25.01.2019.

వేదిక: ఎక్స్‌టెన్షన్ హాల్, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, ప్రొద్దుటూరు. వెబ్‌సైట్: www.svvu.edu.in

ఫ్యాక్ట్‌లో అప్రెంటిస్ శిక్షణ

ఉద్యోగ మండల్(కేరళ)లోని ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్(ఫ్యాక్ట్)లో కింది ఖాళీల భర్తీకి దరఖాస్తులు.

అప్రెంటిస్ ఖాళీలు: టెక్నీషియన్ (డిప్లొమా) 57, ట్రేడ్ 98. మొత్తం: 155. విభాగాలు: కెమికల్, కంప్యూటర్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజినీరింగ్, ఫిట్టర్, మెషినిస్ట్, ప్లంబర్, కార్పెంటర్, పెయింటర్ తదితరాలు.

అప్రెంటిషిప్

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, ఐటీఐ/ట్రేడ్ సర్టిఫికేట్ ఉత్తీర్ణత. వయసు: 23 ఏళ్లకు మించకూడదు

ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 23.01.2019.

వెబ్‌సైట్: http://fact.co.in/

బిట్ శాట్- 2019

బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్ పిలానీ) పరిధిలోని పిలానీ, గోవా, హైదరాబాద్ ప్రాంగణాల్లో ఇంటిగ్రేటెడ్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే బిట్‌శాట్–2019 ప్రకటన విడుదలైంది.

ప్రవేశాలు

కోర్సులు: బీఈ, బీఫార్మసీ, ఎంఎస్సీ

విభాగాలు: బీఈ కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్, మ్యానుఫ్యాక్చరింగ్, ఎంఎస్సీ బయోలాజికల్ సైన్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, మ్యాథ్స్, ఫిజిక్స్, జనరల్ స్టడీస్. **అర్హత:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ లేదా బయాలజీ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత.

ఎంపిక: ప్రవేశ పరీక్ష ఆధారంగా. ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 20.03.2019. ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష తేదీలు: మే 16 నుంచి 26 వరకు. వెబ్‌సైట్: www.bitspilani.ac.in

కాకతీయ యూనివర్సిటీలో బీఎడ్ కోర్సు

వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయ దూరవిద్యా విభాగం 2018–19కి గాను బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్– దూర విద్యా విధానం (బీఎడ్–డీఎం) ప్రోగ్రాంలో చేరేందుకు ఇన్ సర్వీస్ టీచర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

అర్హత: జనవరి 31, 2019 నాటికి రెండేళ్ల రెగ్యులర్ సర్వీస్ ఉండాలి. బీఏ/బీకాం/ బీఎస్సీ ఉత్తీర్ణత సాధించి, రాష్ట్రంలోని ప్రభుత్వ/ఎయిడెడ్/ఎంపీపీ/ జడ్పీపీ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పనిచేస్తూ ఉండాలి. ఎంపిక: ప్రవేశ పరీక్ష ద్వారా

ప్రవేశ పరీక్ష తేదీ: ఫిబ్రవరి 18, 2019

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్. ఫీజు: రూ.800.

దరఖాస్తుకు చివరితేదీ: జనవరి 25, 2019.

ఆలస్య రుసుం రూ.200తో దరఖాస్తు తేదీలు: జనవరి 26, 2019 నుంచి ఫిబ్రవరి 2, 2019 వరకు.

పూర్తి వివరాలకు వెబ్‌సైట్: http://sdlceku.co.in

బీ.ఆర్క్ కోర్సును ప్రారంభించిన ఇక్ఫాయ్

ఇక్ఫాయ్ (ఇన్సిట్యూట్ ఆఫ్ చార్టెడ్ ఫైనాన్సియల్ అనలిస్ట్స్ ఆఫ్ ఇండియా) ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్, ఐసీఎఫ్ఐ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (ISARCH), హైదరాబాద్ తాజాగా మరో కొత్త కోర్సును ప్రవేశపెట్టింది. ఆర్కిటెక్చర్ రంగంలో 5 సంవత్సరాల క్యాంపస్ ఆధారిత బీ.ఆర్క్ కోర్సును ప్రారంభించింది. ఇటీవల నగరంలోని ఓ స్టార్ హోటల్‌లో జరిగిన ఈ కోర్సు ప్రారంభోత్సవంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎనర్జీ, స్పెషల్ సెక్రటరీ అజయ్ మిశ్రా, టీసీఈఈ వైస్ చైర్మన్ డాక్టర్ వెంకట రమణ, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.కవిత రావు ధరణి, సీహెచ్ విఠల్, ఆర్.యశ్వంత్ రామమూర్తి, ఆర్. అశోక్ కటకం, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జె.మహేందర్ రెడ్డి.అతిథులుగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా నగరానికి చెందిన 150 మంది వర్ధమాన ఆర్కిటెక్ట్‌లతో ఓ వర్క్‌షాప్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఇంజనీర్లు, ఆర్కిటెక్టులు, బిల్డింగ్ ఇండస్ట్రీ ఉత్పత్తుల కెప్టెన్లు పాల్గొన్నారు. ఇక్ఫాయ్ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ బీ.ఆర్క్ అభ్యసిస్తున్న విద్యార్థులు హైదరాబాద్‌లో భారతదేశంలోని వివిధ సంస్థల వద్ద చివరి సంవత్సరం ప్రత్యేకమైన ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ యొక్క ఒక పూర్తి సెమిస్టర్‌లో పాల్గొనవలసి ఉంటుంది.

కావలసిన అర్హతలు: 10 + 2 పరీక్షలో 50% మొత్తం లేదా గణితశాస్త్రం, ఫిజిక్స్, కెమిస్ట్రీలతో తత్సమాన కోర్సుల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీఓఏ)చే నిర్వహించే నాటా పరీక్షలో అర్హత పొందినవారు సైతం అర్హులే.



డిగ్రీ ప్రదానం: B.Arch ను విజయవంతంగా పూర్తిచేసిన వారికి ఉన్నత విద్య కోసం ICFAI ఫౌండేషన్ నుంచి విద్యార్థులకు బ్యాచులర్ డిగ్రీని ప్రదానం చేస్తారు.

వసతి, రవాణా: గదికి ఇద్దరు చొప్పున లిమిటెడ్ హాస్టల్ సౌకర్యం, డేస్కాలర్లకు బస్సు సౌకర్యం ఉంది.

ఇక్ఫాయ్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్: UGC చట్టం, 1956లోని సెక్షన్–3 ప్రకారం విశ్వవిద్యాలయంగా ఏర్పడింది. 91 ఎకరాల పచ్చటి వాతావరణంలో నిర్మితమైంది.

ప్రధానంగా నాలుగు భాగాలు: ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్ (IBS), ICFAI టెక్ స్కూల్, ICFAI లా స్కూల్, ICFAI స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్. IFHE MBA, BBA, B.Tech, BBALLB (హాన్స్) / BALLB (హాన్స్), బి.ఆర్క్ క్యాంపస్ ఆధారిత కోర్సులు అందిస్తుంది. ఇటీవలే NAAC విశ్వవిద్యాలయానికి 'A' గ్రేడ్ ఇచ్చింది. విద్యార్థులు కౌన్సెలింగ్, మార్గదర్శకత్వం, ప్రాస్పెక్టస్ కోసం +919490491813 ను సంప్రదించవచ్చు. మరిన్ని వివరాలకు www.ifheindia.org/isa లేదా email కు barchinfo@ifheindia.org కు లాగిన్ కావాలని ఇక్ఫాయ్ వర్గాలు తెలిపాయి.

ఎలాంటి ఇయర్ రింగ్స్ ఎంచుకోవాలి?




మన ముఖం ఏ షేపులో ఉందో దాన్ని బట్టి ఇయర్ రింగ్స్ ఎంచుకోవాలి. అప్పుడే లుక్ అదురుతుంది.

గుండ్రంగా ఉండే ముఖానికి పొడవుగా ఉండేవి కానీ, మీడియం సైజువి కానీ తీసుకోవాలి. ఓవల్ షేప్ లో కానీ, చతుర స్రాకారంలో కానీ ఉండేవి పెట్టుకుంటే తిరుగుండదు. అలాగే స్క్వేర్ షేప్ ఉండే ముఖానికి కాస్త పొందికగా, సింపుల్ గా ఉండేవి పెట్టుకోవాలి.

నుదురు కొంచెం పెద్దగా, గడ్డం దగ్గరకు వచ్చేసరికి సన్నగా, చెప్పాలంటే ఓ రకంగా హార్ట్ షేపులో ఉండే ముఖాకృతి వారికి వీళ్ల చెంపలు పల్చగా ఉంటాయి కాబట్టి కాస్త వెడల్పుగా ఉండి, చెంపల వరకూ ఉన్న హ్యాంగిగ్స్ వేసుకుంటే సూపర్ గా ఉంటుంది.

ఇక కోల ముఖాకృతి ఉన్నవారు ఎలాంటి లోలాకులు పెట్టుకున్నా బానే ఉంటుంది. దిద్దుల దగ్గర్నుంచి భుజాల వరకూ వేళ్లాడే హ్యాంగిగ్స్ దాకా సైజుతో కానీ డిజైన్ తో కానీ సంబంధం లేకుండా దేనినైనా ధరించవచ్చు. కాబట్టి వీళ్లు కాస్త భారీగా ఉండే డిజైన్స్ ను ఎంచుకున్నా ఫరవాలేదు.

లక్ష్మీకళను సంతరించుకున్న జాకెట్లు...



ప్రస్తుత ఫ్యాషన్ ప్రపంచం జెట్ స్పీడ్‌తో పరుగులు పెడుతోంది. ముఖ్యంగా పట్టు చీరల మ్యాచింగ్ బ్లౌజ్‌ల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. జాకెట్టును మామూలుగా కుట్టించుకోవడానికి ఎవరూ ఇష్టపడరూ. వీలైనంత యూనిక్‌గా ఉండేందుకు తహతహలాడుతుంటారు. ఆ కోవలోంచి వచ్చిందే ఈ లెటస్ట్ ఫ్యాషన్. రాధాకృష్ణులు, లక్ష్మీదేవి, సరస్వతి, వేంకటేశ్వర స్వామి, ఇలా దేవతలు, దేవుళ్లు ఎంబ్రాయిడరీ ద్వారా బ్లౌజులపై కొలువు తీరుతున్నారు. చీర ధరతో పోలిస్తే రెట్టింపు ధర పెట్టి మరీ కుట్టించుకుంటున్నారు. బ్లౌజ్ మీద ప్రతీ చిన్న అంశాన్ని దగ్గరుండి పరిశీలించి మరీ డిజైన్ చేయించుకునే ట్రెండ్‌కి విపరీతమైన క్రేజ్ పెరిగిపోయింది. అందుకోసం ధర ఎంతయినా వెనుకాడడం లేదు. కట్టుకున్న చీరకి స్పెషల్ లుక్ వీటితోనే వస్తుందని బలంగా నమ్ముతున్నారు ఫ్యాషన్ ప్రియులు. అదే పెళ్లిళ్లు, పేరంటాళ్ల వంటి స్పెషల్ అకేషన్లో సెంటరాఫ్ అట్రాక్షన్ తామే అయితే వేసుకునే బ్లౌజ్ యునిక్‌గా కనిపించాలని తాపత్రయపడుతున్నారు. మొత్తానికి చిన్న చిన్న వేడుకల నుంచి పెద్ద పెద్ద పెళ్లిళ్లు, పార్టీల వంటి వాటికోసం ప్రత్యేకంగా డిజైన్ చేసిన బ్లౌజ్లు వేసుకోవడానికి ఇష్టపడుతున్నారు మహిళా మణులు.

ముచ్చటైన చిత్ర కళ చీర కొంగు మీద ఒదిగిపోతే అచ్చమైన జరీ జిలుగులకు జాకెట్టు కాన్వాస్‌గా మారితే సంప్రదాయ వేడుక విన్నూత కళను నింపుకుంటుంది. చిత్రకళ సొగసు, ఎంబ్రాయిడరీ జిలుగులు జత చేరి మెరిసిపోతుంటే పట్టు రెపరెపల మధ్య వాటిని పట్టేసుకుంటే ప్రతీ కట్టూ ప్రత్యేకతను నింపుకోకుండా ఉండగలదా...!

టీనేజర్ల నుంచి స్వీట్ సిక్స్‌టీ వరకు అన్ని వయసుల ఆడవాళ్లను అలరిస్తున్నాయి. అంత ఘనంగా ఉన్న చీరల మీద వేసుకునే బ్లౌజ్ డిజైన్లు కూడా రిచ్‌గా ఉండాలి కదా. అందుకనే కాబోలు చీరలతో పాటు డిజైనర్ బ్లౌజ్ పీస్లు ఇచ్చేస్తున్నారు. ఈ బ్లౌజ్ల వెనక అందమైన డిజైన్లు ఉండేలా జాగ్రత్తపడుతున్నారు. వీటిలో కొన్ని కాంట్రాస్ట్ రంగుల్లో ఉంటే మరికొన్ని చీరకు తగ్గట్టుగా పూర్తి మ్యాచింగ్‌తో వస్తున్నాయి. పెళ్లి కూతుళ్లకి ప్రత్యేకంగా, మామూలుగా వేసుకునేందుకు పలు రకాల మోడల్స్లో ఉంటున్నాయి ఈ బ్లౌజ్ల డిజైన్లు. వాటినుంచి కొన్ని డిజైనర్ బ్లౌజ్లు మీకోసం.



దేవతామూర్తులు

పెళ్లి, పేరంటాలకు ఇంకాస్త నిండుతనాన్ని పెంచడానికి, పూజా కార్యక్రమాలకు మరింత గ్రాండ్‌గా ఉండటానికి హారాలతో పాటు అప్సరసల నాట్యకళతో లక్ష్మీ కళ ఉట్టిపడేలా ముక్కోటి దేవుళ్లను జాకెట్టుపై ఎంబ్రాయిడరీ చేయించుకుంటున్నారు.

పల్లకిలో పెళ్లికూతురు

సన్నాయి రాగాలాపన.. బాజా భజింత్రీల చప్పుళ్ల మధ్య.. అలంకరించిన పల్లకిలో కోటి కలల కొత్త జీవితాన్ని మోసుకుంటూ పెళ్లికూతురు మండపానికి వస్తుంటే చూడ్డానికి రెండు కళ్లు చాలవు. ఆ కళని చీర కొంగుమీదనో లేదంటే బ్లౌజ్ మీదనో చూపితే చూపుల దారాలు అల్లిబిల్లిగా అల్లుకుపోవాల్సిందే!

రాధాకృష్ణుల ప్రేమ కావ్యం

యుగాలు దాటినా ఆ అందం వన్నె తగ్గదు. అందుకే ఆ ప్రేమను డిజైనర్లు ఇలా ఆకట్టుకునేలా ఆవిష్కరిస్తున్నారు. ఫ్యాబ్రిక్ పెయింట్‌తో రాధాకృష్ణుల బొమ్మలు గీసి, లతలు, పువ్వులను జరీతో సింగారించారు. మరికొన్ని జరీ, పూసలతోనే రాధాకృష్ణుల బొమ్మలు కుట్టుతో ఆకట్టుకుంటున్నాయి.

కోటగుమ్మాలు

రాజస్థానీ మొఘల్ ఘనత చీర అంచుల్లోనూ, కొంగులోనూ మెరిసిపోవడంతో పాటు జాకెట్టు పైనా ఘనతను చాటుతుంది. కోట గొమ్మాలను జరీ దారాలు, కుందన్ మెరుపులతో సింగారిస్తున్నారు.

చీరలు, బ్లౌజ్ల మీద ఎంబ్రాయిడరీ కళ ప్రతీసారి కొత్త హంగులతో ఆశ్చర్యపరుస్తూనే ఉంది. మొన్నటి వరకు పూసలు దారాలతో పువ్వులు, లతలు అల్లేస్తే ఇప్పుడు ఏకంగా దేవతా మూర్తుల బొమ్మలనే తీరుగా డిజైన్ చేస్తున్నారు.

-విజయారెడ్డి




నీ జీనూప్యాంట్ చూసీ బుల్లెమ్మా..

జీన్స్ అమ్మాయిల ఆల్ టైం ఫేవరేట్... సీజన్ ఏది అయినా జీన్స్ మాత్రం వేయాల్సిందే. ఎలాంటి జీన్స్ వేస్తే ఫ్యాషనబుల్‌గా వుంటారు అంటే... ఫ్లోరల్ డిజైన్స్‌కే మా ఓటు అంటున్నారు అమ్మాయిలు. జీన్ ప్యాంటు పువ్వులద్దుకుని చాలా కాలం అయినా, ఇప్పుడిప్పుడే విరివిగా అందరూ వాడటం మొదలుపెట్టారు. అమ్మాయిలకి, పువ్వులకి అనుబంధం ఎక్కువ. కాబట్టి నచ్చిన పూల డిజైన్‌లో ఓ జీన్స్ కొని ట్రై చేయండి. స్టైలీష్‌గా వుంటారు... లైట్ కలర్స్‌లో పెద్ద ప్రింట్స్ కూడా చక్కగా వుంటాయి. కాస్త ఎత్తు తక్కువ వున్నవాళ్ళు చిన్న ప్రింట్స్ తీసుకుంటే బావుంటుంది. పొడవుగా వున్నవాళ్ళు పెద్ద ప్రింట్స్ వేసుకున్నా బావుంటుంది. ఇదిగో మీకోసం కొన్ని డిజైన్లు ఇక్కడ ఇస్తున్నాం... షాపింగ్ మొదలుపెట్టండి ఇక..





కిర్రాక్ పుట్టిస్తున్న కాక్ టెయిల్ రింగ్స్



ఫ్యాషన్ రంగం రోజురోజుకి జెట్ స్పీడ్‌తో పరిగెడుతున్న విషయం తెలిసిందే. అయితే ఇందులో ఎక్కువగా పాతకాలం నాటి వాటికే కొత్త హంగులు అద్ది న్యూలుక్‌ని తీసుకువస్తున్నారు డిజైనర్లు. పూర్వం ఎప్పటినుంచో ఉన్నా పెద్ద పెద్ద ఉంగరాలను ఇప్పుడు కాక్ టెయిల్ పేరుతో మళ్లీ కొత్తగా వివిధ హంగులతో మార్కెట్ లోకి వచ్చాయి. అందమైన చేతివేళ్లు ఇంకా అందంగా కనిపించాలంటే వాటికి నెయిల్ పాలిష్ వేసుకోవడమో, రింగులు పెట్టుకోవడమో చేస్తాం. ఇంకా కొంచెం మోడ్రన్ గా కనిపించాలంటే... మాత్రం ఇలాంటి కాక్‌టెయిల్ రింగ్స్‌ను పెట్టుకోవాల్సిందే. ఇవి స్టోన్స్ తో ఉండి చాలా అందంగా ఉంటాయి. వివిధ రంగుల్లో, ఆకారాల్లో దొరుకుతున్నాయి. ఆకారంలో పెద్దగా ఉండి కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. ఈ రింగులు ట్రెడిషనల్ వేర్ గా కంటే పార్టీ వేర్ కి చాలా బాగా నప్పుతాయి. స్టోన్స్ తో పెద్దగా ఉండటం వలన మధ్య వేలుకి ఒకటి పెట్టుకుంటే సరిపోతుంది. అందరిలో ప్రత్యేకంగా కనిపిస్తారు.







రాగి జావ

రాగులు బలవర్ధకమైనవి. శారీరక కష్టం అధికంగా చేసేవారు రాగుల పిండితో తయారు చేసిన పదార్థాలను తరచుగా తిన్నట్లైతే వారికి నూతన శక్తి లభిస్తుంది. రాగులలో అయోడిన్ పుష్కలంగా లభిస్తుంది. ఎదిగే పిల్లలకు పాలల్లో రాగులను వేయించి పొడిచేసిన పిండిని కలిపి తాగించినట్లైతే పిల్లలు బాగా ఎదుగుతారు. వేసవిలో రాగి పదార్థాలను తీసుకోవడం ద్వారా కడుపులో మంటను తగ్గుతుంది. శరీరానికి చలవ చేస్తుంది. పైత్యాన్ని తగ్గిస్తుంది. రాగుల పానీ యం దాహార్తిని తగ్గిస్తుంది. వృద్ధాప్యంలో వున్న వారు వేసవిలో రాగులతో తయారు చేసిన ఆహార పదార్థాలను భుజించడం వల్ల శరీరానికి శక్తి చేకూరుతాయి. అలాగే మూడు పదులు దాటిన మహిళలు, యువతులు కూడా ఎముకల పటుత్వానికి రాగులతో తయారు చేసిన రాగి మాల్ట్‌ను తాగడం మంచిది. రాగి మాల్ట్ ఎముకల పటుత్వానికి ధాతువుల నిర్మాణానికి తోడ్పడుతుంది. సుగంధిపాలు కలిపిన రాగి మాల్టును తీసుకుంటే రక్త పోటు అరికట్టబడుతుంది. మూత్రపిండాలలో రాళ్ళు ఏర్పడకుండా చేస్తుంది. ముఖ్యంగా వేసవిలో రాగి జావ, రాగి అంబలి, రాగి సంకటిని రోజూ డైట్‌లో చేర్చుకోవాలి. రాగితో పాటు మజ్జిగ, పెరుగును కలుపుకుని అంబలి తీసుకుంటే ఆరోగ్యంతో పాటు వేసవి తాపాన్ని తగ్గించుకోవచ్చునని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.



ఉల్లి కరకరా.. బఠానీ దోసెలా!

స్కూల్ నుంచి వస్తూనే ఆకలి అంటూ వచ్చే పిల్లలకోసం జంకు పుడ్డు ఎంత నిలువ చేసినా వేడివేడిగా వండి వడ్డించే వంటకాలనే ఇష్టపడతారు. రోజూ చేసే టిఫిన్ రుచికరంగా ఉన్నా కొత్త వాటికోసం వెతుకుతారు. భిన్నరుచులు కోరుకునే పిల్లల కోసం కొత్తవి ట్రై చేయక తప్పదు. సాయంకాలం ఆటలు ముగించుకొని వచ్చేలోపు ఏదైనా స్నాక్ రెడీ చేయాల్సి ఉంటుంది. ఆలు, ఉల్లి పాయలు, పనీర్ ఎప్పటికీ అందుబాటులో ఉంచుకుంటే చాలు.. వెరైటీ స్నాక్స్ నిమిషాల్లో వండి ఇంటిల్లిపాదీ తినొచ్చు. శీతాకాలపు సాయంత్రంలో పాతవి కాకుండా ఈ రోజు కొత్తవి చేద్దాం..

ఆనియన్ రింగ్స్

కావాల్సిన పదార్థాలు

ఉల్లిపాయలు 5 (విడివిడిగా వచ్చేటట్లు రౌండ్‌గా తరగాలి) నూనె వేయించడానికి సరిపడినంత, కారం1 టీ స్పూను, మైదా 1 1/2 కప్పు, గరం మసాలా 1 టీ స్పూను, త్రాగే సోడా 2 కప్పులు, ఉప్పురుచికి సరిపడా, ఉల్లిపాయ పొడి 1 టీ స్పూను, మిరియాలు1/2 టీ స్పూను (మెత్తగా పొడి చేసుకోవాలి), బ్రెడ్ క్రంబ్స్ 1/2 కప్పు, ఆవ పొడి1/2 టీ స్పూను, కార్న్ ఫ్లేక్స్ 1/2 కప్పు(మెత్తగా పొడి చేసుకోవాలి), కొత్తిమీర 1 టేబుల్ స్పూను (సన్నగా తరగాలి).

తయారీ విధానం

- ఉల్లిపాయలని విడివిడిగా వచ్చేటట్లు గుండ్రంగా పొరలుగా తరగాలి. ఇలా తరిగిన ఉల్లిపాయలని 15 నిమిషాలపాటు చల్లని నీటిలో నానబెట్టాలి.తరువాత నీటిలోనుండీ తీసి కిచెన్ టవల్ మీద ఆరబెట్టాలి.ఆరిన తరువాత ఒక ప్లేటులోకి మార్చి వీటి మీద పిండిని చల్లాలి.అందువల్ల ఎక్కువగా ఉన్న తేమని పిండి పీల్చుకుంటుంది.
- ఒక పెద్ద గిన్నెలో మైదా,కారం, మిక్స్‌డ్ హెర్బ్స్, ఉల్లి పొడి, ఆవ పొడి, మిరియాలు, ఉప్పు వేసి అన్నీ బాగా కలిసేటట్లు కలపాలి.
- ఈ పిండిని సోడాతో కలుపుతూ మిశ్రమం ఎలా ఉందో ఒకసారి చెక్ చేసుకోవాలి. పిండి మరీ పల్చగా లేదా చిక్కగా ఉండకూడదు.
- ఈ పిండిని ఉండలు లేకుండా బాగా కలపాలి.
- ఒక ప్లేటులో కార్న్ ఫ్లేక్స్ పొడి, బ్రెడ్ పొడి, తరిగిన కొత్తిమీర వేసి బాగా కలపాలి.
- ఇప్పుడు స్టవ్ మీద కడాయి పెట్టి నూనె వేడి చేసి పొరలు పొరలుగా తరిగిన ఉల్లిపాయలని ఒకొక్కటిగా ఈ పిండిలో ముంచి బ్రెడ్ క్రంబ్స్, కార్న్ ఫ్లేక్స్ పొడిలో దొర్లించి ఉల్లిపాయలకి బ్రెడ్ పొడి బాగా పట్టేటట్లు చూడాలి.
- ఇలా బ్రెడ్ పొడిలో దొర్లించిన ఉల్లిపాయలని వేడెక్కిన నూనెలో వేసి బంగారు రంగు వచ్చేవరకూ వేయించాలి.
- వేగాకా నూనెలో నుండి తీసి కిచన్ టిష్యూ మీద వేస్తే ఆనియన్ రింగ్స్‌లో ఉన్న అధిక నూనెని పీల్చుకుంటుంది.
- కరకరలాడే ఆనియన్ రింగ్స్ రుచికి బాగుంటాయి.

గ్రీన్ పీస్ పాన్ కేక్

కావాల్సిన పదార్థాలు

పచ్చి బఠాణీ ఉడికించినవి 3/4 కప్పు, బియ్యప్పిండి 1/2 కప్పు, శనగపిండి 1/2 కప్పు, పసుపు 1/4 టీ స్పూను, ఫ్రూట్ సాల్ట్1/2 టీ స్పూను, ఉప్పురుచికి తగినంత, నూనె 2 టేబుల్ స్పూన్లు, టమాటాలు1/4 కప్పు(సన్నగా తరగాలి), క్యారట్లు 1/2 కప్పు(తురమాలి), పచ్చి మిరపకాయల తరుగు2 టేబుల్ స్పూన్లు, తురిమిన పనీర్4 టేబుల్ స్పూన్లు, నీరుతగినంత.

తయారీ విధానం

- ఉడికించిన బఠాణీని మెత్తగా రుబ్బాలి. ఒక గిన్నె తీసుకుని దానిలో బఠాణీ ముద్ద వేసి దానికి బియ్యప్పిండి, శనగపిండి, పసుపు, పచ్చి మిర్చి తరుగు, ఉప్పు చేర్చాలి.
- నీరు పోసి కాస్త చిక్కగా అయ్యేవరకూ కలిపి దానిలో ఫ్రూట్ సాల్ట్ వేసి కలపాలి.
- ఫ్రూట్ సాల్ట్ వేసాకా ఎక్కువగా కలపకూడదు.ఎక్కువగా కలిపితే ప్యాన్ కేక్స్ మెత్తగా రావు.ఇప్పుడు ఒక పెనం తీసుకుని వేడి చేసి దానికి నూనె రాయాలి.ఇలా చేస్తే పెనం మీద నుండి ప్యాన్ కేక్స్ తియ్యడం సులువు.
- ఇప్పుడొక గరిటెతో ప్యాన్ కేక్ మిశ్రమాన్ని తీసుకుని పెనం మీద కాస్త మందంగా దోస లాగ పొయ్యాలి. చిన్న చిన్న ప్యాన్ కేక్స్ పోసుకుంటే తియ్యడం సులువు.
- ఇప్పుడు వీటి మీద తురిమిన పనీర్,క్యారెట్, టమాట వేసి పైన కొంచెం నూనె చిలకరించాలి.ప్యాన్ కేక్ ఒక వైపు కాలాక మరొక వైపు తిప్పాలి.
- రెండో వైపు కూడా వేడి అయ్యాక మీ ప్యాన్ కేక్స్ రెడీ. వీటిని వేడి వేడిగా వడ్డించడమే. ఇవి చట్నీ లేదా సాస్‌తో కలిపి వడ్డిస్తే మరింత రుచికరంగా ఉంటాయి.విటమిన్లు, పీచు, మినరల్స్ కలిగిన ఈ స్నాక్ ఆరోగ్యానికి మంచిది. మరి మర్చిపోకుండా దీనిని ప్రయత్నిస్తారు కదా.



చికెన్‌గున్యాతో జాగ్రత్త

చికెన్ గున్యా అనేది దోమల ద్వారా వ్యాపించే ఒక వైరల్ వ్యాధి. చికెన్ గున్యా ప్రాణాంతక వ్యాధి కాదు. కానీ మనిషిని కదలలేని స్థితికి చేర్చి శారీరకంగా మరియు మానసికంగా క్రుంగదీస్తుంది. పేరులో సారూప్యత ఉన్నా కోళ్ళకూ (చికెన్) ఈ వ్యాధికీ, అలాగే బర్డ్ ఫ్లూ వ్యాధికీ చికెన్‌గున్యాకు ఏ విధమైన సంబంధమూ లేదు. తొలుత పక్షుల్లో కనిపించిన ఈ వైరస్ దోమల ద్వారా మనిషిని చేరింది. ఈ జ్వరాన్ని సకాలంలో గుర్తించకపోతే ప్రాణాంతకంగా మారుతుంది.



వ్యాధి ఉనికి

చికెన్ గున్యా 1952లోఆఫ్రికా ఖండములోని టాంజానియాలో కనుగొన్నారు. ప్రపంచ ఆరోగ్య జాతీయ సంస్థ లెక్కల ప్రకారం ఆసియా, ఆఫ్రికా, అమెరికాల తదితర 60కి పైగా దేశాలలో చికెన్‌గున్యా వ్యాప్తిలో ఉంది. భారతదేశంలో చికెన్ గున్యా జ్వరం అనే మహమ్మారి కోల్‌కతా, పాండిచ్చేరి , తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయి.

వ్యాధి కారక ఏజెంట్

టోగావిరిడే కుటుంబానికి చెందిన ఆల్ఫావైరస్‌వల్ల కలిగే అరుదైన విష జ్వరము చికెన్‌గున్యా.

దేనితో...

ఏడెస్ ఏజిప్టి దోమ కాటు వలన పట్టణ ప్రాంతాల్లో ప్రజలు, ఏడెస్ అల్బోపిక్టస్ దోమ కాటు వలన గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య జాతీయ సంస్థ (Wold Health Organization) గుర్తించింది.

చికెన్ గున్యా వ్యాప్తి చెందే విధానం

చికెన్ గున్యా తో భాదపడున్న వ్యక్తిని ఏడెస్ ఏజిప్టి దోమ కుట్టిన తరువాత వైరస్ రోగి నుంచి దోమ లోనికి ప్రవేశిస్తుంది. ఒకవేళ ఆ దోమ వేరొక ఆరోగ్యవంతమైన వ్యక్తిని కుట్టినట్లైతే ఆ వ్యక్తి వ్యాధి సోకే అవకాశాలు వున్నాయి. వైరస్ శరీరంలో ఉన్న అన్ని గ్రంధులలో ప్రయాణం చేసి రక్త ప్రసారంలో చేరి రక్తనాళాలలో ఇన్‌ఫెక్షన్లు, వాపును కలుగచేస్తుంది. ఈ చికెన్ గున్యా వైరస్ ముఖ్యంగా కీళ్ళ, కండరాలు, చర్మంపై ప్రభావం చూపిస్తుంది. లివర్, మూత్రపిండాలు, కళ్ళు, నాడీమండలం వ్యవస్థపై ఈ వ్యాధి ప్రభావాన్ని చూపిస్తుంది. వైరస్ ప్రభావం ఎక్కువగా కండరాలపైనా ఉంటుంది. ఈ ఏడెస్ దోమలు రాత్రివేళ కాకుండా పగటివేళ సంచరిస్తూ ఉంటాయి.

వ్యాధి లక్షణాలు

చికెన్ గున్యా సోకిన రోగికి 102 డిగ్రీల ఫారన్ హీటు డిగ్రీల వరకు చేరే ఉష్ణోగ్రత కూడిన విష జ్వరము, కీళ్ల నొప్పులు ముఖ్యంగా చిన్న చిన్న కీళ్లలో వాపు ముట్టుకుంటే విలవిలలాడేలా నొప్పి, మణికట్టు, చేతి కీళ్లు, మడిమ కీళ్లలో వాపులు, కండరాల నొప్పులు, శరీర భాగాలు పట్టేసి నట్లు ఉండటం, కళ్ళు ఎర్రబడడం, నడవడానికి కూడా శ్రమపడాల్సి వస్తుంది. స్వల్ప తలనొప్పి, నిద్రలేమి, వికారం, అలసట, కాళ్ళు మరియు చేతుల మీద దద్దుర్లు ఉండి వ్యాధి నిరోధక శక్తిని దెబ్బ తీస్తుంది. ఈ వ్యాధిలో చాలా లక్షణాలు వున్నా విపరీతంగా బాధించేది కీళ్ల నొప్పులే ఎందుకంటే నొప్పి ఒక కీలు నుంచి మరొక కీలుకు పాకుతూ ఉంటుంది. లేవలేక కూర్చోలేక మంచానికే పరిమితం కావలసిన పరిస్థితి రావడం.

వ్యాధి నిర్ధారణ

రక్త పరీక్షలు, ఎలిసా మరియు చికెన్ గున్యా వైరస్‌లో ఉండే ఐ జీఎం అంటిబొడిఎస్ కొరకు తగిన పరీక్షలతో వ్యాధి కారకాన్ని నిర్ధారిస్తారు.

చికిత్స

చికెన్‌గున్యాకు ప్రత్యేకమైన నిర్దిష్ట యాంటీవైరల్ ఔషధ చికిత్స లేదు. చికిత్స పూర్తిగా వ్యక్తి యొక్క వ్యాధి లక్షణాలను బట్టి ఉంటుంది . చికెన్ గున్యాకు ఇప్పటివరకు ఖచ్చితమైన చికిత్స లేదు. కానీ రోగ లక్షణాలైన నొప్పి ఉపశమనానికి వైద్యులు అనాల్జెసిక్స్ ను ఉపయోగించి చికిత్స (supportive care) చేస్తారు. ఇంట్రావెనస్ ఫ్లూయిడ్స్ వాడుతారు. తగినంత విశ్రాంతి తీసుకో వాలి. పారాసెటమాల్ జ్వరం మరియు నొప్పులు తగ్గించడానికి వాడే మందుతో కాని పూర్తిగా నివారణ కలుగదు.

జ్వరానికి కానీ నొప్పులు తగ్గడానికి కానీ మీ స్వతహాగా మందులు వాడటం సరైన పద్ధతి కాదు. కాలేయము మరియు గుండె సమస్యలు వస్తే లక్షణాన్ని బట్టి మందులు తీసుకోవాలి. వ్యాధులు సోకకుండా ఉండేందుకు బయట ఆహారాన్ని తీసుకోకూడదు. ఒకవేళ వాంతులు, విరేచనాలు ఉన్నట్లైతే వెంటనే వైద్యుని సంప్రదించి తగిన సూచనలు పాటించాలి.

నర్సింగ్ కేర్

అధిక జ్వరం తగ్గడం కోసం గోరు వెచ్చని నీటితో స్పాంజింగ్ చేయడం. కీళ్ల వాపు, నొప్పి నుంచి ఉపశమనం కొరకు కోల్ కంప్రెస్ ప్రొసీజర్ చేయవచ్చు. వేడి కాపడం పెట్టడం వలన నొప్పి ఇంకా ఎక్కువయ్యే ఆస్కారం వుంటుంది. కోలుకుంటున్న రోగులలో వ్యాయామాలు మరియు ఫిజియోథెరపీ కొంత మేరకు పనిచేస్తుంది. సరైన పోషకాహారం మరియు ద్రవ పదార్థాలు తీసుకోవడం.

వ్యాధి నివారణ మార్గాలు

దోమలను నివారించేందుకు దోమ తెరలు మరియు కిటికెలకు మెష్ పెట్టించాలి. దోమల మందులు కొట్టించాలి. దోమ నిరోధకాలు వాడాలి (కాయిల్స్, అల్ అవుట్, రేపల్లెన్స్, ఒడామస్, దోమ బ్యాట్స్ మొదలైనవి దోమకాటు నుంచి కాపాడుతాయి. గుంతలలో నీరు నిలవకుండా చూడాలి. నీళ్ల నిల్వ చేసే పాత్రలకు మూత పెడితే దోమలు గుడ్లు పెట్టకుండా నిరోదించొచ్చు. ఇండోర్ మరియు బయట మంచి పరిశుభ్రత పద్ధతులు అవసరం. అన్ని తలుపులు, కిటికీలు మరియు ఓపెనింగ్స్ అన్ని స్క్రీన్లతో మూయాలి. ఆహరం మరియు చెత్త, సరైన డబ్బాలలో, మూత ఉన్న వాటిల్లో నిల్వ చేయాలి.

దోమలు, ఈగలు పట్టె మిషన్స్ అమర్చాలి. డిస్పోసల్ డబ్బాలు పనికి రాని కాన్లు మరియు చెత్త పారవేయాలి. ఫ్లవర్ వస్ లో నీళ్ల రోజు మారుస్తూ ఉండాలి. పాత మరియు పంక్చర్ అయినా బండి టైర్లలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలి.

బైటకు వెళ్ళినపుడు పొడవు చేతులు ఉన్న దుస్తులు ధరించాలి. కలుపు మొక్కలు తీసేసి పొడుగ్గా గడ్డి పెరగకుండా పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.



ఎ.స్వరూప
డిప్యూటీ మేనేజర్
నర్సింగ్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్,
అపోలో మెడ్‌స్కిల్స్, జూబ్లీహిల్స్

హెల్త్

కుష్టు వ్యాధిపై అప్రమత్తత అవసరం



లెప్రసీ అనేది ఒక లెప్రా బాసిల్లా అనే బాక్టీరియా వల్ల వచ్చే వ్యాధి. దీనినే క్షయవ్యాధి అంటారు. ఇది శాపం కాదు. దీనికి చికిత్స ఉంటుంది. కంగారు పడాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా మనం లెప్రసీ లక్షణాలు గుర్తు పట్టాలంటే తొలి దశలోనే చర్మంపై స్పర్శ లేని తెల్లని మచ్చలు ఉంటే లెప్రసీ కావచ్చు లేదా కాకపోవచ్చు. లెప్రసీ అవునా, కాదా అని నిర్ధారించుకునేందుకు మన దగ్గర్లో ఉన్న చర్మవ్యాధుల వైద్యున్ని సంప్రదించి లెప్రసీ వ్యాధి వచ్చిందా, లేదా నిర్ధారణ చేసుకోవాలి. చికిత్స చేసుకుంటే పూర్తిగా నయమౌతుంది. అలసత్వం చేసి, ఇతరులకు చూపిస్తే ఏమనుకుంటారో అనుకుంటే డిఫార్మిటీస్, డిజబిలిటీస్ వృద్ధి చెంది ఇబ్బందుల పాలౌతారు. ప్రభుత్వాలు నిర్ధారణ పరీక్షలు, చికిత్స పూర్తిగా ఉచితంగా అందిస్తున్నాయి.

గాంధీ ఆసుపత్రిలో ప్రతి బుధవారం లెప్రసీ స్పెషాలిటీ క్లినిగ్ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నారు. దీనిని పూర్తిగా వినియోగించుకుంటే మనం, మన కుటుంబాలు ఆహ్లాదకరంగా, సంతోషంగా గడపవచ్చు. బాక్టీరియా లోపల చేరిన వారందరిలో వ్యాధిగా మారదు. నూటికి 95 శాతం మందిలో ప్రమాదం ఉండదు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. పిల్లల నుంచి పెద్దల వరకు ఎవరికైనా రావచ్చు. తెల్లమచ్చలు చిన్నతనం నుండి ఉంటే అది లెప్రసీ కాదు. కలిసి భుజించడం వల్ల లెప్రసీ రాదు. కరచాలనం చేయడం ద్వారా లెప్రసీ రాదు. ఉమ్మడి మరుగుదొడ్లు వాడడం వలన లెప్రసీ రాదు. చర్మవ్యాధుల నిపుణులందరు లెప్రసీకి చికిత్స చేస్తారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్థంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం జనవరి 30న యాంటీ లెప్రసీ డేగా పాటిస్తారు.



డాక్టర్ కె.భూమేష్ కుమార్
కన్సల్టెంట్ పీడియాట్రిక్ డెర్మటాలజిస్ట్
అసోసియేట్ ప్రొఫెసర్,
గాంధీ మెడికల్ కాలేజ్.



ప్రథమ పౌరుడికి క్రిష్ సినిమా!

క్రిష్ దర్శకత్వం వహించిన ఓ సినిమాని దేశ ప్రథమ పౌరుడు రాష్ట్రపతికి ప్రదర్శించనున్నారు.. ఇంతకీ ఏ సినిమా అది? ఈ ప్రశ్నకు సమాధానం ఇదిగో... టాలీవుడ్ డైరెక్టర్ క్రిష్ దర్శకత్వం వహించిన ఓ సినిమాని రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేకంగా దేశ ప్రథమ పౌరుడు రాష్ట్రపతి కోసం ప్రదర్శించనున్నారు. ఆ సినిమా విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్.టి.రామారావు జీవిత కథ ఆధారంగా తెరకెక్కించిన 'ఎన్టీఆర్ కథానాయకుడు' అనుకుంటే తప్పులో కాలేసినట్టే. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మనసుపడి.. చూడాలని ఆత్రుతగా ఎదురుచూస్తున్న సినిమా వేరొకటుంది... గ్రేట్ వారియర్ క్వీన్ ఝాన్సీ రాణి జీవితకథను ఆయన తెరపై చూడాలనుకుంటున్నారు. ఆయన కోరిక మేరకు చిత్ర బృందం శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేకంగా ప్రదర్శనను ఏర్పాటు చేసింది.

రాష్ట్రపతి దంపతులతో పాటు పలవురు రాజకీయ నాయకులు, చిత్ర బృందం పాల్గొననున్నారని తెలిసింది. 80 శాతం సినిమాకి క్రిష్ దర్శకత్వం వహించాక, మిగతా 20 శాతం కంగన డైరెక్ట్ చేసిన సంగతి తెలిసిందే. అటుపై క్రిష్ అలక పానుపు ఎక్కిన సంగతి విదితమే. ఎన్టీఆర్ బయోపిక్ గురించి తెలిసిన తరువాత ఆ చిత్రాన్ని మధ్యలోనే వదిలేసిన క్రిష్ బయటికి వచ్చేశాడు. దీంతో మిగతా భాగాన్ని పూర్తిచేసే బాధ్యతల్ని కథానాయిక కంగన తీసుకుని విజయవంతంగా పూర్తిచేసింది. 'మణికర్ణిక'చిత్రాన్ని ఈ నెల 25న విడుదల చేస్తున్నారు.





సంక్రాంతి.. బ్రేక్ ఈవెన్ ఎవరికి?

ఈ సంక్రాంతి బరిలో పోటీపడిన చిత్రాల్లో బ్రేక్ ఈవెన్ దక్కేది ఎవరికి? బాలయ్య నటించిన 'ఎన్టీఆర్ కథానాయకుడు' 9న విడుదల కాగా, ఆ తరువాత వచ్చింది రామ్‌చరణ్ 'వినయ విధేయ రామ'. ఇక ఎలాంటి అంచనాలు లేకుండా పోటీకి దిగిన సినిమా 'ఎఫ్2'. ఈ మూడు చిత్రాల్లో ముందు విడుదలైన 'ఎన్టీఆర్ కథానాయకుడు', రామ్‌చరణ్ 'వినయ విధేయ రామ' డివైడ్ టాక్‌ను సొంతం చేసుకోగా ఈ సంక్రాంతికి జెన్యూన్ హిట్‌గా నిలిచిన సినిమా 'ఎఫ్2'. అయితే ఈ మూడు చిత్రాలు బ్రేక్ ఈవెన్ సాధించడం కోసం బాక్సాఫీస్ వద్ద పోటీపడుతున్నాయి.

బాలకృష్ణ ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి నటించిన చిత్రం 'ఎన్టీఆర్ కథానాయకుడు'. సినిమా విడుదలకు ముందు భారీ స్థాయిలో చర్చ జరిగినా ఈ సినిమా వసూళ్లు మాత్రం ఆశాజనకంగా లేకపోవడం చిత్ర వర్గాలను కలవరానికి గురిచేస్తోంది. 53.44 కోట్లు వసూలు చేస్తే ఈ సినిమా పెట్టుబడిని సాధించినట్టే. అయితే ఇది సాధించడమే ఈ చిత్రానికి గగనంగా మారుతోంది. ఇప్పటి వరకు ఈ సినిమా 8 రోజులకు గాను ప్రపంచ వ్యాప్తంగా 18.5 కోట్లు మాత్రమే వసూలు చేసింది.

సినిమాని మాత్రం 72.23 కోట్లకు బయ్యర్లకు అమ్మేశారు. ఆ మొత్తం దేవుడెరుగు సినిమా కోసం ఖర్చు చేసిన పెట్టుబడి కూడా తిరిగొచ్చే అవకాశం కనుచూపుమేరలో కూడా కనిపించడం లేదు. ఇక 'వినయ విధేయ రామ' పరిస్థితి మరోలా వుంది. ఫ్లాప్ అని టాక్ వచ్చినా వసూళ్ల పరంగా బెస్ట్ గా దూసుకెళ్లింది. సంక్రాంతిని ఈ సినిమా బాగా క్యాష్ చేసుకుంది. 'ఎన్టీఆర్ కథానాయకుడు' కంటే కొంత బెటర్ గానే వుంది. ఈ చిత్రాన్ని 'రంగస్థలం' పేరు చెప్పి 90 కోట్లకు అమ్మేశారు. ఇప్పటికి గడిచిన ఆరు రోజుల్లో 54.50 కోట్ల వసూలు చేసింది. ఇంకా బ్రేక్ ఈవెన్ కావాలంటే మరో 35.50 కోట్ల వసూలు చేయాలి. అది జరిగే పనిలా కనిపించడం లేదు.

సినిమా డిజాస్టర్ టాక్‌ని సొంతం చేసుకోవడంతో దీన్ని కాపాడటం కష్టతరంగా మారింది. పండగ సెలవులు, పండగ కలిసిరావడం బట్టే ఆ మాత్రం వసూలు చేసింది. లేదంటే ఈ సినిమా రూయంలో బయ్యర్లకు భారీ లాస్ మిగిలేది.

ఈ పండక్కి టాక్‌తో పాటు వసూళ్ల పరంగా ముందున్న సినిమా 'ఎఫ్2'. 34.50 కోట్లకు అమ్ముడు పోయిన ఈ సినిమా ఇప్పటి వరకు 32.10 లక్షలు వసూలు చేసి ముందు వరుసలో నిలిచింది. బ్రేక్ ఈవెన్‌కు 2.40 లక్షలు వసూలు చేస్తే టార్గెట్ రీచయినట్టే. ఇక తరువాత వచ్చేదంతా ప్రాఫిటే.





తెలుగు తెరకు విశాల్ మాజీ ప్రేయసి?



హీరో విశాల్, తమిళ హీరోయిన్, శరత్‌కుమార్ కూతురు వరలక్ష్మి గత కొంత కాలంగా ప్రేమలో వున్నారంటూ జోరుగా ప్రచారం జరిగింది. ఈ ప్రచారాన్ని ఎప్పటికప్పుడు విశాల్, వరలక్ష్మి కొట్టి పారేస్తూనే వున్నారు. అయినా చాలా కాలంగా వీటి తాకిడి ఆగలేదు. తాజాగా విశాల్ 'పెళ్లిచూపులు', 'అర్జున్ రెడ్డి' చిత్రాల ఫేమ్ హైదరాబాద్ అమ్మాయి అనీషాని పెళ్లి చేసుకోబోతున్నట్టు పబ్లిక్‌గా ప్రకటించేశాడు. అయినా విశాల్, వరలక్ష్మి ప్రేమకథ కంచికి చేరడానికి కారణం ఎవరు అనే రంధ్రాన్వేషణ జరుగుతూనే వుంది.

ఇదిలా వుంటే తమిళ కథానాయికల్లో హైపర్ యాక్టివ్‌గా వుండే వరలక్ష్మి త్వరలో తెలుగులో తెరంగేట్రం చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటోంది. తన చిరకాల మిత్రుడు విశాల్ హైదరాబాద్ అల్లుడు అవుతుంటే వరలక్ష్మి మాత్రం అదే హైదరాబాద్‌కు రావడం కోసం ఓ తెలుగు సినిమా అంగీకరించినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన ఆసక్తికరమైన ట్వీట్‌ను వరలక్ష్మి తన ట్విట్టర్ వేదికగా అభిమానులతో పంచుకుంది. తొలిసారి తెలుగు సినిమాలో నటించబోతున్నందుకు అనిర్వచనీయమైన అనుభూతికి లోనవుతున్నాను. సందీప్‌కిషన్‌తో కలిసి తొలిసారి తెలుగులో ఓ సినిమా చేయబోతున్నాను అని ట్వీట్ చేసింది.

గత కొంత కాలంఆ సరైన హిట్లు లేని సందీప్‌కిషన్ మళ్లీ స్పీడు పెంచిన విషయం తెలిసిందే. వరుస చిత్రాల్లో నటిస్తున్న ఆయన తాజాగా జి.నాగేశ్వరరెడ్డి దర్శకత్వంలో 'తెనాలి రామకృష్ణ బిఏ బిఎల్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా వరలక్ష్మి కథానాయికగా తెలుగు ప్రేక్షకులకు పరిచయం కాబోతోంది. 'ఒక్క అమ్మాయి తప్ప' ఫేమ్ రాజసింహా కథ, స్క్రీన్‌ప్లే అందిస్తున్న చిత్రాన్ని రెండు లేదా మూడు షెడ్యూళ్లలో పూర్తి చేసి సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారు. విశాల్ పెళ్లి కూడా ఈ సమ్మర్‌లోనే జరిగే అవకాశం వుంది.



వైయస్ జగన్‌పై సినిమానా?

బయోపిక్‌ల ట్రెండ్‌లో రాజకీయ నాయకుల బయోపిక్‌లతో ఇండస్ట్రీ వేడెక్కుతున్న సంగతి తెలిసిందే. తాజాగా మరో నాయకుడి బయోపిక్ వెండితెరకెక్కించే ప్రయత్నం సాగడం ఆసక్తి పెంచుతోంది. ఏపీ రాజకీయాల్లో కీలక నాయకుడైన యువనేత.. వైయస్సార్ సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ పై సినిమా తీసే ప్రయత్నం సాగుతోందిట. అయితే అది బయోపిక్ కాదు... హాఫ్ నేరేటెడ్ బయోపిక్.. జగన్ జీవితంలో కీలక ఘట్టాలని తీసుకుని తెరపై చూపించే ప్రయత్నం సాగుతోందిట. ఈ సినిమాకి జగన్ అనుయాయుడు, అభిమాని అయిన పోసాని కృష్ణ మురళి దర్శకత్వం వహిస్తారని తెలుస్తోంది.

'మెంటల్ కృష్ణ' తరువాత పోసాని చేస్తున్న ప్రయత్నమిది. ఇటీవలే జగన్ కథను రెడీ చేసుకుని కడప జిల్లా పులివెందులలో ఓ సినిమాని ప్రారంభిం చారని తెలుస్తోంది. మీడియాలో అనవసర రాద్ధాంతం చేయకుండా సైలెంటుగానే ఈ సినిమాని ప్రారంభిం చారట. ఆసక్తికరంగా ఈ చిత్రాన్ని జగన్ క్యాంపు కార్యాలయంలోనే మొదలు పెట్టడం విశేషం. ఓవైపు వైయస్సార్ పాదయాత్రపై యాత్ర చిత్రం తెరకెక్కు తున్న వేళ ఇలా జగన్ పైనా సినిమా తీయడం ఉత్కంఠ రేకెత్తిస్తోంది. అయితే ఇది జగన్‌పై ఫీచర్ సినిమా యేనా? లేక రాజకీయ ప్రచారానికి ఉపకరించే సినిమానా? అన్నది ఇప్పటికి సస్పెన్స్. ఇప్పటికే లొకేషన్ల ఎంపిక పూర్తయింది. 20 రోజులపాటు పులివెందుల చుట్టుపక్కల గ్రామాల్లో చిత్రీకరిస్తారట. గోల్డెన్ ఎర ప్రొడక్షన్ నెం.1 బ్యానర్‌పై శ్రీధర్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

'కెఎస్ 100' ట్రైలర్ విడుదల

చంద్ర శేఖర్ మూవీస్ పతాకం పై సమీర్ ఖాన్, శైలజ, సునీత పాండే, ఆశి రాయ్, శ్రద్ధ, అక్షత ప్రధాన పాత్రదారులుగా కె. వెంకట్ రామ్ రెడ్డి నిర్మించిన చిత్రం 'కె ఎస్ 100'. షేర్ దర్శకత్వం వహించిన ఈ చిత్ర ట్రైలర్ నిర్మాత సాయి వెంకట్,మల్టీ డీమెన్షన్ వాసు, అట్లూరి రామకృష్ణ లచే విడుదలైంది. ఈ సందర్భంగా మొదట నిర్మాత వెంకట రామ్ రెడ్డి మాట్లాడుతూ మంచి హర్రర్ థ్రిల్లర్ రొమాంటిక్ మూవీ. సినిమా హీరో సమీర్ ఖాన్ మాట్లాడుతూ.. యాక్టర్ అవ్వాలనే నా డ్రీమ్ నెరవేరింది. మంచి సబ్జెక్టు తో ఇంట్రడ్యూస్ అవుతున్నందుకు చాలా సంతోషంగా ఉన్నాను. షేర్ గారు మాకెంతో సపోర్ట్ ను అందించారు. ప్రూవ్ చేసుకునే పాత్ర నాకు అందించినందుకు ఆయన నా స్పెషల్ థాంక్స్. టీమ్ అంతా హార్డ్ వర్క్ చేసాము.. మరిన్ని మంచి సినిమాలతో ఇండస్ట్రీలో కొనసాగాలనుకుంటున్నా. తెలుగు ప్రేక్షకులందరికీ నా కృతజ్ఞతలు అనితెలిపారు.



దర్శకుడు షేర్ మాట్లాడుతూ.. నా పేరు షిరాజ్.. కానీ ఎవరికీ పలకడం రావడం లేదనే షేర్ అని మార్చుకున్నా.. ఇక సినిమా విషయానికి వస్తే 3ఇయర్స్ నుంచి అనుకుంటున్నా ఈ కథను. మొదట ఒక లైన్ చెప్పగానే నిర్మాత వెంకట్ రెడ్డి గారికి బాగా నచ్చి సినిమా చేద్దామని చెప్పారు. ఈ సబ్జెక్టు యాప్ట్ అవ్వాలనే నలుగురు అందమైన అమ్మాయిలను వెతికి వెతికి మరీ ఈ సినిమాలో పెట్టడం జరిగింది. అంతేకాదు ఈ సినిమాను వరల్ వైడ్ గా విడుదల చేయాలనే ప్లాన్ లో కూడా ఉన్నాము. సినిమాలో వీరి పర్ఫామెన్స్ అద్భుతంగా ఉంటుంది. ఎవారూ పాత్రలు కాదు.. అందరూ హీరోయిన్సే.. హీరో సమీర్ ఖాన్ యాక్టింగ్ మెచూర్డ్ గా ఉంటుంది.. కొత్త అన్నట్టుగా ఎక్కడా కనిపిం చదు.. కథ విషయానికి వస్తే.. ఈ తరం అమ్మాయిలు ఏవిధంగా ఫాస్ట్ కల్చర్ ను అలవర్చుకున్నారు అనే విధంగా తెరకెక్కించ డం జరిగింది. కె ఎస్ అంటే హీరోల పాత్ర పేరు కుమార్ స్వామి, ఇక 100 అంటే వాళ్ళ వంద రోజుల స్నేహమే... కథ చాలా బాగా వచ్చింది. చాలా డిఫ్ఫరెంట్ స్టోరీ. మంచి మెసేజ్ ఓరి యెంటెడ్ అని చెప్పొచ్చు. సస్పెన్స్ త్రిల్లర్ తో సినిమాను తెరకెక్కించాము కనుక చూస్తున్న ప్రేక్షకుడు ఒక్క క్షణం కూడా బయటికి పోకుండా సినిమా పూర్తయ్యే వరకు థియేటర్ లోనే ఉండిపోతారు. అంత నమ్మకంగా చెప్పగలను ఈ సినిమా గురుంచి. నేను ఎప్పుడూ ఫ్లాప్ సినిమా చేయకూడదని తాపత్రయ పడుతాను.



సెన్సార్‌కి సిద్ధమైన 'దోషం' (నాకా..! దేవుడికా..?)

రా మూవీ రిక్రియేషన్స్ పతాకం పై కిషోర్, సన హీరో హీరోయిన్లుగా రఘు గోపసాని స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దోషం' నాకా..! దేవుడికా..? అనే క్యాప్షన్‌తో వస్తున్న ఈ చిత్రం ఇటీవలే పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని సెన్సార్‌కి రెడీ అవుతుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శక నిర్మాత రఘు గోపసాని మాట్లాడుతూ 'వజ్రాన్ని వజ్రంతో కోసినట్లు .మనిషిని పట్టి పీడిస్తున్న దోషాల తలలను కోయడానికి త్రిశులంగా దూసుకొస్తున్న 'దోషం' నాకా...! దేవుడికా..? అనే క్యాప్షన్‌తో రాబోతుంది. ఈ చిత్రంలోని నటీనటులు నెల్లూరులోని రామాపురం వాస్తవ్యులు. వీరందరు చాల చక్కగా నటించారు. వీరందరికి నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ చిత్రంలో విలన్‌గా నటించిన ప్రవీణ్ పున్నూరు అద్భుతంగా నటించాడు. ప్రస్తుతం ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తియ్యాయి.



ఆటిన్ రాణీ.. పూరీ పాప హంగామా!

ఉత్తర ప్రదేశ్‌లో పుట్టిన హాట్ ఆటమ్ బాంబ్ దిషా పటానీ. సినిమాల్లో కంటే ఎఫైర్లు..హాట్ హాట్ షోలతోనే ఎక్కువగా పాపులర్ అవుతోంది. ఉత్తరాదిలో పుట్టిన ఈ ఆరడుగుల ఆటీను రాణీ పూరి జగన్నథ్ రూపొందించిన ఋూలోఫర్‌ఋూ సినిమాతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించింది. తొలి సినిమాతోనే కుర్రకారు గుండెల్లో మంటపెట్టేసింది. 'లోఫర్' ఆశించిన ఫలితాన్ని అందించక పోయినా తెలుగులో ప్రయత్నించని దిషా బాలీవుడ్‌ని ఆకర్షించడం మొదలుపెట్టింది.

ధోనీ బయోపిక్‌తో దేశ వ్యాప్తంగా గుర్తింపును సొంతం చేసుకున్న దిషా ఆ తరువాత కెరీర్ పరగా వెనుతిరిగి చూసుకోలేదు. కెరీర్లో ఆశ్చర్యపరిచే ఆఫర్లు లేకపోయినా టైగర్ ష్రాఫ్తో ప్రేమాయణాన్ని సాగిస్తూ నిత్యం వార్తల్లో నిలిచి యూత్కు హాట్ ఫేవరేట్‌గా మారిపోయింది. అగ్నికి ఆజ్యం పోసినట్టుగా లోదుస్తుల ప్రచారం మొదలుపెట్టిన దిషా సోషల్ మీడియాను వేడెక్కించేసింది. నిత్యం తన పోస్టలతో ప్రస్తుతం యవత మతులు పోగొడుతోంది. లోదుస్తుల్లో ఎలాంటి బిడియం లేకుండా పోజులిచ్చిన తన ఫోటోలను సోషల్ మీడియా ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్లలో పోస్ట్ చేస్తూ సోషల్ మీడియా వేదికగా హంగామా సృష్టిస్తోంది.

దిషా సిల్వర్ స్క్రీన్‌పై ఎప్పుడు కనిపిస్తుందా? అని చూసేవాళ్లకంటే సోషల్ మీడియాలో ఎలాంటి హాట్ పిక్‌ను ఈ రోజు.. ఈ క్షణం పోస్ట్ చేస్తుందా? అని ఎదురుచూసే యూతే అత్యధికంగా వున్నారంటే దిషా సోషల్ మీడియాతో ఏ రేంజ్‌లో ఆడుకుంటుందో అర్థం చేసుకోవచ్చు.

దిషా తన లుక్స్‌కు తగ్గట్టు పర్ఫెక్ట్ బాడీ వుండటం కూడా యూత్ని బాగా ఎట్రాక్ట్ చేస్తోంది.

బీచ్ ఫోటోలతో.. సెక్సీ లుక్స్‌తో ఇంటర్నెట్‌లో మంటపెట్టేస్తున్న దిషా మానియాను ఆపడం ఇప్పట్లో ఎవరి తరమూ కాదు.

చక్కెర శాతాన్ని తగ్గించండి...



తీపి పదార్థాలంటే ఇష్టపడని వారుండరు. స్వీట్స్, బెల్లం, చక్కెరతో చేసిన వాటిని ఎక్కువగా తింటారు. ఎంత ఇష్టమున్నా కాస్త వాటిని తగ్గించి తింటే మంచిది. బెల్లం, చక్కెర రెండింటిని అధికంగా ఆరగిస్తుంటారు చాలామంది. అయితే, బెల్లం తినడం కంటే చక్కెరను అతిగా తీసుకోవడం వల్లే అనారోగ్య సమస్యలు వస్తాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. శరీరంలోకి అధిక మోతాదులో చక్కెర చేరితే కాలేయం దెబ్బతింటుంది. అధికంగా చక్కెరను తీసుకోవడం వల్ల కాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. ఎక్కువగా తీపి పదార్థాలు తినడం వల్ల దంతాలు కూడా పుచ్చిపోతాయి. చెడు బ్యాక్టీరియా నోరంతా వ్యాపిస్తుంది. శరీరంలో చక్కెర చేరడం వల్ల మధుమేహం దరిచేరుతుంది. శరీరానికి అవసరమైన విటమిన్స్, మినరల్స్ చక్కెరలో ఉండవు. ప్రాసెస్సింగ్ ఫుడ్స్, శీతలపానీయాలు తాగడం వల్ల అధిక బరువు పెరుగుతారు. శరీరంలో చక్కెర స్థాయి ఎక్కువైతే రక్తపోటు పెరుగుతుంది. ఫలితంగా గుండె జబ్బుల బారినపడుతారు.

పొదుపు మేలైన జీవితానికి మలుపు..



కోటి విద్యలు కూటి కొరకే.. అన్న నానుడి ఊరికే రాలేదు. అది అక్షరాలా సత్యం. ఇన్ని విద్యలు, ఉద్యోగాలు చేసేది పొట్ట కూటికే. అయితే కొంత మంది ఆలోచన లేక తొందరపాటు తనంతో డబ్బును చేజార్చుకుంటారు. మదుపు చేసే ప్రయత్నం తెలీక మోసపోతుంటారు. అలాంటి వారు కొన్ని ముందు జాగ్రత్తలను పాటిస్తే, అలాంటి మోసపూరిత విషయాల నుంచి బయట పడొచ్చు. అవేంటో చూద్దామా...

చాలామంది డబ్బును మదుపు చేసే క్రమంలో తొందరపాటు వ్యవహారాలను చేస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్లో వున్న పథకాల గురించి ముందుజాగ్రత్త తీసుకోకుండా ఇతరులు చెప్పే మాటలను నమ్మి మోసపోతారు. ఎవరో ఏదో పథకంలో పెట్టుబడి పెట్టారని వారి మాటలు విని, పెట్టుబడులు పెట్టి అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారు. ముఖ్యంగా మధ్య తరగతివారు ఇటువంటి ఇబ్బందులకు గురి అవుతుంటారు. తమకు వచ్చే కష్టార్జితంలో మిగిలే డబ్బులను పెట్టుబడి పెట్టి ఎక్కువ రాబడి పొందాలనే అతి ఆలోచనతో జాగ్రత్త తీసుకోకుండా తప్పుడు నిర్ణయాలను, పథకాలను ఎంచుకుంటారు.

కాబట్టి ఇటువంటి వ్యవహారాలలో ఏయే పథకాలను అమలు చేస్తే బాగుంటుంది? ఎంత మదుపు చేస్తే బాగుంటుంది? ఎటువంటి ప్రణాళికలు, ఏయే సమయాలలో పాటించాలి? అనే అంశాలపై నిపుణులు కొన్ని సూచనలను మనకు అందిస్తారు. వాటి ద్వారా తక్కువ సమయంలోనే మదుపు చేసిన డబ్బులతో అధిక రాబడిని పొందవచ్చు.

బంగారంతో ముప్పే..

ప్రస్తుతకాలంలో చాలామంది బంగారంలో మదుపు చేయడంలో ఎక్కువ మక్కువ చూపిస్తున్నారు. అయితే ఇది కొంతవరకు మంచిది కాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే మారుతున్న కాలాలను బట్టి, ఆర్థిక మందగమన ప్రభావాల వల్ల వాటి ధర తగ్గవచ్చు లేదా పెరగవచ్చు. కాబట్టి బంగారం మదుపు చేయడంలో పరోక్ష పద్ధతిని అనుసరించడం చాలా మంచిది. అలాగే గోల్డ్ ఈటీఎఫ్‌లు లేదా గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్‌లోగానీ పెట్టుబడి పెట్టే ఆలోచన పెట్టుకోవద్దు. అంతేకాక, బంగారం పథకం మీద మార్కెట్లో వున్న అనేక రకాల పథకాల నుంచి దూరంగా వుండాలనే సూచిస్తున్నారు.

భవిష్యత్తు కార్యాచరణ ముఖ్యం

పెట్టుబడి పెట్టేముందు జీవిత బీమా పాలసీ



వుందా లేదా అనేది పరిశీలించుకోవాలి. అదేవిధంగా ఆరోగ్య బీమా, వ్యక్తిగత ప్రమాద బీమా, ఇన్సూరెన్స్ పాలసీలను కూడా ఎంచుకోవాలి. వీటితో పాటు... భవిష్యత్తులో వచ్చే కష్టాలనుంచి బయటపడేందుకు కనీసం ఆరునెలలకు సరిపడేంత వ్యయాన్ని దగ్గర వుంచుకోవాలి. ఇవన్నీ వున్న తరువాత మీరు పెట్టుబడి పెట్టుకోవచ్చు. అలాగే ఎప్పటికప్పుడు వాటిని సమీక్షించుకోవడం మంచిది.

డబ్బు మదుపు అవసరం..

సాధారణంగా యుక్తవయస్సులో వున్నవారికి లేదా మధ్యవయస్సులవారికి పదవీ విరమణకు ఎక్కువ సమయం వుంటుంది కాబట్టి, దీర్ఘకాలిక పెట్టుబడులను పెట్టుకోవడం మంచిది. ఇలా చేయడం వల్ల ఎక్కువ డబ్బులు మదుపు అవ్వడమే కాకుండా భవిష్యత్తులో వచ్చే నష్టాలు, కష్టాల నుంచి సులభంగా గట్టెక్కొచ్చు. ప్రస్తుతకాలాల్లో ఏ ఆఫీసులో అయినా బోనస్‌లు, ప్రతి సంవత్సరం జీతం డబ్బులు పెరగడం వంటివి సహజం కాబట్టి వాటిని అనవసరంగా ఖర్చు చేయకుండా మదుపు చేసుకుంటే, ఊహించిన దాని కంటే ఎక్కువ రాబడిని పొందవచ్చు.



మార్గాలు ఎన్నో..!

చదువు పూర్తి అయ్యి సంపాదించడం మొదలు పెట్టగానే వచ్చే ఆదాయంలో ఖర్చులకు పోను మిగిలిన సొమ్మును ఎన్నో విధాలుగా పొదుపు చేయవచ్చు. రెగ్యులర్‌గా ఖాతా నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులను సంప్రదిస్తే మరిన్ని వివరాలు తెలుస్తాయి. వాటిలో కొన్ని...

సేవింగ్స్ డిపాజిట్ అకౌంట్స్

షరతులతో కూడిన వడ్డీని డిపాజిట్లపై బ్యాంకు వడ్డీ చెల్లిస్తుంది. ఈ డబ్బు ఎప్పుడు డ్రా చేసుకున్నప్పుడు వడ్డీ మాత్రం నెలనెలా ఖాతాలో జమ అవుతుంది.

జంబో సేవింగ్స్ అకౌంట్స్

పెద్ద డిపాజిట్స్‌కి బ్యాంకులు అధిక మొత్తంలో వడ్డీ చెల్లిస్తారు.

రివార్డ్స్ సేవింగ్స్ అకౌంట్స్

కొన్ని సేవింగ్స్ డిపాజిట్లపై రివార్డ్స్ కూడా



ఇస్తుంది బ్యాంకు.

జాయింట్ సేవింగ్స్

ఇద్దరు లేదా ముగ్గురు ఉమ్మడిగా అకౌంట్ నిర్వహిస్తున్నట్లయితే వడ్డీ కూడా లాభదాయకంగా ఉంటుంది.

స్టూడెంట్ సేవింగ్స్

విద్యార్థులకు, యువతకు మినిమమ్ బ్యాలెన్స్‌తో లాభదాయకమైన ఆఫర్లను కొన్ని బ్యాంకులు కల్పిస్తున్నాయి.

సర్టిఫికెట్స్ ఆఫ్ డిపాజిట్స్

ఎక్కువ కాలపరిమితి కలిగిన డిపాజిట్లు లాభదాయకంగా ఉంటాయి. గడువు లోపల డిపాజిట్లని పొందాలని అనుకుంటే నష్టమే ఎక్కువ.

కాలేజ్ సేవింగ్స్

వడ్డీ మాఫీ, పన్ను మాఫీ పద్ధతిలో విద్యార్థుల కోసం ప్రత్యేకమైన సేవింగ్స్ పథకాలు ఉన్నాయి. ఈ విషయంలో బ్యాంకు అధికారులను సంప్రదిస్తే సూచనలిస్తారు.

పదవీ విరమణ బెనిఫిట్స్

సంపాదించే సమయంలో బ్యాంకులో కూడబెట్టిన సొమ్ముపై రిటైరయ్యాక మంచి బెనిఫిట్స్ ఉంటాయి.

హెల్త్ సేవింగ్స్

ఇవన్నీ కూడా టాక్స్ ఫ్రీ సేవింగ్స్. పన్ను కట్టాల్సిన అవసరం ఉండదు. కాబట్టి పెట్టుబడి సొమ్ము పెరుగుతూ పోతుంది.

ఆహ్లాదాన్నిచ్చే పెంటాస్ ప్లాంట్స్..



మామూలుగా మనకు తెలిసిన పూల మొక్కలు కొన్ని మాత్రమే. కానీ తెలియనివి చాలానే ఉన్నాయి. వాటిలో ఒక రకం మొక్క ఈ పెంటాస్. ఇల్లు పచ్చదనంతో నిండాలన్నా, ఆహ్లాద వాతావరణాన్ని అందించాలన్నా ఇలాంటి అరుదైన మొక్కలు ఉండాల్సిందే. ఇవి అన్ని మొక్కల్లా ఒకటి, రెండు పూలు కాకుండా ఒకేసారి యాభై పువ్వుల దాకా అందిస్తాయి. వీటిలో మీకు నచ్చిన రంగును కూడా ఎంపిక చేసుకోవచ్చు.

ఇంటి ముంగిట్లో రంగుల హరివిల్లు వెల్లివిరియాలంటే పెంటాస్ మొక్కల్ని పెంచాల్సిందే. కంటికింపైన రంగుల్లో వుండే ఈ పూలకు మరో ప్రత్యేకత ఉంది. తుమ్మెదలూ, తూనీగలూ, సీతాకోక చిలుకలను ఆకర్షించి ఇవి పెరటి వాతావరణాన్ని రమణీయంగా మార్చేస్తాయి. నడిచే దారికి అటూ ఇటూ ఈ మొక్కలతో పరిధి గీయొచ్చు. నేలలో పెంచినా, కుండీల్లో ఉంచినా మూడు అడుగుల ఎత్తు వరకూ చక్కగా పెరుగుతాయి. ఈ మొక్క పుట్టింది విదేశంలో అయినా మన వాతావరణంలో బాగా పెరుగుతుంది. ఎండాకాలం మినహా మిగిలిన కాలాల్లో గుత్తులు గుత్తులుగా పూలు విరబూస్తుంది. పెంటాస్ పూల మొక్కలు తెలుపూ, ఎరుపూ, గులాబీ, పసుపు ఇలా సుమారు పది రంగుల్లో లభిస్తాయి. సాధారణగా ఒక్కో పూలగుత్తిలో నలభై నుంచి యాభై వరకు పూలు ఉంటాయి. సమృద్ధిగా పోషకాలు అందితే అరవై, డెబ్భై వరకూ కూడా వస్తాయి.

ఎక్కువ ఎండ తగలొద్దు..

పెంటాస్ మొక్కకు రోజూ రెండు మూడు గంటల పాటు ఎండ తగలడం అవసరం. అయితే నేరుగా బాగా ఎండ తగిలితే తట్టుకోలేదు. అందుకే తూర్పు, పడమర దిశల్లో వీటిని ఉంచడం మేలు. ఆకుల మధ్య దూరం పెరగడాన్ని ఎండ వేడి ఎక్కువ అవడానికి సూచనగా తీసుకోవచ్చు. ఎండ ఎక్కువైతే ఆకుల చివర్లు మాడిపోతాయి. ఆకులు పసుపు రంగులోకి మారిపోతాయి. మొక్క నాటిన కొన్నాళ్లకే పువ్వులు పూయడం మొదలుపెడుతుంది. రోజూ ఒక్క పువ్వు అయినా పూస్తుంది. మరిన్ని పూలు రావాలంటే మాత్రం తగు మోతాదులో పోషకాలు అందించడం తప్పనిసరి.







తేమ అవసరం..

బంక లేని మట్టిలో ఈ మొక్క బాగా ఎదుగుతుంది. మట్టితో పాటు సమాన పరిమాణంలో సేంద్రియ ఎరువుని కూడా కలిపితే మొక్కకు తగిన పోషకాలతో పాటు గాలి అందుతుంది. ఎప్పటికప్పుడు మట్టిలో తేమ తగ్గిపోకుండా చూసుకోవాలి. లేదంటే ఆకులు వాడిపోతాయి. మట్టి, ఎరువులతో పాటూ తగిన మోతాదులో కోకోపీట్ కూడా కలుపుకున్నప్పుడు తేమ నిలిచి ఉంటుంది. నెలకోసారి నీటిలో కరిగే ఎన్‌పీకేను 6:2:4 మోతాదులో కలిపి మొక్కకు చల్లుకోవాలి. ఈ మొక్కలను కుండీల్లో నాటాలనుకుంటే పది అంగుళాల పరిమాణంలో ఉన్న వాటిని ఎంచుకోవాలి. నేలలో అయితే ఒకటిన్నర అడుగుల దూరంలో నాటాలి. అప్పుడే గుబురుగా అందంగా కనిపిస్తాయి.

విత్తనాలు దొరుకుతాయి..

మొక్కను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. అప్పుడే పూలు ఎక్కువగా పూస్తాయి. పువ్వు విచ్చుకొని రాలిపోయాక కణుపుల వరకూ కత్తిరించుకోవాలి. కాండాన్ని కత్తిరించి మట్టిలో గానీ, కోకోపీట్‌లోగానీ పెట్టడం ద్వారా కొత్త మొక్కలను ఉత్పత్తి చేయొచ్చు. విత్తనాలూ అందుబాటులో ఉన్నాయి. పేనుబంక, నల్లదోమ, తెల్లదోమ వంటివి సాధారణంగా ఈ మొక్కలపై దాడిచేసే ప్రమాదం ఉంది. వ్యాధి సోకిన కొమ్మను వేరు చేయడం వల్ల ఇన్‌ఫెక్షన్లను అరికట్టవచ్చు. తరచూ వేప నూనెని చల్లడం వల్ల ప్రయోజనం ఉంటుంది. ఎంచుకునే రంగూ, పరిమాణాన్ని బట్టి ఒక్కో పెంటాస్ మొక్క ఖరీదు ఇరవై నుంచి వంద రూపాయాల వరకూ ఉంటుంది.

మాటే మంత్రం..



జీవితంలో పదిమందిని బాధపెట్టి ఎదగడం గొప్పకాదు.. పదిమంది బాధను తీర్చిపైకి రావడమే గొప్ప...

చిన్నారుల భారం..



పిల్లలు బొద్దుగా ఉంటే, ముద్దుగా ఉన్నారని మురిసిపోకండి. ఇప్పుడు బొద్దుగా ఉంటే, పెరిగేకొద్ది సన్నగా అవుతారని అస్సలు అనుకోకండి. ఇప్పుడు ఏం పర్లేదని వదిలేస్తే, రానురాను పిల్లల పరిస్థితి ఎలాంటి వ్యాధులకు దారి తీస్తుందో ఊహించుకోలేరు. అందుకే పిల్లలు లావుగా ఉంటే ఇప్పటి నుంచే వారిపై దష్టి పెట్టి వైద్యులను సంప్రదించడం మంచిది. బొద్దుతనమే భవిష్యత్తులో మీ చిన్నారిని ఇబ్బందుల పాలుజేస్తుంది. అవును.. ఊబకాయం ప్రపంచానికి పెనుముప్పుగా మారుతోంది. ముఖ్యంగా చిన్న పిల్లలు.. 19 ఏళ్ల లోపు వయసు గల యువతి, యువకుల్లో ఇది తీవ్ర సమస్యగా మారింది. గత నాలుగు దశాబ్దాల్లో మనుషులు విపరీతంగా బరువు పెరిగే సమస్య పది రెట్లు పెరిగింది. గతంలో ఈ సమస్య కేవలం అభివృద్ధి చెందిన దేశాలకే పరిమితమనే అభిప్రాయం ఉండేది. కానీ నేడు అభివృద్ధి చెందుతున్న, పేద దేశాల్లోనూ ఊబకాయుల సంఖ్య పెరిగిపోతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనంలో తేలింది.



దీని ప్రకారం ఐదు నుంచి 19 సంవత్సరాల వయస్సులోపు బాల, బాలికల్లో ఊబకాయంతో బాధపడుతున్న వారు 1.10 కోట్ల మంది నుంచి నేటికి ఈ సంఖ్య 12.40 కోట్లకు పెరిగింది. వీరే కాకుండా అధిక బరువుతో ఉన్న వారు మరో 21.30 కోట్ల మంది ఉన్నారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు ఊబకాయానికి ప్రధాన కారణాలని శాస్త్రవేత్తలు విశ్లేషించారు. ప్రాసెస్ చేసిన హై కేలరీలు, పోషకాలు గల ఆహారం అధికంగా తీసుకోవడం దానికి తోడు తగినంత వ్యాయామం, శారీరక శ్రమ లేకపోవడం సమస్యను మరింత తీవ్రం చేస్తోంది. అధిక బరువు కారణంగా పలు రకాల అనారోగ్య సమస్యలు చుట్టుముడుతాయి.

చురుకుతనం తగ్గిపోవడం, నలుగురిలో కలవడానికి సిగ్గుపడటంతో పాటు మధుమేహం, రక్తపోటు, గుండెపోటు వంటి వ్యాధులు వస్తాయి. మార్కెట్లో అధిక కేలరీలు కలిగిన ప్రాసెస్డ్ ఫుడ్ చాలా తక్కువ ఖర్చుకే వచ్చేస్తుండటంతో ప్రజలు వాటి వైపు మొగ్గు చూపుతున్నారు. పిల్లలు కూడా టీవీలు, కంప్యూటర్లు, ఫోన్‌లు చూస్తూ పెరుగుతున్నారు. నేటి తరం చిన్నారుల్లో శారీరక శ్రమతో కూడిన ఆటలు ఆడేవారిని వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. పిల్లలను ఇలాంటి వాతావరణం నుంచి దూరం చేసి వారికి శారీరక శ్రమ అలవాటు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. లేదంటే ఇది ప్రపంచం ముందు అతి పెద్ద సవాలుగా నిలుస్తుందని హెచ్చరిస్తున్నారు.

కోడిగుడ్లు రిటైల్ ధర (100కు)



హైదరాబాద్	410	విజయవాడ	435
ముంబయి	468	ఢిల్లీ	445
చెన్నై	450	బెంగళూరు	445

బ్రాయిలర్ చికెన్ ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.



హైదరాబాద్	120	ఢిల్లీ	130
కరీంనగర్	115	ముంబయి	125
వరంగల్	120	చెన్నై	135

సెన్సెక్స్ +12.53
36,386



నిఫ్టీ +1.75
10,906

రూపాయి
₹71.17
(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
32,587
(హైదరాబాద్‌లో) 24 క్యా..10 గ్రాములకు/(రూ.)లలో

రూపాయికే 1జీబీ డేటా

- భారత్ ఫైబర్ ను ప్రారంభించిన బీఎస్ఎన్ఎల్

ఢిల్లీ: భారత ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ శుక్రవారం 'ఫైబర్ టు ది హోం' సర్వీసు 'భారత్ ఫైబర్'ను ప్రారంభించింది. జీబీకి రూ.1.1తో రోజుకు 35 జీబీ డేటాను ఆఫర్ చేస్తోంది. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌కు కౌంటర్‌గా ఈ ఆఫర్‌ను తీసుకొచ్చినట్టు తెలిపింది. ముకేశ్ అంబానీ సారథ్యంలోని జియో త్వరలోనే 'గిగా ఫైబర్' పేరుతో బ్రాడ్ బ్యాండ్ సేవలు అందించేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం దేశంలోని 1400 నగరాల్లో ప్రయోగాత్మకంగా సేవలు అందిస్తోంది. త్వరలోనే దీనిని వాణిజ్య అసరాల కోసం ప్రారంభించనున్నారు. భారతీ ఎయిర్‌టెల్ కూడా వైర్‌లైన్ బ్రాడ్ బ్యాండ్ సర్వీసును విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో ముందుగానే అప్రమత్తమైన బీఎస్ఎన్ఎల్ శుక్రవారం 'భారత్ ఫైబర్'ను ప్రారంభించింది. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ బ్రాడ్ బ్యాండ్ డైరెక్టర్ ఆఫ్ సీఎఫ్ఏ వివేక్ బంజాల్ మాట్లాడుతూ.. దేశంలో ఇప్పుడు సూపర్ ఫాస్ట్ ఇంటర్నెట్ సేవలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడిందన్నారు. గతంలో కంటే ఇప్పుడు ఇంటర్నెట్‌తో అనుసంధానమయ్యే వస్తువుల సంఖ్య పెరిగిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకునే ఫైబర్ టు హోం టెక్నాలజీని అప్‌గ్రేడ్ చేసినట్టు చెప్పారు. భారత్ ఫైబర్‌ను ప్రారంభించినందుకు ఆనందంగా ఉందన్నారు.


ఫ్లాట్‌గా ముగిసిన దలాల్ స్ట్రీట్



ముంబయి: దలాల్ స్ట్రీట్ ఈ వారాంతాన్ని ఫ్లాట్‌గా ముగించింది. శుక్రవారం ఉదయం స్వల్ప లాభాలతో ప్రారంభమైన సూచీలు వెంటనే నష్టాల్లోకి జారిపోయాయి. మళ్లీ చివరిలో కాస్త కోలుకుని స్వల్ప లాభాల్లోకి వచ్చాయి. సన్ ఫార్మా షేర్లు కుప్పకూలడం మార్కెట్లపై ప్రభావం చూపింది. ఈ కంపెనీ షేర్లు దాదాపు 11శాతం పడిపోయాయి. రిలయన్స్ షేర్లు దాదాపు నాలుగు శాతం లాభపడ్డాయి. సెన్సెక్స్ 60 పాయింట్లకు పైగా లాభంతో 36,400 పాయింట్ల వద్ద, నిఫ్టీ 14 పాయింట్ల లాభంతో 10,900 పాయింట్ల వద్ద ప్రారంభమయ్యాయి. చివరకు సెన్సెక్స్ 12.53 పాయింట్ల లాభంతో 36,386.61 పాయింట్లకు చేరగా, నిఫ్టీ 1.80పాయింట్ల స్వల్ప లాభంతో 10,907 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ రిలయన్స్, విప్రో, కొటక్ మహీంద్రా, హిందాల్కో, అదానీ పోరట్స్ తదితర కంపెనీల షేర్లు లాభపడ్డాయి. సన్ ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, గెయిల్, లార్సెన్, హెచ్‌పీసీఎల్ తదితర కంపెనీల షేర్లు నష్టపోయాయి. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.71.12 వద్ద ట్రేడవుతోంది.

గుజరాత్‌లో రూ.3 లక్షల కోట్లు పెట్టుబడి

- డేటాపై ఇతర దేశాల గుత్తాధిపత్యాన్ని అడ్డుకోవాలి : ముకేష్ అంబానీ



గాంధీనగర్: భారతీయులకు సంబంధించిన వివరాలపై ఇతర దేశాల గుత్తాధిపత్యం అడ్డుకొనేలా చర్యలు తీసుకోవాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. అలాగే రానున్న పది సంవత్సరాల్లో తమ సంస్థ గుజరాత్‌లో రూ.3లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించారు. గాంధీనగర్‌లో తొమ్మిదో వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్‌లో మాట్లాడుతూ.. గుజరాత్ ఎప్పటికీ తమ మొదటి ప్రాధాన్యమన్నారు.రాజకీయ వలసవాదానికి వ్యతిరేకంగా జాతిపిత మహాత్మా గాంధీ చేపట్టిన ఉద్యమాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ.. 'రాజకీయ వలసవాదాన్ని పారద్రోలడానికి గాంధీజీ జాతీయోద్యమానికి నాయకత్వం వహించారు.

ఇప్పుడు మనందరం కలిసి డేటా వలసవాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ కొత్త ప్రపంచంలో డేటా అనేది కొత్త సంపద. భారత్‌కు చెందిన డేటాకు భారతీయులే నేతృత్వం వహించాలి. విదేశాల గుత్తాధిపత్యాన్ని అడ్డుకోవాలి. భారత్‌లో సమాచార విప్లవాన్ని తీసుకురావడంలో విజయం సాధించడానికి మన సంపదపై నియంత్రణను మన ఆధీనంలోకే తెచ్చుకోవాలి' అని వెల్లడించారు. ప్రధాని చేతల మనిషని, డిజిటల్ ఇండి యా మిషన్ లక్ష్యాల్లో దీన్ని చేర్చుతారని ముకేశ్ విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే రానున్న పది సంవత్సరాల్లో గుజరాత్‌లో వివిధ రంగాల్లో రూ.3లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనున్నామని ప్రకటించారు. 'గుజ రాత్ రిలయన్స్ జన్మభూమి. అలాగే కర్మభూమి. మా మొదటి ప్రాధాన్యం ఎప్పటికీ గుజరాత్ రాష్ట్రమే' అని స్పష్టం చేశారు. అలాగే పండిట్ దీన్ దయాళ్ విశ్వవిద్యాలయ నిర్మాణానికి రూ.150 కోట్లు కేటాయించనున్నామని తెలిపారు.

సెక్షన్ 29ఏ పరిధి చాలా విస్తృతం

- ఎస్‌బీఐ ఛైర్మన్ రజనీష్ కుమార్



ముంబై: దివాల చట్టంలోని సెక్షన్ 29ఏ పరిధి చాలా విస్తృతంగా ఉందని ఎస్‌బీఐ ఛైర్మన్ రజనీష్ కుమార్ తెలిపారు. ఈ సెక్షన్ రుణ పరిష్కార ప్రక్రియ కింద నిర్వహించే వేలానికి సదరు సంస్థకు సంబంధించిన ప్రమోటర్లు, వారి కుటుంబ సభ్యులను దూరంగా ఉంచుతుంది. ఇప్పటికే ఈ సెక్షన్‌కు సంబంధించి పలు వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐ ఛైర్మన్ మాట్లాడుతూ .. ఈ సెక్షన్ పరిధి చాలా విస్తృతమైందని భావిస్తాను. దీనిపై ప్రభుత్వం స్పష్టతను ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. సంస్థ దివాలాకు కారణమైన వ్యక్తులు మళ్లీ కీలక పదవుల్లో కూర్చోకూడదనేది ఈ సెక్షన్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సెక్షన్‌పై స్పష్టతనివ్వాల్సిన సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు. చాలా చోట్ల ఈ సెక్షన్ సమస్యాత్మకంగా మారిందన్నారు. ఆలస్యంగా బిడ్డింగ్‌లో పాల్గొనేవారిపై కూడా ఆయన అసహనం వ్యక్తం చేశారు. కొన్ని నెలల పాటు బిడ్డింగ్ ప్రక్రియ జరిగినా వారు మౌనంగా ఉంటారన్నారు. అంతా ముగిశాక రూ.15వేల కోట్లకు బిడ్ ఖరారైతే.. రూ.16వేల కోట్లు చెల్లిస్తామంటూ వస్తారని వ్యాఖ్యానించారు. ఒకసారి ఇటువంటి వారిని అనుమతిస్తే మొత్తం బిడ్డింగ్ ప్రక్రియ దెబ్బతింటుందని అభిప్రాయపడ్డారు.

బిడ్డింగ్ ఖరారైనా చేతికి వస్తుందో లేదో అనే అపనమ్మకంతో ఎవరు దీనిని సీరియస్‌గా తీసుకోరని తెలిపారు.కొందరు బిడ్‌లో విజయం సాధించాక కూడా పూర్తి మొత్తాలు చెల్లించడంలేదని రజనీష్ కుమార్ వెల్లడించారు. వీరికి భారీగా అపరాధ రుసుంలు విధించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఇలాంటి వారి వల్లే దివాల పరిష్కార ప్రక్రియ వేగం మందగిస్తుందన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు ఎయిర్‌ఇండియా స్పెషల్ డిస్కౌంట్స్



ఢిల్లీ: సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక డిస్కౌంట్లను ప్రకటించాలని ఎయిర్ ఇండియా నిర్ణయించింది. ఎయిర్ ఇండియా వెబ్‌సైట్ నుంచి 60 ఏళ్లు పైబడిన భారత పౌరులు బుక్ చేసుకునే ప్రతి ఎకానమీ క్లాస్ టికెట్‌పైనా 50 శాతం వరకూ రాయితీని ఆఫర్ చేయనున్నారు. 60 సంవత్సరాలు మించిన సీనియర్ సిటిజన్లు వయసును ధ్రువీకరించేందుకు ప్రభుత్వం గుర్తించిన సరైన గుర్తింపు కార్డులను చూపి ఈ ఆఫర్‌ను పొందవచ్చని ఎయిర్ ఇండియా పేర్కొంది. ప్రయాణ తేదీకి వారం రోజుల ముందు ఈ ఆఫర్‌ను ఉపయోగించుకోవచ్చు. దీంతో పాటు చిన్నారులతో ప్రయాణించే సీనియర్ సిటిజన్‌కు రూ 1000ల ప్రత్యేక డిస్కౌంట్‌ను కూడా ఎయిర్ ఇండియా ప్రవేశపెట్టింది. ఎయిర్ ఇండియా ప్రత్యేక ఆఫర్‌తో దేశంలో పెద్దసంఖ్యలో ఉన్న సీనియర్ సిటిజన్లకు విమాన ప్రయాణం అందుబాటులోకి రానుంది.

పెరిగిన చమురు ధరలు



ముంబై: దేశీయంగా తగ్గినట్టే తగ్గి వినియోగదారులను మురిపించిన ఇంధన ధరలు క్రమంగా పైపైకి ఎగబాకుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరల ప్రభావంతో జనవరి నుంచి మొదలుపెట్టి వరుసగా శుక్రవారం కూడా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. దేశ రాజధాని ఢిల్లీలో పెట్రోల్ ధర 8 పైసలు, డీజిల్ ధర 19 పెరిగింది. దీంతో ఢిల్లీలో పెట్రోల్ ధర రూ.70.55కి.. డీజిల్ ధర రూ.64.97కి పెరిగింది. ముంబై : పెట్రోలు ధర రూ.76.18, డీజిల్ రూ.68.02. చెన్నై: పెట్రోల్ రూ.73.23 డీజిల్ రూ.68.62, కోలకతా: పెట్రోల్ రూ.72.65, డీజిల్ రూ.66.74, హైదరాబాద్: పెట్రోల్ ధర రూ.74.84, డీజిల్ ధరరూ.70.63 , విజయవాడ : పెట్రోల్ రూ.74.64 డీజిల్ రూ.70.05 .

బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 61.67 డాలర్ల వద్ద.. డబ్ల్యూటీఐ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 52.87 డాలర్ల వద్ద ఉంది. ఈ నెలలో పెట్రోల్ ధర 9సార్లు, డీజిల్ ధర 10సార్లు పెరిగింది. దీంతో పైసా పైసా పెరుగతూ వస్తున్న ధరలు మళ్లీ పాత స్థితికి చేరుకుంటూ వుండటంతో వినియోగదారుల గుండెల్లో గుబులు మొదలైంది.

స్పోర్ట్స్


సెమీస్‌లో సైనా నెహ్వాల్

- ఒకుహరాపై ఘనవిజయం సాధించిన స్టార్ షట్లర్



కౌలాలంపూర్: మలేషియా మాస్టర్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ సెమీఫైనల్‌లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో జపాన్‌కు చెందిన నొజోమి ఒకుహరాను 21–18, 23–21 తేడాతో ఓడించింది. 48 నిమిషాల పాటు హోరా హోరీగా జరిగింది. 2017 టైటిల్ విన్నర్‌గా, 2011లో రన్నరప్‌గా నిలిచింది. తదుపరి జరుగనున్న మ్యాచ్‌లో మూడు సార్లు వరల్డ్ ఛాంపియన్ కరోలినా మారిన్‌తో తలపడనుంది. గతంలో సైనా, మారిన్‌ను ఐదుసార్లు ఓడించింది. మహిళల సింగిల్స్ విభాగంలో సైనా, ఒకుహరా 9–9 పాయింట్లతో సమంగా ఉన్నప్పుడు ఒకుహరా వరుసగా 6 స్ట్రెట్ పాయింట్లు సాధించగా వెంటనే సైనా 17–16తో లీడ్ సాధించింది. ఆ దశలో సైనా ఆటను పూర్తి చేయబోతుండగా ఒకుహరా పుంజుకొని 17–17తో సమం చేసింది . రెండవ గేమ్‌లో 4–2తో సైనా లీడ్‌లో సాధించింది. బ్రేక్ సమయానికి ఇద్దరూ 11–9 పాయింట్లు సాధించారు. బ్రేక్ తర్వాత సైనా 14–12తో లీడ్ సాధించగా ఒకుహరా ఒక్కసారిగా ఆటలో దూకుడు పెంచి 18–14తో లీడ్ లోకి వెళ్లింది. సైనా తన గేమ్‌ను మార్చి ఆడటంతో 19–19తో స్కోర్‌ను సమం చేసింది. ఆట చివరిలో సైనా ఆటలో దూకుడు మరింత పెంచి వరుస స్మాష్ షాట్స్ ఆడుతూ ఒకుహరాను కోలుకోనీయకుండా చేసింది. ఈ నేపథ్యంలో వరుసగా రెండో సెట్‌ని కైవసం చేసుకుని సెమీస్‌లో అడుగుపెట్టింది. మరోవైపు పురుషుల సింగిల్స్ విభాగంలో కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్స్‌లో వరల్డ్ 4వ సీడెడ్ దక్షిణ కొరియా షట్లర్ సోన్ వాన్ హో చేతిలో పరాజయం పాలయ్యాడు. సుమారు గంట 10 నిమిషాల పాటు జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో 23–21, 16–21, 17–21 తేడాతో ఓటమి చెందాడు.

నాలుగో రౌండ్ చేరిన మరియా షరపోవా



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ లో రష్యా స్టార్ టెన్నిస్ క్రీడాకారిణి మారి యా షరపోవా నాలుగో రౌండ్‌లోకి ప్రవేశించింది. డిఫెండింగ్ ఛాంపియన్ కర్లోనీ వోజ్నియాకీని 6–4, 4–6, 6–3 తేడాతో షరపోవా మట్టికరిపించింది. మొదటి సెట్ నుండి ఇరువురూ ఒకరిపై ఒకరు ఆధిపత్యం చెలాయించడం కోసం తీవ్రంగా శ్రమించారు. గత కొన్ని టోర్నీల నుండీ ఆశించిన స్థాయిలో రాణించలేక పోతున్న షరపోవా ఆస్ట్రేలియా ఓపెన్‌లో మాత్రం తన మునుపటి ఆట తీరును కొనసాగిస్తోంది. షరపోవా చివరిసారిగా రోనాల్డ్ గారోస్‌లో 2014లో గ్రాండ్‌స్లామ్ గెలుచుకుంది. 2017లో డ్రగ్స్ కేసు వల్ల 15నెలల పాటు షరపోవా నిషేధం ఎదుర్కొన్న విషయం విధితమే.

ఆసీస్ గడ్డపై భారత్ చారిత్రాత్మక విజయం






- వన్డే సీరీస్‌సు కైవసం చేసుకున్న టీం ఇండియా
- సంపూర్ణ విజయాలతో ఆస్ట్రేలియా టూర్‌ని ముగించిన కోహ్లీ సేన
- చివరి వన్డేలో 6 వికెట్లతో చెలరేగిన చాహల్
- మ్యాన్ ఆఫ్‌ది సీరీస్‌గా ధోనీ

మెల్‌బోర్న్: ఆసీస్ గడ్డపై కోహ్లీ సేన సంచలనం సృష్టించింది. సిరీస్ ఫలితాన్ని తేల్చే చివరిదైన మూడో వన్డేలో అరోన్ ఫించ్ సేనపై అద్భుత విజయం సాధించి రికార్డులకెక్కింది. మూడు వన్డేల సిరీస్‌ను 2–1 తో గెలుచుకుని ఆసీస్ టూర్‌ను ఘనంగా ముగించింది. కంగారూలపై ఆ దేశ గడ్డపై టెస్టు, వన్డే సిరీస్‌లను సొంతం చేసుకున్న తొలి భారత కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ రికార్డులకెక్కాడు.. లెగ్ స్పిన్నర్ చహల్ బంతితో మాయ చేస్తే.. బ్యాట్‌తో మహేంద్రసింగ్ ధోని(87 నాటౌట్: 114 బంతులు, 6 ఫోర్లు), కేదార్ జాదవ్(61 నాటౌట్ :57బంతులు, 7ఫోర్లు)లు కడవరకు పోరాడి భారత్‌కు విజయాన్నందించారు.

ధోని 'హ్యాట్రిక్'

కేదార్ జాదవ్‌తో ధోని జాగ్రత్తగా ఆడాడు. ఈ క్రమంలో ధోని 74 బంతుల్లో 3 ఫోర్లతో కెరీర్‌లో 70వ అర్థ సెంచరీతో ఈ సిరీస్‌లో హ్యాట్రిక్ సాధించాడు. తొలి రెండు వన్డేల్లో ఈ జార్ఖండ్ డైనమైట్ అర్థసెంచరీలు సాధించిన విషయం తెలిసిందే. ఎప్పటిలానే ఎలాంటి సంబరాలు లేకుండా మరుసటి బంతికి ధోని సిద్ధమయ్యాడు. ఇక ధోనికి మద్దతుగా జాదవ్ కూడా ఆచితూచి ఆడుతూ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 52 బంతుల్లో 5 ఫోర్లతో కెరీర్‌లో మూడో హాఫ్ సెంచరీ సాధించాడు. చివర్లో కొంత ఉత్కంఠ నెలకొన్నా.. ధోని, జాదవ్‌లు బౌండరీలు బాదడంతో భారత్ నాలుగు బంతులు మిగిలి ఉండగానే 7 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. ఆసీస్ బౌలర్లలో రిచర్డ్‌సన్, సిడిల్, స్టొయినిస్‌లకు తలో వికెట్ దక్కింది. ఇక ఈ మ్యాచ్ ప్రారంభంలో వరణుడు కొంత టెన్షన్ పెట్టడంతో ఆటకు కాసేపు అంతరాయ కలిగింది. ఆరు వికెట్లతో చెలరేగిన చహల్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు వరించగా.. సిరీస్‌లో హ్యాట్రిక్ హాఫ్ సెంచరీలతో రాణించిన ధోనికి మ్యాన్ ఆఫ్‌ది సిరీస్ అవార్డు దక్కింది.

ఏ స్థానంలో అయినా ఆడేందుకు సిద్ధమే: ధోనీ



జట్టుకు అవసరమైనప్పుడు ఏ స్థానంలోనైనా ఆడేందుకు సిద్ధంగా ఉన్నానని టీమిండియా మాజీ సారథి మహేంద్రసింగ్ ధోనీ స్పష్టం చేశాడు. 'జట్టుకు అవసరమైనప్పుడు ఏ స్థానంలో ఆడేందుకైనా సిద్ధం. నేను నాలుగో స్థానంలో ఆడినా, ఆరో స్థానంలో ఆడినా జట్టుకు సమతూకం తీసుకురావడం కీలకం. 14 ఏళ్ల అనుభవం తర్వాత ఆరో స్థానంలో ఆడనని చెప్పలేను. పిచ్ చాలా మందకొడిగా ఉంది. షాట్లు ఆడటం కష్టమైంది. అందుకే క్రీజులో పాతుకుపోవాలని అనుకున్నాం. కేదార్ జాదవ్ అద్భుతంగా ఆడాడు. వినూత్నమైన షాట్లు ప్రయత్నించాడు. ఆసీస్ బౌలర్లు కఠినంగా బంతులు విసిరారు. కేదార్ బ్యాటు, బంతితో జట్టుకు సాయపడతాడు. కుల్‌దీప్ గతంలో ఆస్ట్రేలియాతో ఆడాడు. దీంతో ఊహించని విధంగా చాహల్‌ను తీసుకొని ఆశ్చర్యపరిచాం. అనుకున్నట్టే అతడు రాణించాడు. ఆసీస్ పర్యటన చిరస్మరణీయంగా సాగింది. టీ20 సిరీస్ డ్రా చేశాం. టెస్టు, వన్డే సిరీస్‌లు గెలిచాం' అని ధోనీ పేర్కొన్నాడు.

ఆరేసిన... చాహల్



టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్.. చాహల్ (6/42) దాటికి 48.4 ఓవర్లలో 230 పరుగులకు ఆలౌటైంది. హ్యాండ్‌స్కోంబ్ (58) అర్ధసెంచరీ మినహా.. అలెక్స్ క్యారీ(5), ఫించ్(14) ఖవాజా (34), షాన్ మార్ష్(39), మ్యాక్స్‌వెల్ (26), రిచర్డ్‌సన్(16), ఫించ్(14), సిడిల్ (10)లు విఫలమయ్యారు. భారత్ బౌలర్లలో చాహల్ 6 వికెట్లు తీయగా.. భువనేశ్వర్, షమీలు రెండేసి వికెట్లు దక్కించుకున్నారు.

231 పరుగుల సాధారణ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆదిలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రెండు వన్డేల్లో రాణించిన ఓపెనర్ రోహిత్ శర్మ (9) ఈ మ్యాచ్‌లో విఫలమయ్యాడు. సిడిల్ బౌలింగ్‌లో మార్ష్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన కెప్టెన్ కోహ్లితో శిఖర్ ధావన్ జట్టు స్కోర్‌ను 50 పరుగులు దాటించాడు. ఈ తరుణంలో శిఖర్ (23), స్టొనిస్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. తర్వాత అనూహ్యంగా నాలుగో స్థానంలో బ్యాటింగ్ వచ్చిన ఎంఎస్ ధోని వచ్చిరావడంతోనే మ్యాక్స్‌వెల్‌కు క్యాచ్ ఇచ్చాడు. కానీ మ్యాక్సీ జార విడచడంతో ధోని ఊపిరి పీల్చుకున్నాడు. ధోనితో కలిసి కోహ్లి ఆచితూచి ఆడుతూ.. మూడో వికెట్‌కు 54 పరుగులు జోడించాడు. అనంతరం కోహ్లి(46) కీపర్ క్యారీకి క్యాచ్ ఇచ్చి అర్థశతకాన్ని చేజార్చుకున్నాడు.

Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal – Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD–500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.